Pubilshed from Tirupathi
PRGI NO : APTEL/25/A2316

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు
Prajabhoomi Telugu Daily
www.prajabhoomi.com




తిరుపతి TIRUPATHI | సంపుటి : 02 Vol.No : 02 | సంచిక : 03 Issue No : 03 | మంగళవారం Tuesday | ఆగస్టు 4, 2026 4 AUGUST 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి Editor : Ankireddypalle Ramamohan Reddy | పేజీలు : 12 Pages 12 | వెల : 3 రూ Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana

# శభాష్ పద్మజ గారు..

» మీకు చేతులెత్తి మొక్కినా తక్కువే... » పేరుకే మహిళా అధికారి అయినా... » పురుష అధికారులకు పౌరుషం ఉందా అన్నట్లుగా... » నిధులు లేక పోయినా... » విధుల నిర్వహణ లో సూపర్... » పాడుబడుతున్న వాహనాన్ని ప్రయోజనం లోకి తెచ్చి... » చక్కటి పందిరి లో ఉంచి.. » ప్రభుత్వ అధికారులంటే పద్దతి ఉండాలంటూ.. » జిల్లా కలెక్టర్ ను ఒప్పించి...మెప్పించి లే.. » సమస్యలు ఎదుర్కొంటూనే వాటిని సవాల్ గా స్వీకరించి.. » స్వీయ ధర్మంలో స్వయం తప్పిదం లేకుండా.. » సమాచార శాఖకు వన్నె తీసుక వచ్చేలా.. » బదిలీ తప్పదని తెలిసి కూడా... » బాధ్యత పట్ల ఆశ్రద్ధ చేయకుండా.. » అవినీతి ఆధికారులు సిగ్గు పడేలా చేసి.. » అందరికి కాక పోయిన కొందరికయిన ఆదర్శంగా నిలిచి.. » ఆడది అభల కాదు సభలనేలా.. » పద్మజా పనితీరే వేరయా..

(రామమోహన్ రెడ్డి)

కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన। మా కర్మఫలహేతుర్భూః మా తే సంగోఽస్త్వకర్మణి॥ " నువ్వు కర్మ చేయడానికి మాత్రమేగానీ, ఆ కర్మఫలానికి అధికారివి కాదు ; ప్రతిఫలాపేక్షతో కర్మలను చేయకు ; అలాగని కర్మలు చేయడం మానకు"అని భగవద్గీత లో చెప్పబడినది కర్మలను చేయడానికే మనకు హక్కు ఉంది ! కర్మలను సదా అప్రమత్తతతో చేస్తూ ఉండాలి ! ఎప్పుడూ "కర్మిష్ఠి"గానే ఉండాలి ! 'అకర్మణ్యత్వం' అన్నది ఎప్పుడూ వుండకూడదు ! నెల మొత్తం పూర్తిగా పనిచేసిన తరువాతనే జీతం వస్తుంది..ఫలితాన్ని తరువాతి నెలలోనే అనుభవించ గలుగుతాం. దేనినైతే మనం "ధర్మం" అనుకుంటున్నామో ఆ ధర్మం నిర్వర్తిస్తూనే ఉండాలి. ఆ రకమైన ధర్మ కర్మలు చేస్తూనే ఉండాలని గీతలో శ్రీకృష్ణ బాగవానుడు చెప్పియున్నారు.ఇలా ఎంతమంది తమ జీవిత ప్రయాణంలో ఆలోచన చేస్తారంటే అది సమాధానం దొరకని ప్రశ్న.కానీ కొంతమంది ఉన్నారని చెప్పడానికి సందేహం అక్కర్లేదు.





అందులో..పని పట్ల నిబద్ధత, ఉద్యోగం పట్ల బాధ్యత విధుల్లో విధేయత ,వృత్తి పట్ల నిజాయితీ, ఉద్యోగ ప్రయాణం లో క్రమశిక్షణ ఉంటే సాధించనది ఏది లేదంటూ సమాచార శాఖలో ఎన్నో సవాళ్లు ఎదురైన స్థానికత అంటూ సమస్యలు సృష్టించబడతాయని అన్నా అవేమి లెక్క చేయక,నాకెందుకులే నా జీతం నాకు వస్తుంది గా అన్న ఆశ్రద్ధ అలసత్వం లేకుండా ఆమెకు ఆ అవసరం లేదని చెప్పచ్చు ఉందని అనవచ్చు అలా తన ఉద్యోగ ధర్మం పాటించి పాడు బడబోయే ప్రభుత్వ వాహనాన్ని పక్కాగా రెడీ చేసి అందరితో కాక పోయిన కొందరితో శభాష్ అనిపించుకుంటూ ఉంది కడప మాజీ ఏడీ ప్రస్తుత కాకినాడ డిప్యూటీ డైరెక్టర్ పద్మజా. ఎందుకయ్యా ఇంత అతిశయోక్తి అని అందరు కాక పోయిన కొందరు అనుకోవచ్చు.

2 లో

## సమాచార శాఖ అధికారులకు చిత్త శుద్ధి ఉందా..?


ఇక పోతే అసలు సమాచార శాఖ అధికారులలో కొంతమంది కి చిత్త శుద్ధి ఉందా అంటే అందుకు సమాధానం దొరకని పరిస్థితి. బాద్యత గల ఉద్యోగం లో ఉంటూ ఏసీ గదుల్లో కూర్చుని లక్షల రూపాయల జీతాలు తీసుకుంటూ అడ్డగోలు అవినీతి కి పాల్పడుతున్న సంఘటన లపై పత్రికలలో కథనాలు వస్తే ఓర్వలేని అవినీతి అధికారులు క్రిమినల్స్ చేత,బ్లాక్ మెయిలర్స్ చేత తప్పుడు ఫిర్యాదులు ఇప్పించి ఆ పిర్యాదు అంది అందక ముందే విచారణ పేరుతో పత్రికా ప్రమాణాలను పాటిస్తున్న వారిపై పరుగులు తీసే వారికి ఇలాంటి పద్ధతి లేని అధికారులు పద్దతి తప్పి ప్రవర్తిస్తున్న తీరు కనిపించడం లేదా లేక పత్రికల ను అనగద్రొక్కి మరిన్ని పద్దతి లేని పనులు చేసుకుంటూ పోయేందుకు సిద్ధం అవుతున్నారా అన్న అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### ఆయనసమాచార శాఖకు దొరికిన ఆణిముత్యం

# వేలాయుధం ఆయుధమే వేరయా..?

» విధులన్నా...నిధులన్నా ఆయనకు ఎంతో ప్రేమ... » ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా అంతలా చేయలేడెమో.. » అందుకే ముఖ్యమంత్రి జిల్లా సమాచారం వేలాయుధం చేతిలో ఉంది.. » చిత్తూరు జిల్లా కలెక్టర్ కూడా చింతన పడడం లేదంటా.. » వాహనాల మరమ్మతుల మర్మం వేలాయుధంకే ఎరుక.. » డ్రైవర్ ఒక్కడే డ్రైవింగ్ విధానం సూపర్ » ఇక్కడ డ్రైవర్‌కు తెలియకుండానే వాహనాల రిపేరు గుర్తిస్తారు వేలాయుధం.. » అది సత్య సాయి జిల్లా అయిన చిత్తూరు ,తిరుపతి అయినా.. » న్యూడ్ వీడియోల కథ కంచికి చేరిందా.. » సైబర్ క్రైం శోధనలో సత్యం బోధపడిందా.. » లేక సైబర్ క్రైం లోనే మరో క్రైం కు తావిచ్చారా...! » జోన్ 4 ఆర్జేడీ కి అన్ని తెలిసినా.. » ఆయన రిపోర్టులలోనే అంతా బట్టబయలైన... » అంతా మౌనమై ఉండడంలో ఆంతర్యమేమిటో... » ఆర్జేడీ అలసత్వం కూడా శాఖ అప్రతిష్ఠపాలవ్వలేదా ... » రాయలసీమలో ఇలాంటి రత్నాలు కథలను కట్టడి చేయలేరా... » కుల బలం ఇన్ని కుట్రలను కాపాడుతూ ఉందా.... » కుల బలం ఉంటే ఎన్ని కానీ పనులైన చేయొచ్చా.. » పత్రికల పై ఫిర్యాదులిస్తే పరుగులు తీస్తారా... » అదే పత్రికల లో తప్పులు ఎత్తి చూపితే తప్పుడు నివేదికలు ఇస్తారా... » మీదయితే సంసారం..ఎదుటివాడిది.లిలినేనా... ! » ఎవడు రాసాడు ఇలాంటి రాజ్యాంగం.. » ఏళ్ళు గడుస్తున్నా గడపదాటదా మీ అవినీతి గబ్బు.. » నివేదికలు స్పష్టంగా చెబుతున్నా..ఆ జోన్ లో అంతా అస్తవ్యస్తంగా ఉన్నా... » అక్కడే ఉద్యోగం ..ప్రమోషన్ అన్నీ... » తప్పుడు అధికారులను సరిదిద్దే వారెవరులేరా.. » సమస్యలకు నిలయం సమాచార శాఖ అయ్యిందా...? » ఏది నిజం..ఏది అబద్ధం..





2 లో..

(రామమోహన్ రెడ్డి)

మన హిందూ మతము పేరు చెప్పగానే మొదట అందరికీ గుర్తుకు వచ్చేది కులాల సంగతి. హిందూమ తమునకు ప్రామాణ్యము వేదాలు అని అందరికీ తెలుసు. స్త్రీలు, శూద్రులకు వేదాధ్యయనాధికారం లేదని అలా అని వేదాలలో ఉన్నదని చాలామంది నమ్ముతున్నారు. కానీ వేదాలలో అలా లేదని చెప్పడానికి ఈ ప్రయత్నం. భగవద్గీత 4వ అధ్యాయంలో శ్రీకృష్ణుడు "చాతుర్వర్ణ్యం మయాసృష్టం గుణకర్మ విభాగశః"అన్నాడు. దీని అర్థం"మొదట వారి గుణాల బట్టి, తర్వాత వారు చేసే పనుల బట్టి నాలుగు వర్ణాలు (కులాలు) నాచే (భగవంతుడిచే) సృష్టింపబడ్డాయి.

"అని అర్థం. వేదాలలో నాలుగు వర్ణాల (కులాల) గురించి చెప్పారు కానీ వాటి మధ్య ఎక్కువ, తక్కువల గురించి చెప్పలేదు. మధ్య యుగంలో సాంప్రదాయవాదులు స్త్రీ,శూద్రులకు వేదాధ్యయనాధికారం లేదని వారి వారి గ్రంథాలలో చొప్పించారు కానీ ఏ వేదం లోనూ అలా చెప్పబడలేదు. సరిగదా ఆ అధికారం ఉన్నదని చెప్పాయి. కులం అనేది సమాజంలో ఏ వ్యక్తినైనా తేలికగా గుర్తించడానికి రూపొందించిన ఒక వ్యవస్థ. తమలో తాము వివాహాలు చేసుకుంటూ, ఒక విధమైన జీవన సరళిని కొనసాగిస్తూ వచ్చిన సామాజిక వర్గాలకు కులాలు అని పేరు.

---

### అమరావతి ఐకానిక్ భవనాల నిర్మాణాలు గడువు

# ప్రకారం పూర్తి కావాలి

» మంత్రి నారాయణ
» ఐకానిక్ భవనాల నిర్మాణ పనులు పురోగతిపై నారాయణ సమీక్షా సమావేశం
» నిర్మాణాలు ఏయే దశల్లో ఉన్నాయో అధికారుల నుంచి తెలుసుకున్న నారాయణ
» వర్షాల కారణంగా నిర్మాణ పనులు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలన్న మంత్రి



ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి :రాజధాని అమరావతి పరిధిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఐకానిక్ భవనాల నిర్మాణ పనుల పురోగతిపై పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. సీఆర్‌డీఏ ఉన్నతాధికారులు, ఇంజినీర్లు, నిర్మాణ కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులతో కలిసి పనుల తీరుతెన్నులను క్షుణ్ణంగా పరిశీలించారు.

2 లో..



## ఇరాన్‌పై దాడులు నిలిపివేసిన అమెరికా..

**చర్చలకు మరో అవకాశం : ట్రంప్**

వాషిగ్టన్ : కొన్నిరోజులుగా ఇరాన్‌పై చేస్తోన్న భారీ దాడులను ప్రస్తుతానికి అమెరికా నిలిపివేసింది. సోమవారం మధ్యాహ్నం నుంచి రెండు దేశాల మధ్య చర్చలు ప్రారంభం అవుతాయని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. తాము ఇరాన్‌పై భీకర దాడులు చేపట్టాలని భావించామని, అవే జరిగి ఉంటే

- మిగతా 2లో..

### జగన్ డైరెక్షన్ లోనే అటవిక చర్యలు..

## రాష్ట్రం నుంచి తరిమికొట్టే రోజు

# దగ్గరపడింది

» మంత్రి పార్థసారథి
» జగన్ అండతో వైసీపీ నేతలు దాడులకు పాల్పడుతున్నారన్న మంత్రి
» కర్నూలులో దళిత కుటుంబంపై వైసీపీ ఎమ్మెల్యే దాడి అమానుషం అని వ్యాఖ్యలు
» దళితులు, మహిళలపై దాడులు జరుగుతున్నా జగన్ మౌనం దారుణమంటూ విమర్శలు
» తప్పు చేస్తే సొంత నేతలనూ చంద్రబాబు మందలిస్తారని వెల్లడి
» అరాచక శక్తులను ఉపేక్షించం, చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక



ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : రాష్ట్రంలో వైసీపీ నేతలు సాగిస్తున్న అరాచకాలు, దౌర్జన్యాల వెనుక ఆ పార్టీ అధినేత జగన్ డైరెక్షన్ ఉందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వైసీపీ పెంచి పోషిస్తున్న రౌడీ మూకల ఆటవిక చర్యలతో రాష్ట్ర ప్రజలు విసిగిపోయారని, ఆ పార్టీని రాష్ట్రం నుంచి తరిమికొట్టే రోజు దగ్గరపడిందని ఆయన హెచ్చరించారు.

మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వైసీపీ నేతల దిగజారుడు రాజకీయాలపై విరుచుకుపడ్డారు."ఒకవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం యువత భవిష్యత్తుకు బాటలు వేస్తుంటే, మరోవైపు ఐదేళ్ల పాలనలో ప్రజలకు చేసిందేమీ లేని వైసీపీ.. యువతను గంజాయి, రౌడీయిజం వైపు మళ్లించి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోంది. కులాల మధ్య చిచ్చుపెట్టడం, విధ్వంసం సృష్టించడమే వైసీపీలో కొనసాగడానికి అర్హతగా మారింది. తప్పు చేసి దొరికిపోయాక, 'రాజకీయ కక్ష సాధింపు' అంటూ సోషల్

2 లో..

---

### నీట్ నిరసనకారులపై కేసుల

# ఉపసంహరణకు

**రాష్ట్రాలకు స్వేచ్ఛ : సుప్రీం**



న్యూఢిల్లీ : నీట్ ప్రశ్నా పత్రం లీకేజీకి వ్యతిరేకంగా జరిగిన నిరసనల సందర్భంగా నమోదైన కేసులను చట్ట ప్రకారం ఉపసంహరించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు పూర్తి స్వేచ్ఛ ఉందని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. జులై 20న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన ఆందోళనలకు సంబంధించిన పిటిషన్ల విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. 'క్రిమినల్ యాంటిసిడెంట్స్' అనే పదం

2 లో

### 3 రోజులపాటు

# వానలు



ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణం ఒక్కసారిగా మారనుంది. దిగువ ట్రోపో ఆవరణంలో వాయవ్య దిశగా వీస్తున్న గాలుల ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా రాగల మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. వర్షంతో పాటు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని, పిడుగులు పడే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

పిడుగులు పడే అవకాశం ఉండటంతో వర్షం పడే సమయంలో పొలాల్లో పని చేసే రైతులు, పశువుల కాపరులు చెట్ల కింద నిలబడకూడదని, సురక్షితమైన ప్రదేశాల్లో ఆశ్రయం పొందాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు. ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్ – యానాం లలో సోమ, మంగళవారాల్లో కొన్ని

- మిగతా 2లో..

### సుప్రీం కోర్టులో జడ్జిల సంఖ్య పెంపు బిల్లుకు

# లోక్‌సభ ఆమోదం



న్యూఢిల్లీ : సుప్రీం కోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను 34 నుంచి 38కి పెంచడానికి ఉద్దేశించిన కీలక బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఈ బిల్లుపై కేంద్రమంత్రి అర్జున్ రామ్ మేఘువాల్ సభలో చర్చను ప్రారంభించగా, ప్రతిపక్ష సభ్యులు పదేపదే నినాదాలు చేస్తూ సభలో ఆందోళనకు దిగారు. సభ్యులందరూ సభా చర్చలో పాల్గొనాలని స్పీకర్ పదేపదే కోరినప్పటికీ, విపక్షాలు తమ నిరసనలను కొనసాగించాయి. ఈ పరిస్థితుల మధ్య, విపక్షాల తీవ్ర నిరసనలు, గందరగోళం నడుమ ఈ బిల్లును ఎలాంటి చర్చ లేకుండానే లోక్‌సభ ఆమోదించింది. ఇది దేశంలో న్యాయ వ్యవస్థకు సంబంధించిన ఒక ముఖ్యమైన నిర్ణయంగా భావించబడుతోంది.

2 లో..

ప్రజాభూమి
మంగళవారం, ఆగస్టు 4, 2026


# వేలాయుధం ఆయుధమే వేరయా..?

వృత్తి, ఆచారాలు, సామాజిక స్థాయి వంటి అనేకాంశాలు కులాల్లో పరంపరాగతంగా కొనసాగేవి. వంశపారంపర్యంగా పాటించబడే ఒక సామాజిక ఆచారం. సాధారణంగా కులం వృత్తులు, కులవివాహాలు, సంస్కృతి, సామాజిక స్థాయి, రాజకీయాలపై అత్యధిక ప్రభావాన్ని చూపుతుంది. యునిసెఫ్ అధ్యయనాల ప్రకారం కులవివక్ష ప్రపంచవ్యాప్తంగా 25కోట్ల మంది జీవితాలను ప్రభావితం చేస్తోంది. ఈ కుల వ్యవస్థ ప్రముఖంగా ఆసియా ఆఫ్రికా ఖండాలలో ప్రబలి ఉంది. భారత దేశంలో కుల వ్యవస్థ వలన కొన్ని దురాచారాలు ఏర్పడినవి. ఇప్పుడు కూడా కుల వ్యవస్థ ఉనికిలో ఉన్నప్పటికీ సమాజంలో కులం కంటే డబ్బుకే ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నారు.పూర్వం కూటికి పేదలం కానీ కులానికి పేదలం కాదు అనేవారు. ఇప్పుడు కొంత మంది కులాంతర వివాహాలు చేసుకుంటున్నారు కానీ అక్కడ కూడా తమ డబ్బు-హోదాకి తగిన వ్యక్తుల్నే ఎంచుకుంటున్నారు. ఉన్నవాళ్ళు-లేనివాళ్ళు అనే భేదం ఎప్పుడూ ఉంటుంది. సొంతకులంలో కూడా డబ్బున్న కుటుంబాలకి చెందిన వాళ్ళు పేద కుటుంబాలకి చెందిన వాళ్ళని పెళ్ళి చేసుకున్న సందర్భాలు చాలా తక్కువ. పట్టణ ప్రాంతాలలోనూ, కొన్ని గ్రామీణ ప్రాంతాలలోనూ కుల పునాదులు అంత బలంగా కనిపించడం లేదు. అంత కంటే డబ్బున్న వాళ్ళు - పేద వాళ్ళు అన్న భేదాలే ఎక్కువగా కనిపిస్తాయి. ఇక్కడ ఇప్పుడు ఎందుకు కుల వ్యవస్థ ను ప్రస్తావన తీసుక రావాలి అనే సందేహం చాలామంది కి రావచ్చు.కానీ అక్కడే అసలైన అంతరార్థం దాగి ఉన్నదన్న సత్యం అనేక విషయాలను పూర్తిగా ఆదారసాహిత నివేదికలను నిశితంగా పరిశీలన చేసిన తరువాత వ్యవస్థలలో ద్విగునీకృతమై ఉన్న అవినీతి అనేది కులం ప్రాంతం నోట్ల కట్టల మాటున ఈ సమాజాన్ని ఎంత ప్రతికూల పరిస్థితులలోకి నెట్టి వేయబడుతుందనేది అట్లే అర్థం చేసుకోవచ్చు. ఏమిటయ్యా ఈ పురాణ ఇతిహాసాలతో కూడిన రాతలని కొంతమంది అపర మేధావులమనే ముసుగువేసుకున్న అజ్ఞానులు అనుకోవచ్చు. అనుభవంలో తెలుసుకుకుంటేనే తత్వం బోధపడుతుందనేది నిత్య సత్యం ఇక్కడ ఇప్పుడు రాయలసీమ జిల్లాల్లో ఉద్యోగ ప్రస్థానం మొదలు పెట్టి అనంతపురం సత్యసాయి జిల్లాలలో సమాచార శాఖ లో చేసి అసత్యపు పనులు, అవినీతి, ప్రభుత్వ సొమ్మును ఏ విదంగా దుర్వినియోగం చేయవచ్చు ,అలాగే తనకు అధికారం ఉందని విధులు నిధులు ఏ విధంగా అప్పనంగా దోచుకుని దాచుకోవచ్చున్న విధానాన్ని కనిపెట్టిన అభినవ అంబెడ్కర్ నేటి చిత్తూరు జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఎన్ వేలాయుధం గురించి ప్రధానంగా చర్చించు కుంటే విస్తుపోయే నిజాలు వెలుగుచూస్తున్నాయి.

ఏమిటయ్యా ఆ విస్తుపోయే నిజాలు అంటే ..ఆయన శ్రీసత్యసాయి జిల్లాలో వెలగబెట్టిన ఉద్యోగ ప్రస్తానం లో ఒక ప్రభుత్వ వాహనాన్ని తన నిర్లక్ష్యం, అశ్రద్ధ,అవినీతి,ఆలసత్వం, లేక్కలేనితనం ,అధికార దర్పం,అహంకారం వెరసి కేవలం ఇరవై వేల రూపాయలు ఖర్చు చేస్తే చక్కగా తిరిగే స్వరాజ్ మాజ్డా ఆరు చక్రాల వాహనాన్ని అభాసు పాలు చేసి ఆఖరికి ఆ వాహనం అత్యంత దయనీయ స్థితికి చేరుకునేలా చేసి ప్రబుత్వ సొమ్మును దుర్వినియోగం చేయడం తో పాటు అత్యంత దుర్మార్గంగా ప్రవర్తించడాని అనడం లో ఎలాంటి సందేహం అక్కర్లేదని భావించాల్సి రావడం ఈ సమాచార శాఖ లో ఉన్న కొంతమంది అలసత్వపు అధికారుల నిర్లక్ష్యమని చెప్పాలి. ఆదియును కాక తన చేతిలో అధికారం ఉంటే ఆ అధికారాన్ని ఎన్ని విధాలుగా అడ్డగోలు తనానికి వాడుకోవచ్చన్న కొత్త అర్ధాన్ని కనిపెట్టిన అబ్బినవ అవినీతి పరుడనే బిరుదును సమాచార శాఖ తరుపున ప్రదానం చేసిన తప్పేమీ కాదని అనవచ్చు. కారణం ఓకే ప్రాంతంలో ఉద్యోగ ప్రస్థానం మొదలు పెట్టి అదే రాయలసీమ జిల్లాల్లో నే పరిభ్రమనం చెందుతూ ఏడీ డీడీ వరకు ఎడగడంతో అయన అవినీతి కి అడ్డుకట్ట వేసే వారు లేకపోవడం గమనార్హం

వేలాయుధం ఉద్యోగ ప్రస్తానం లో జరిగిన అవినీతి ఆరోపణలపై సమాచార హక్కు చట్టం ద్వారా ఆ శాఖ అధికారులే ఇవ్వబడిన సమాచారం పరిశీలన చేస్తే ప్రజాస్వామ్య వ్యవస్థ అని గొప్పగా చెప్పుకునే ఈ పాలకులు సిగ్గుతో తలదించుకునేలా ఉన్నాయి అతని లోపాలు పాపాలు.సాధారణంగా ఈ శాఖలో నైన ఒక వాహనం రిపేరు ఆ వాహనాన్ని నడిపే డ్రైవర్ గమనిస్తాడు.కానీ వేలాయుధం మాత్రం ఆయన ప్రయాణించే వాహనం బోలేరు రిపేరు ఆయనకు మాత్రమే తెలిసి వేల రూపాయలు ఖర్చు చేసినట్లు అధికారిక లెక్కలు స్పష్టంగా చెబుతున్నాయి.అలానే డ్రైవర్ సిఫార్సు లేఖ లేకుండానే స్వరాజ్ మాజ్డా వాహనం గత ఐదేళ్ళు గా ఒక ప్రవేటు షెడ్లు లో మూలన పడేయడం తో నేడు ఆ వాహనం అద్దె కు ఆ వాహనం వేలం వేసి అమ్మినా కూడా లెక్క సరిపోదన్నది స్థానిక మెకానికల్ వారి ద్వారా తెలియవస్తుంది. ఇవన్నీ ఆ జోన్ ను పర్యవేక్షణ చేసే ప్రాంతీయ సంయుక్త సంచాలకులకు తెలియదా అంటే అన్ని తెలిసే జరిగాయన్నది నిజం.మరి ఎందుకు చర్యలు తీసుకోలేక పోయారంటే అందుకు భిన్నమైన సమాధానాలు వినిపిస్తున్నాయి. జోన్ 4 కార్యాలయం మొత్తం మహిళా అధికారి చేతిలో కీలు బొమ్మ అయ్యిందన్న ఆరోపణలు అక్కడ గుప్పుమని వినిపిస్తున్నాయి.

ఇకపోతే ప్రభుత్వ వాహనం మరమ్మతులకు వస్తే ఆ మరమ్మతుల కోసం జిల్లా కలెక్టర్ ను నిధులు మంజూరు చేయమని కోరడం సహజం. కానీ వేలాయుధం తన కున్న అధికార పరిధి దాటి ఏకంగా రోడ్ల భవనాల శాఖా మంత్రి కి,జిల్లా పరిషత్ చైర్మన్ కు వాహనం మరమ్మతుల కోసం నిధులు కావాలని అధికారిక లేఖ రాయడం ఆ శాఖలో ఉన్న కొంతమంది పై స్థాయి అధికారులు అచ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇది చాలదన్నట్లు తన కింది స్థాయి ఉద్యోగుల తో వసూళ్లు చేసి అటు వాహనం రిపేరు చేయక ఇటు తిరిగి డబ్బులు చెల్లించక పోవడం పలు ఫిర్యాదులు లేవనెత్తడం విచారణ జరిపించగా అన్ని వాస్తవాలు గా ధ్రువీకరణ చేస్తూ ఫోన్ పే స్క్రీన్ షార్ట్స్ కూడా ఇచ్చినా జోన్4 ప్రాంతీయ సంయుక్త సంచాలకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహారం చేశారన్న ఆరోపణలకు బలం చేకూర్చే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ఇన్నీ జరుగుతున్న ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని అడ్డదారిలో కోర్టు మెట్లక్కి అడిషనల్ డైరెక్టర్ ఇంచార్జ్ గా ఉన్న జోన్ 2 ఆర్జెడీ స్వర్ణలత కు నాటి డైనమిక్ డైరెక్టర్ హిమాన్స్ శుక్లా ఈ అవినీతి తిమింగలం పై విచారణ చేయమని ఆదేశించినా ఆయన ఆదేశాలు అడిషనల్ డైరెక్టర్ ఛాంబర్ దాటాక కుండా చేసుకుని కాలాన్ని వెళ్లబుచ్చి కలిసివచ్చిన కాడికి నోట్ల కట్టలు దోచుకుని దాచుకుని నిస్సిగ్గుగా సన్మానాలు చేయించుకుని ఇక సెలవంటూ సమాచార శాఖను వదిలి పెట్టి పోయింది.

ఇలా వేలాయుధం అవినీతి అక్రమాలపై ఉమ్మడి అనంతపురం పబ్లిషర్స్ అలుపెరగని పోరాటం చేస్తున్నా అవినీతి నిలయంగా మార్చిన కొంతమంది ఉన్నతాధికారుల వలన వేలాయుధం కులమనే ఆయుధం తో తన అవినీతి సామ్రాజ్యాన్ని విస్తరించు కుంటూ పోతు అనతి కాలంలో జోన్ 4 ఆర్జేడీ గా వస్తానని అప్పుడు అందరి కథలు తెలుస్తానంటూ అటు ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగిన కింది స్థాయి అధికారులను అటు ఆయా జిల్లాల పుబ్లిషర్స్ ను నర్మ గర్భం గా బెదిరింపులు చేస్తూ వేలాయుధం తన ఆయుధాలను ఉపయోగిస్తున్నాడన్న ఆరోపణలు గుప్పు మంటున్నాయి.

ఇక మరో ముఖ్యమైన విషయానికి వస్తే ఒక ప్రభుత్వ అధికారి అధికారిక ఫోన్ నుండి సభ్యసమాజం సిగ్గుతో తల దించుకునెలా అస్లీల వీడియోలు అధికారిక గ్రూప్ లలో వస్తే అవి ఎలా ఎప్పుడు ఎందుకు ఎక్కడి నుంచి ఏమిటి కి వచ్చాయన్న ప్రాథమిక నిర్ధారణ కూడా జరగకుండా సైబర్ క్రైం పోలీసులతోనే క్రైం చేయించి ఓ మూడు లక్షల రూపాయల తో ఆ అస్లీలం కాస్తా అడ్రెస్ లేకుండా వేలాయుధం చేయించారన్న ఆరోపణలు అప్పటి ఉండి ఉమ్మడి చిత్తూరు జిల్లాలతో పాటు జోన్ 4 కోడై కూస్తుందని ఇదంతా సమాచార శాఖ కమిషనరేట్ పరిధిలో కూడా తెలిసినా పట్టి పట్టనట్లు అంటి అంట నట్లు ఉన్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.మరి ఇలాంటి అధికారిపై చర్యలు తీసుకునే వారు ఉన్నారా లేదా అనే దానికి కాలమే సమాధానం చెప్పాలి మరి

## సంపాదకీయం

### హామీలను మోసగిస్తున్న పాలకులు !

తెలంగాణలో రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు కావస్తోంది. ప్రధాన సమస్యలపై ఇప్పటికీ స్పష్టత లేకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. ముఖ్యంగా ధరణి విషయంలో ఎన్నో చెప్పిన రేవంత్ రెడ్డి ఇప్పటికీ దీనిపై స్పష్టత లేదు. ఎన్ని భూములు అన్యాకాంత్రం అయ్యాయో తెలియదు. దీనిపై సమగ్ర విచారణ జరిపి చర్య తీసుకోలేదు. దేవాదాయ భూములు తెలంగాణలో వేల ఎకరాలు అన్యాక్రాంతం అయ్యాయి. కొందరు దౌర్జన్యంగా అవి పట్టాలు చేయించుకుని, రైతుభరోసా కూడా పొందుతున్నారు. ఈ భూములను స్వాధీనం చేసుకోవడంలో గత కెసిఆర్ ప్రభుత్వం, రేవంత్ ప్రభుత్వం కూడా విఫలమయ్యింది. మంత్రి కొండా సురేఖ ఉత్సవ విగ్రహంలా తయారయ్యారన్న విమర్శలు ఉన్నాయి. ఎపిలో కూడా ఇలాంటి భూములపై చంద్రబాబు ఒక్కమాటా మాట్లాడడం లేదు. ఇకపోతే కాళేశ్వరంపై విమర్శలు తప్ప ఉన్న ప్రాజెక్టును ఉపయోగించుకునే ఆలోచన చేయడంలేదు. జర్నలిస్టుల అక్రిడిటేషన్లపై గందరోగళం జరుగు తోంది. దీనిని సజావుగా పరిష్కరించడం లేదు. కోర్టుల్లో కేసులు కూడా దాఖలు అయ్యాయి. జర్నలిస్టులు ఇంటిస్థలాలు, ఆరోగ్య కార్డులు ఊసే లేదు. ఇప్పటికే ఉమ్మడి ఎపిలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి కేటాయించిన 70 ఎకరాల భూమిని కాజేసే కుట్రలు మొదలయ్యాయి. సుప్రీంకోర్టు తీర్పును బూచిగా చూపి, వేలకోట్ల విలువ చేసే భూమిని లాగేసుకుని, జర్నలిస్టులకు మొడిచేయి చూపేందుకు రంగం సిద్ధం చేశారు. ఇందులో కొందరు జర్నలిస్టుల పాత్రకూడా ఉంది. జర్నలిస్టులకు అన్యాయం చేయడంలో టిడిపి ప్రభుత్వం, జగన్ ప్రభుత్వం కూడా ఎపిలో ఇదే తరహా పోకడలు సాగించింది. ఇక అన్నింటికన్నా పెద్ద సమస్య నిరుద్యోగ సమస్య. మొన్నటికి మొన్న ఢిల్లీలో కాక్రోచ్ జనతాపార్టీ ఆందోళనలకు మద్దతు తెలిపిన రాహుల్, రేవంత్ రెడ్డిలు తెలంగాణ నిరుద్యోగుల ఆందోళనలకు మాత్రం సమాధానం చెప్పడం లేదు. ఇక్కడా అలాంటి ఉద్యమం వస్తే తప్ప వీరు స్పందించేలా లేరు. క్యాలెండర్లు మారాయి కానీ కొలువులు మాత్రం రావడలేదని ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు. తెలంగాణలో ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలిస్తానన్న కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చి రెండున్నరేండ్లు దాటినా నిరుద్యోగులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదు. ఇటీవలే సిఎం రేవంత్ 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని చెప్పారు. అంటే ఆయన ఇచ్చిన హామీని ఆయనే నెరవేర్చలేదని చెబుతున్నారు. అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌కు రెండేండ్లు పూర్తయినా.. నోటిఫికేషన్లు విడుదల చేయలేదు. నోటిఫికేషన్లపై మాట తప్పిన సర్కార్ మీద నిరుద్యోగులు ఆగ్రహంగా ఉన్నారు. ఏటా జాబ్ క్యాలెండర్.. రెండు లక్షల ఉద్యోగాల భర్తీ.. నాలుగువేల రూపాయల చొప్పన నిరుద్యోగ భృతి.. ఇదీ కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ. కానీ, అధికారంలోకి వచ్చిన తరువాత నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను విస్మరించింది. జాబ్ క్యాలెండర్ జాడ లేదు. నిరుద్యోగ భృతి ఊసులేదు. 'ఇదిగో మా నిబద్ధత..' అంటూ 2024 ఆగస్టు 2న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్‌ను ప్రవేశపెట్టారు. 15 రకాల నోటిఫికేషన్లు ఇస్తామని చెప్పారు. ఈ క్యాలెండర్ గడువు కూడా ముగిసింది. కానీ, అందులో పేర్కొన్న ఒక్క నోటిఫికేషన్ కూడా విడుదల కాలేదు. 2025 ఆగస్టు 2,శనివారంతో 2026 ఆగస్టు 2 కూడా గడిచిపోయింది.రెండేండ్ల గడువు పూర్తయ్యింది. అసెంబ్లీలో ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌కు విలువ లేకుండా పోయింది. నిరుద్యోగ యువతను తమవైపు తిప్పుకొనేం దుకు కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ముందు యూత్ డిక్లరేషన్ ప్రకటించింది. దీనిని ఎన్నికల మ్యానిఫెస్టోలో సైతం పొందుపరిచింది. కానీ, డిక్లరేషన్‌లో ప్రకటించిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు. ఉద్యోగాలొచ్చే వరకు యువతకు నెలకు రూ. 4వేల చొప్పన నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని కూడా కాంగ్రెస్ నేతలు మరచిపోయారు. అమ్మాయిలకు ఎలక్ట్రిక్ స్కూటీలు ఇస్తామన్న హామీని కూడా నెరవేర్చలేదు. రూ.5 లక్షల విద్యాభరోసా కార్డు, రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇస్తామన్న హామీని పట్టించుకోలేదు. రాష్ట్రవ్యాప్తంగా ఏటా దాదాపు 9వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు రిటైర్ అవుతున్నట్లు అంచనాలు ఉన్నాయి. వీరితోపాటు విద్యుత్తు సంస్థలు, పలు బోర్డులు, విభాగాల్లోనూ పెద్దఎత్తున ఉద్యోగ విరమణ పొందుతున్నారు. తాజా గణాంకాల ప్రకారం పాఠశాల విద్యాశాఖలో 14వేలకుపైగా టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని అంటున్నారు. యూనివర్సిటీల్లో 2వేలకుపైగా బోధన, మరో 2,800 బోధనేతర పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గురుకులాల్లో ఆరువేలు, ఆర్టీసీలో మూడువేలకుపైగా, పోలీసుశాఖలో 17వేలకుపైగా ఖాళీలున్నాయి. ఎక్సైజ్ శాఖలో వెయ్యి, అంగన్‌వాడీల్లో 15వేలకుపైగా, మైనారిటీ సంక్షేమ శాఖలో మూడువేలకుపైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇలా పలు శాఖల్లో పెద్దఎత్తున ఖాళీలున్నా సర్కార్ నోటిఫికేషన్లు విడుదల చేయడంలేదన్న ఆందోళన నిరుద్యోగుల్లో ఉంది. మరోవైపు రాష్ట్రంలో రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు ఉండటం గమనార్హం. మూడు లక్షల మంది రెగ్యులర్ ఉద్యోగులుంటే అంతే స్థాయిలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారు. దీనికి గత కెసిఆర్ ప్రభుత్వం ప్రధాన దోషిగా ప్రకటించాలి. ఇంటికో ఉద్యోగం అంటూ మోసం చేసి, అలా అనలేదని బుకాయించారు. లక్షల ఉద్యోగాలు ఇచ్చామని చెట్టుమీద ఆకులతో ఇస్తార్లు కుట్టినట్లు లెక్కలు చెప్పారు. ఏతావాతా ఎవరు అధికారంలోకి వచ్చినా తమ స్వప్రయోజనాలు తప్ప ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదని తేల్చారు. అలు కెసిఆర్, రేవంత్, చంద్రబాబు, జగన్ ఎవరైనా ప్రజలు మాటలతో బురిడీ కొట్టించడంలో ఆరితేరారు.

## శభాష్ పద్మజ గారు...

ఇక్కడ ఇప్పుడు ఈనాటి పరిస్థితులలో ఉద్యోగ ధర్మంలో బాధ్యత అనే పదానికి పెద్ద పీట వేసేవారు చాలా తక్కువ మంది కనిపిస్తూ ఉంటారు. అందులోనూ పాడుబడడానికి సిద్ధంగా ఉన్న ఏ వస్తువులను తిరిగి బాగు చేయించి వాటిని వినియోగం లోకి తీసుకు రావడం అనేది కూడా ఒక నిబద్ధతతో కూడుకున్న అంశమనే చెప్పాలి. ఇంకా ముఖ్యంగా చెప్పాలంటే సమాచార శాఖ గతానికి భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో సమాచార శాఖలో బోలెడు నిధులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉండేవి ప్రస్తుతం అవన్ని కూడా ఆశించిన స్థాయిలో లేవని చెప్పచ్చు.అయినా కూడా తన పరిధిలో ఉన్న అంశంపై క్షుణ్ణంగా అవగాహన చేసుకుని తమ కార్యాలయం కు అతి ముఖ్యమైనది అనేక విమర్శలకు అవకాశం ఇవ్వనిది అది ఉంటే అలవోకగా అన్ని సమస్యలకు సమాధానం దొరుకుతుందనేది యదార్థం. అదే సమాచార శాఖ వాహనం.ముఖ్యంగా ఏ శాఖ లేని ఇబ్బందులు సమాచార శాఖకు కూడా కొన్ని ఉంటాయి.ఏ రాజకీయ పార్టీ అధికారం లో ఉన్నా మంత్రులు ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా మీడియా కవరేజ్ ఇవ్వాల్సిన బాద్యత ఆయా జిల్లా పరిధిలో ఉన్న సమాచార శాఖ అధికారులకె ఉంటుంది.అప్పుడు జిల్లా కేంద్రంలో ఉన్న మీడియా సబ్యులకు వాహనం ఏర్పాటు చేయాల్సి ఉంటుంది అదే ప్రస్తుతం ప్రధానంగా చర్చించుకుంటున్న స్వరాజ్ మాజ్డా వాహనాలు ప్రభుత్వం ఎప్పుడో కేటాయించింది కొన్ని జిల్లాల్లో మరమ్మతులకు నోచుకోక మూలన పడ్డాయి.కొన్ని జిల్లాల్లో ఇంకా ఉన్నాయి వేలాయుధం లాంటి అవినీతి అధికారులున్న చోట ఆ వాహనాలు పూర్తిగా పాడుబడి పోయి పాత సామాన్లకింద అమ్మేసే స్థాయికి చేరుకున్నాయి.

అయితే ఇక్కడ వేలాయుధం లాంటి అవినీతి అధికారులు బాద్యత పట్ల అలసత్వం వహించి నిధులు మంజూరు అయిన వినియోగం చేయక దుర్వినియోగం చేస్తే మహిళా అధికారి అయ్యి ఉండి జోన్ 4 లో అనేక సమస్యలు ఆమె ఎదుర్కొన్న ఆ జోన్ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు ఉన్నప్పటికి వాహనం మరమ్మతులు చేయించక పోతే ప పాడుబడి పోయి నిరుపయోగం అవుతుందని ఆ జిల్లా కలెక్టర్ ను నిధులు అడిగి అనుకున్న అంచనాలు పెరిగినా వెనుకడగు వేయకుండా అంచనాలు సవరించమని అడిగి అద్భుతంగా వాహనాన్ని తయారు చేయించి ఆ వాహనం ఎక్కడ తడుస్తుందోనని అంచనాలలో లేక పోయినా షేడ్ వేయించి ఆ జిల్లా సర్వోన్నతాధికారిని మెప్పించి ప్రశంసలు పొందింది పద్మజా అని చెప్పాడం లో పెద్దగా అచ్చర్య పడాల్సిన అవసరం లేదు.ఇలాంటి అధికారిణి కి ప్రమోషన్ లో మొదటి పేరు రేషియో ప్రకారం మొదటి పేరు ఉన్నా కాకినాడ కు బదిలీ ...ప్రభుత్వ సొమ్మును ,సిబ్బంది సొమ్మును ఎలా తినాలో తెలిసిన వారికి అదే ప్రాంతంలోనే అందలం ఎక్కిస్తున్న ఈ అధికారుల తీరును చూస్తుంటే ఇది కదా అసలైన అధికారుల తీరని ముక్కున వేలేసుకుంటున్నారు ఆ శాఖలోని కొందరు అధికార యంత్రాంగం.అందుకే ఆమె సేవలను కొనియాడడం లో తప్పేమీ లేదని అనిపిస్తోంది.

### జగన్ డైరెక్షన్ లోనే అటవిక చర్యలు..
## రాష్ట్రం నుంచి తరిమికొట్టే రోజు దగ్గరపడింది

మీడియాలో ఏడవడం ఆ పార్టీకి అలవాటైంది" అని పార్థసారథి ఎద్దేవా చేశారు.కర్నూలు జిల్లాలో వైసీపీ ఎమ్మెల్యే, ఆయన అనుచరులు ఒక దళిత కుటుంబంపై బరిసెలు, మారణాయుధాలతో దాడికి పాల్పడడం హేయమైన చర్య అని మంత్రి తీవ్రంగా ఖండించారు. "ఒక దళిత సోదరి ఇంట్లోకి చొరబడి, ఆమె బట్టలు చించి అవమానించి, పైగా బాధితులే బట్టలు చించుకున్నారని సిగ్గులేకుండా ప్రచారం చేయడం వైసీపీ నీచ రాజకీయాలకు పరాకాష్ఠ. శ్రీకాకుళంలో మహిళా సీఐని అవమానించిన ఘటన నుంచి నేటి వరకు దళితులు, మహిళలపై వైసీపీ నేతల దాడులు నిరంతరాయంగా కొనసాగుతూనే ఉన్నాయి" అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. 45 ఏళ్ల దాటిన గొర్రెల కాపరి మరణంపై జగన్ చేసిన వ్యాఖ్యలు, పేదల ప్రాణాలంటే ఆయనకున్న చులకన,ావాన్ని, విపరీత మనస్తత్వాన్ని బయటపెట్టాయని అన్నారు. తమ పార్టీ నేతలు తప్పు చేస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు మందలించి సరైన మార్గంలో పెడతారని, కానీ జగన్ మాత్రం తన పార్టీ నేతల అరాచకాలకు అండగా నిలుస్తూ వారిని మరింత ప్రోత్సహిస్తున్నారని పార్థసారథి విమర్శించారు. "నా ఎస్సీ, నా



బీసీ, నా మైనారిటీ అని ఎన్నికల ముందు నాటకాలు ఆడిన జగన్, ఇప్పుడు అదే దళితులు, బలహీన వర్గాలపై దాడులు జరుగుతుంటే ఎందుకు నోరు మెదపడం లేదు?" అని ఆయన సూటిగా ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే రాజ్యాంగ వ్యతిరేక శక్తులు ఎంతటివారైనా కూటమి ప్రభుత్వం ఉపేక్షించదని, చట్టం తనపని తాను చేసుకుపోతుందని, దోషులకు కఠిన శిక్షలు తప్పవని మంత్రి పార్థసారథి స్పష్టం చేశారు. ఇటువంటి అరాచక శక్తులను కూకటివేళ్లతో పెకిలించి వేస్తామని ఆయన గట్టిగా హెచ్చరించారు.

## ఇరాన్‌పై దాడులు నిలిపివేసిన అమెరికా..

రెండో ప్రపంచయుద్ధం తర్వాత అది పెద్ద దాడిగా మిగిలి ఉండేదని వ్యాఖ్యానించారు. అయితే ఘర్షణల ఆలోచన పక్కన పెట్టి, దౌత్యంవైపే మొగ్గుచూపామని పేర్కొన్నారు. గల్ఫ్ దేశాల విజ్ఞప్తి మేరకు దాడులను నిలిపివేసి, చర్చలకు మరో అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్లు ట్రంప్ వెల్లడించారు. ఘర్షణల కంటే చర్చల ద్వారా సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇరాన్‌తో శాంతి ఒప్పందం కుదిరే అవకాశాలపై ట్రంప్ సానుకూలంగా స్పందించారు. చర్చల ద్వారా ప్రాణనష్టం, విధ్వంసాన్ని నివారించవచ్చని పేర్కొంటూ దౌత్య మార్గానికే ప్రాధాన్యం ఇస్తున్నట్లు స్పష్టం చేశారు.

## 3 రోజులపాటు వానలు



ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురుస్తాయి.

ఒకటి రెండు చోట్ల మెరుపులు సంభవించే అవకాశముంది. 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయి. బుధవారం నాడు ఒకటి రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. బలమైన గాలులు కొనసాగుతాయి.

దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్‌లలో.. సోమ, మంగళవారాల్లో పలుచోట్ల మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశముంది. గాలుల వేగం 40-50 కిమీగా ఉంటుంది. బుధవారం ఒకటి రెండు చోట్ల తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉంది. పిడుగులు పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. రాయలసీమలో...సోమవారం కొన్ని చోట్ల ఉరుములతో కూడిన మోస్తరు వర్షాలు పడతాయి. మంగళవారం ఒకటి రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా జల్లులు కురిసే అవకాశముంది. బుధవారం ఒకటి రెండు చోట్ల తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉనప్పటికీ, బలమైన ఈదురుగాలులు వీస్తాయి.

## అమరావతి ఐకానిక్ భవనాల నిర్మాణాలు గడువు ప్రకారం పూర్తి కావాలి



ఈ సమావేశంలో ఏజీఐసీఎల్ ఎండీ అభిషేక్ కుమార్, ఇంజినీర్ ఇన్ చీఫ్ గోపాల్‌రెడ్డితో పాటు పలువురు చీఫ్ ఇంజినీర్లు పాల్గొన్నారు. అమరావతి ల్యాండ్‌మార్క్‌లుగా నిలవనున్న అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ టవర్ల నిర్మాణ పనులు ఏయే దశల్లో ఉన్నాయనే వివరాలను నారాయణ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం దృష్ట్యా నిర్మాణాలు నిలిచిపోకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటూ పనులను నిరంతరాయంగా కొనసాగిస్తున్నట్లు అధికారులు ఈ సందర్భంగా మంత్రికి వివరించారు.ప్రభుత్వం నిర్దేశించిన గడువు (టార్గెట్స్) ప్రకారమే రాజధాని ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేయాలని, ఎక్కడా నాణ్యత లోపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కాంట్రాక్ట్ సంస్థలకు, అధికారులకు మంత్రి నారాయణ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

## సుప్రీం కోర్టులో జడ్జిల సంఖ్య పెంపు బిల్లుకు లోక్‌సభ ఆమోదం

మొదటి పేజీ తరువాయి

న్యాయమూర్తుల సంఖ్య పెరగడం ద్వారా సుప్రీంకోర్టు మరింత సమర్థవంతంగా పనిచేయగలదని భావిస్తున్నారు. ఈ బిల్లుకు ఆమోదం పొందిన తర్వాత, సభా కార్యక్రమాలను స్పీకర్ మంగళవారం ఉదయం 11 గంటలకు వాయిదా వేశారు. ఈ సమయంలో, లోక్‌సభ ప్రారంభం కాగానే విద్యార్థులపై లాఠీఛార్జ్, అయోధ్యలో విరాళాల చోరీ వంటి కీలక అంశాలపై విపక్ష ఎంపీలు నినాదాలు చేస్తూ ప్రశ్నోత్తరాలను అడ్డుకున్నారు. ఈ క్రమంలో సభ పలుమార్లు వాయిదా పడింది.

ఆ తర్వాత సభ ప్రారంభమైనా అదే పరిస్థితి ఉండటంతో, సుప్రీం కోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను పెంచే బిల్లుకు ఆమోదం తెలిపి స్పీకర్ సభను మంగళవారానికి వాయిదా వేశారు. ఈ బిల్లుతో సంబంధించి, న్యాయ వ్యవస్థలో మార్పులు, న్యాయమూర్తుల పనితీరు మెరుగుదల వంటి అంశాలపై చర్చలు జరగవచ్చని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తుల సంఖ్య పెరగడం ద్వారా, న్యాయ వ్యవస్థలో వేగవంతమైన తీర్పులు, న్యాయ ప్రక్రియలో సమర్థత పెరుగుతుందని ఆశిస్తున్నారు. ఈ బిల్లుకు సంబంధించిన చర్చలు, ప్రతిపక్షాల అభ్యంతరాలు, సభలో జరిగిన సంఘటనలు, దేశంలో రాజకీయ పరిస్థితులను ప్రతిబింబిస్తున్నాయి.

## నీట్ నిరసనకారులపై కేసుల ఉపసంహరణకు

మొదటి పేజీ తరువాయి

హత్య, అత్యాచారం, ఉగ్రవాదం వంటి తీవ్రమైన నేరాలకు మాత్రమే వర్తిస్తుందని ధర్మాసనం పేర్కొంది. చిన్నచిన్న కేసులను ఆ కోవలో పరిగణించకూడదు అని స్పష్టం చేసింది. నిరసనలకు సంబంధించిన అంశాలపై విచారణకు ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు కోర్టు తెలిపింది. పెల్లెట్ తుపాకుల వినియోగంపై సమగ్ర మార్గదర్శకాలు రూపొందిస్తామని, ఎలాంటి పరిస్థితుల్లో వాటిని ఉపయోగించవచ్చో నిర్దేశిస్తామని వెల్లడించింది. తదుపరి విచారణను ఆగస్టు 19 కు వాయిదా వేసింది.

ప్రజాభూమి

ఎన్టీఆర్, కృష్ణా

మంగళవారం, ఆగష్టు 04, 2026



# పేదల వైద్యానికి సీఎం చంద్రబాబు అత్యధిక ప్రాధాన్యత



అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

ప్రజాభూమి ప్రతినిధి/ అవనిగడ్డ

పేదల వైద్యానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. సోమవారం అవనిగడ్డలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదలకు ఆర్థిక సహాయం చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన 67మంది లబ్ధిదారులకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 80,98, 743లను చెక్కుల రూపంలో అంద చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీల కు అతీతంగా పేదల వైద్య ఖర్చులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఉదారంగా సహాయం అందిస్తున్నారని తెలిపారు. పేదలు తమ వైద్య అవసరాల కోసం తమ కార్యాలయం ద్వారా సమర్పించే దరఖాస్తులను సాధ్యమైనంత వేగంగా పరిష్కరిస్తూ ఆర్థిక సహాయం అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు లబ్ధిదారుల తరఫున ధన్యవాదములు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు నియోజకవర్గంలో 1,616 మంది లబ్ధిదారులకు రూ.13,62, 15,327లు సీఎంఆర్ఎఫ్ సహాయం అందించినట్లు తెలిపారు.



# పరిసరాల పరిశీలన

## దసరా శరన్నవరాత్రి మహోత్సవాల నేపథ్యంలో ఆలయ పరిసర ప్రాంతాలను పరిశీలించిన నగర పోలీస్ కమిషనర్



ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ

ఎన్.టి.ఆర్. జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఐ.పి.ఎస్. మరియు ఇతర పోలీస్ అధికారులు, దేవస్థాన ఈ.ఓ.. టెంపుల్ అదికారులతో కలిసి దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దసరా శరన్నవరాత్రి మహోత్సవాల నేపథ్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ప్రశాంతమైనవాతావరణంలో ఎటువంటి అవాం చ నీయ సంఘటనలు జరుగకుండా భక్తులు అందరూ ఆనందోత్సవాలతో శాంతి భద్రతల మధ్య ప్రశాంతమైన వాతావరణంలో అమ్మవారి దర్శనం చేసుకోవాలనే ఉద్దేశ్యంతో టెంపుల్ మరియు టెంపుల్ పరిసర ప్రాంతాలను పరిశీలించి అవసరమైన భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు కోసం పార్కింగ్ ఏర్పాట్లపై, హోల్డింగ్ ఏరియాలు, బారిగేటింగ్, రైల్వే స్టేషన్, బస్ స్టాండ్ పరిసరాలు, స్నాన ఘాట్లు, క్యూలైన్లు, ప్రసాదం కౌంటర్లు మొదలైన అంశాలలో తీసుకోవాల్సిన భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఐ.పి.ఎస్. పాటు, టెంపుల్ ఈ.ఓ. శీనా నాయక్, పశ్చిమ డి.సి.పి. జి.రామకృష్ణ. పశ్చిమ ఎ.సి.పి. దుర్గారావు. ఇన్స్పెక్టర్ గుణరాం, ఇన్స్పెక్టర్ ఉమా మహేశ్వర రావు.దేవస్థాన అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు".



# దుర్గమ్మ కి లక్ష్మీ కాసుల హారం విరాళం

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ

లక్ష్మీ కాసుల హారం విరాళం విలువెంత 108 గ్రాముల బరువు విలువ 17 లక్షలు దాత పేరు: దొండేటి ఐశ్వర్య జ్యోతి మరియు కుటుంబ సభ్యులు లబ్బీపేట విజయవాడ ... ఆలయ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కిషోర్ కుమార్ కలిసి విరాళమును భక్తిశ్రద్ధలతో అందజేసి ఉన్నారు.




# ముంపు సమస్యను పరిష్కరించాలి

## కొండ ప్రాంతంలో రిటైనింగ్ వాల్స్ నిర్మించాలి

## బోయి సత్యబాబు సిపిఎం పశ్చిమ నగర కార్యదర్శి, మాజీ కార్పొరేటర్

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ


విజయవాడ పశ్చిమ నగరంలో చిన్నపాటి వర్షాలకు రోడ్లు జలమయం అవుతున్నాయి. 49,50,53,54 ,55డివిజన్ నందు ప్రధాన రహదారులన్నీ రోడ్లు జలమయం అవుతున్నాయి. బుడమేరు కాలువ రెగ్యులర్ మెయింటినెన్స్ జరిపించాలి. పెరిగిపోయిన పూడికలు యుద్ధ ప్రాతిపదికన తొలగించాలి. గాంధీ హిల్, నైజాం గెట్, రైల్వే ట్రాక్ క్రింద భాగంలో పేరుకుపోయిన షిల్టును , అవుట్ పాల్ డ్రైన్స్ లో పెరిగిపోయిన షిల్టును తొలగించాలి. స్ట్రాం వాటర్ డ్రైన్స్ నిర్మాణం చేయాలి.గొల్లపాలెం గట్టు మహంతిపురం మెయిన్ కాలవలో షిల్టు వెంటనే తొలగించాలి. 50 డివిజన్ గొల్లపాలెం గట్టు కొండ ప్రాంతంలో శాంక్షన్ అయిన లంకె సావిత్రమ్మ వీధి. చెక్క వెంకన్న వీధి. నూకాలమ్మ గుడి వీధి. ఒడుగు వారి వీధి, నాలుగు రిటైనింగ్ వాల్స్ పనులు, మరియు గొల్లపాలెం గట్టు కొండ ప్రాంతంలో క్వారీ కొండపైన పాడైపోయిన కాలువలు మెట్లు రోడ్లు గత నాలుగు నెలలుగా కాంట్రాక్టర్లకు బిల్లులు రాలేదని పనులు నిలువుగా చేశారు వాటిని త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ఈరోజు వినతి పత్రాలు అందించడం జరిగింది .స్పందించిన కమిషనర్ త్వరగా చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులకు ఆదేశించారు . వై.కోండ తదితరులు పాల్గొన్నారు .

# అమెరికాలో సీటని ఘరానా మోసం


## ₹15 లక్షలు నొక్కేసిన ముఠాపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు

## 20 రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఇనకుదురు సీఐకి ఎస్పీ ఆదేశం

మచిలీపట్నం క్రైమ్ ప్రజాభూమి ప్రతినిధి




విదేశాల్లో ఉన్నత విద్య పేరిట మచిలీపట్నంలో రూ. 15 లక్షల ఘరానా మోసం వెలుగు చూసింది. ఏజెన్సీ పేరుతో నమ్మించి డబ్బులు వసూలు చేసి పరారైన ఐదుగురిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితుడు గడ్డం రాజు సోమవారం మచిలీపట్నంలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై తక్షణమే స్పందించిన జిల్లా ఎస్పీ, సమగ్ర విచారణ జరిపి 20 రోజుల్లో నివేదిక సమర్పించాలని ఇనకుదురు సీఐని ఆదేశించారు.అసలు ఏం జరిగింది?మచిలీపట్నం జవ్వారుపేటకు చెందిన గడ్డం రాజు కుమార్తె విజయలక్ష్మి అమెరికాలో 'మాస్టర్ ఆఫ్ లా' చదవాలనుకుంది. రాజుపేటకు చెందిన అబ్దుల్ అబ్బాస్ హుస్సేన్ పరిచయమై, తనకు ట్రావెల్ ఏజెన్సీ ఉందంటూ నమ్మబలికాడు. అమెరికాలో కాలేజీ సీటు, పాస్‌పోర్ట్, హాస్టల్ వసతి కల్పిస్తామని చెప్పి రాజును, ఆయన కుమార్తెను నమ్మించాడు.ఈ క్రమంలో అబ్బాస్ హుస్సేన్, అతని భార్య వారీస్ జహా, మామ జానీ మహమ్మద్ (కాలేఖాన్ పేటలో వైద్యం చేస్తున్న నూరుద్దీన్ పేట నివాసి), సోదరుడు అబ్దుల్ గుల్జార్ హుస్సేన్ మరియు కరీంనగర్‌కు చెందిన ఎం.డి. అమీన్‌లు కలిసి 2025 అక్టోబర్ 8న రాజు వద్ద నుంచి రూ. 15 లక్షల నగదు తీసుకున్నారు. అందుకు పూచీకత్తుగా స్టాంప్ పేపర్‌పై ప్రామిసరీ నోటు రాసిచ్చారు. ఈ లావాదేవీ సమయంలో దేవనూరి వీరబాబు, జానీ కూడా ఉన్నారు.డబ్బులు నొక్కి.. కోర్టులో ఐపీ!డబ్బులు తీసుకున్న నాటి నుంచి సీటు వస్తుందని కాలయాపన చేస్తూ వచ్చారు. తీరా చూస్తే అబ్దుల్ అబ్బాస్ హుస్సేన్ మచిలీపట్నం కోర్టులో ఐపీ (Insolvency Petition) దాఖలు చేసినట్లు బాధితుడికి తెలిసింది. కాజేసిన డబ్బులతో ఈ ముఠా కరీంనగర్ సాయి నగర్ కాలనీలోని రాజా థియేటర్ పక్కన 'అమీన్ బైక్ పాయింట్' పేరుతో వ్యాపారం నిర్వహిస్తున్నట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు.ప్రస్తుతం అబ్బాస్, అతని భార్య వారీస్ జహా కరీంనగర్‌లోనే ఉంటున్నారని, బందరులో ఉన్న వారి బంధువులను డబ్బుల గురించి నిలదీస్తే సమాధానం చెప్పకుండా బెదిరింపులకు దిగుతున్నారని ఫిర్యాదులో తెలిపారు. తప్పుడు మాటలతో నమ్మించి తమ డబ్బులు సొంతానికి వాడుకోవడమే కాకుండా, తన కుమార్తె విద్యాసంవత్సరాన్ని నాశనం చేసిన ఈ ముఠాపై కఠిన చర్యలు తీసుకుని, న్యాయం చేయాలని బాధితుడు ఎస్పీని వేడుకున్నాడు.






వై జె ఆర్ డి ఎం ఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో

# "మైక్రోసాఫ్ట్ పవర్ BI" పై 5 రోజుల జాతీయ స్థాయి FDP ప్రారంభం

స్థానిక YJR DMS ఇంజినీరింగ్ కళాశాలలో "Microsoft Power BI Data Analyst Associate" అనే అంశంపై ఐదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (FDP) సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ICT Academy సహకారంతో YJRDMSCE యాజమాన్యం ఆగస్టు 3 నుండి 7, 2026 వరకు ఈ ప్రతిష్టాత్మక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.నవతరం సాంకేతికతపై లోతైన శిక్షణఈ శిక్షణా కార్యక్రమంలో ICT Academy ప్రతినిధి, ప్రముఖ సబ్జెక్ట్ నిపుణులు పువ్వాడి రాకేష్ రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు. డేటా అనలిటిక్స్, రిపోర్టింగ్ మరియు బిజినెస్ ఇంటెలిజెన్స్‌లో Power BI ప్రాముఖ్యతను, ఆధునిక బోధనా పద్ధతులలో దీని వినియోగాన్ని ఆయన అధ్యాపకులకు ప్రాక్టికల్‌గా వివరిస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం 9:30 నుండి సాయంత్రం 4:30 గంటల వరకు ఈ సెషన్లు సాగుతాయి.ముఖ్య అతిథులు మరియు నిర్వాహకుల సందేశంఉదయం 9:30 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు ప్రసంగించారు:కళాశాల మేనేజ్‌మెంట్: ప్రతినిధి కిరణ్ మాట్లాడుతూ, మారుతున్న సాంకేతిక విప్లవానికి అనుగుణంగా అధ్యాపకులు తమ నైపుణ్యాలను నిరంతరం పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు.ప్రిన్సిపాల్ & వైస్ ప్రిన్సిపాల్: కళాశాల ప్రిన్సిపాల్ డా. టి. రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ డా.బి. నాగజ్యోతి మాట్లాడుతూ... ఐటీ రంగంలో Data Analyst పాత్ర చాలా కీలకమని, ఇలాంటి ప్రాక్టికల్ వర్క్‌షాప్‌లు అధ్యాపకుల బోధనా నైపుణ్యాలను మరింత మెరుగుపరుస్తాయని పేర్కొన్నారు.విశేష స్పందనఈ కార్యక్రమంలో విభాగాధిపతులు (HODs), వివిధ విభాగాల అధ్యాపకులు, పరిశోధకులు, ఇతర కళాశాలల నిపుణులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ప్రోగ్రామ్ కోఆర్డినేటర్లుగా ICT Academy కళాశాల ప్రతినిధులు డా.సాదత్ అలీ, ఎస్. విశ్వనాథం గార్లు వ్యవహరిస్తూ కార్యక్రమ నిర్వహణను పర్యవేక్షిస్తున్నారు.



జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వ గా కలిసిన నూతన డీఆర్వోజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ను కలెక్టరేట్ వద్ద మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేసిన నూతన జిల్లా రెవిన్యూ అధికారి కే.శ్రీధర్ రెడ్డి

# ఎంపీ కేశినేని చిన్ని జన్మదిన వేడుకలు నిర్వహించిన టిఎన్టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు పరుచూరి ప్రసాద్



ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ

విజయవాడ పార్లమెంట్ అభ్యర్థిగా ప్రకటించిన నాటినుండి కేశి నేని చిన్ని తెలుగుదేశం పార్టీ నాయకులకి కార్యకర్తలకి కూటమి కార్యకర్తలకి ప్రజలకి అందుబాటులో ఉండి ప్రజల మనసులు గెలుచుకొని అత్యధిక భారీ మెజార్టీతో విజయవాడ పార్లమెంట్ సభ్యుడిగా గెలుపొందారని టిఎన్టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు పరుచూరి ప్రసాద్ తెలిపారు. ఎంపీగా గెలుపొందిన తర్వాత రెండవ జన్మదిన వేడుకలు నేడు విజయవాడలో సెంట్రల్ శాసన సభ్యులు ప్రభుత్వ విప్ బోండా ఉమామహేశ్వరరావు ఆదేశాల మేరకు ముత్యాలంపాడు షిరిడి సాయిబాబా గుడి లో ప్రత్యేక పూజలు అనంతరం గుణదల మేరీ మాత ఆలయంలో చర్చి ఫాదర్ల చేత కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేసినట్లు తెలిపారు. అనంతరం పలు ఆలయాల వద్ద అభాగ్యులకు అన్నదానం కార్య క్రమం నిర్వహించారు. ప్రజా సమస్యలు పరిష్కార దిశగా విజయవాడ నగరంతో పాటు తిరువూరు, నందిగామ, మైలవరం, జగ్గయ్యపేట నియోజ కవర్గాల అభివృద్ధి ప్రదాతగా పేరు తెచ్చుకున్న ఏకైక ఎంపీగా కేశినేని చిన్ని చరిత్రలో నిలిచిపోతారని పేర్కొన్నారు. నేడు విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో గొప్ప పండుగ వాతావరణంలో సేవా కార్యక్రమాలతో ఎంపీ కేసినేని చిన్ని జన్మదిన వేడుకలు అట్టాసంగా నిర్వహిస్తున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు దాసరి కనకరావు,బుద్దవరపు రాజా, ఎస్ రాజేష్ పాల్గొన్నారు.



# అస్వస్థతతో చికిత్స పొందుతున్న టీడీపీ కార్యకర్త తండ్రిని పరామర్శించిన బొండా ఉమా



ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ

విజయవాడ స్వర హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న తెలుగు దేశం పార్టీ కార్యకర్త, బొండా ఉమామహేశ్వరరావు వీరాభిమాని పరుచూరి ప్రసాద్ తండ్రి పరుచూరి సాంబశివరావు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమా మహేశ్వరరావు వెంటనే ఆసుపత్రికి చేరుకుని ఆయనను పరామర్శించారు.ఈ సందర్భంగా వైద్యులను అడిగి ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకుని, మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అనంతరం పరుచూరి ప్రసాద్‌తో మాట్లాడుతూ, "ధైర్యంగా ఉండండి... కుటుంబానికి ఎలాంటి అవసరం వచ్చినా నేను అండగా ఉంటాను. అవసరమైన సహాయ సహకారాలు అందిస్తాను" అని భరోసా కల్పించారు.బొండాఉమామహేశ్వరరావు ఆప్యాయ పరామర్శ, ధైర్యం చెప్పిన తీరు కుటుంబ సభ్యులకు ఎంతో మనోధైర్యాన్ని నింపింది. కష్టసమయంలో కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలుస్తూ, ప్రతి ఒక్కరి యోగక్షేమాలను తెలుసుకోవడంలో ఆయన ఎల్లప్పుడూ ముందుంటారని ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పేర్కొన్నారు.

# మండలి వెంకట కృష్ణారావు చిత్రపటాల బహుకరణ



ప్రజాభూమి ప్రతినిధి / అవనిగడ్డ

రాష్ట్ర ప్రభుత్వం మండలి వెంకట కృష్ణారావు జయంతి అధికారికంగా నిర్వహించ తలపెట్టిన సందర్భంగా కూటమి నాయకులు ప్రభుత్వ కార్యాలయాలకు కృష్ణారావు చిత్రపటాలను బహుకరించారు. అవనిగడ్డ టీడీపీ క్లస్టర్ ఇంచార్జి బండే రాఘవ - మాజీ ఎంపీపీ బండే కనకదుర్గ దంపతులు నలభై చిత్రపటాలు సిద్ధం చేశారు. సోమవారం అవనిగడ్డలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చేతులమీదుగా ఆవిష్కరించారు. అనంతరం నలభై చిత్రపటాలను అవనిగడ్డ మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, అన్ని ప్రభుత్వ పాఠశాలలకు అందచేశారు. మోపి దేవి మండల జనసేన పార్టీ నాయకులు, ఏఎంసీ డైరెక్టర్ మెరకనపల్లి నరేష్ మోపిదేవి మండలంలోని అన్ని గ్రామపంచాయతీ కార్యాలయాలు, పెదకళ్ళేపల్లి గ్రామంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసేందుకు ఇరవై చిత్రపటాలను సిద్ధం చేసి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం వాటిని మోపిదేవి మండలంలోని కార్యాలయాలకు, పాఠశాలలకు బహుకరించారు. కార్యక్రమంలో గాంధీ క్షేత్రం కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు, కూటమి నాయకులు కమ్మిలి సుబ్రహ్మణ్యం, కోసూరు రవి, యలవర్తి చిన్నా, గుడివాక శివరావు, గరికపాటి హరిప్రసాద్, కమతం నరేష్, బచ్చు శ్రీహరి, నాగిడి బాబూరావు, గరికపాటి హరిబాబు, మండలి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# సత్కారాలతో సందడిగా మారిన విక్కుర్తి కార్యాలయం ..

## భారీగా తరలివస్తున్న నాయకులు, కార్యకర్తలు



ప్రజాభూమి ప్రతినిధి / అవనిగడ్డ

అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు స్వీకరించిన విక్కుర్తి శ్రీనివాసరావుకు అభినందనల పరంపర కొనసాగుతోంది. నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో ఆయన కార్యాలయానికి చేరుకుని ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. పూలమాలలు, శాలువాలు, పుష్పగుచ్ఛాలతో విక్కుర్తిని సన్మానించిన పార్టీ శ్రేణులు, ఆయన నాయకత్వంలో అవనిగడ్డలో తెలుగుదేశం పార్టీ మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేస్తామని నాయకులు స్పష్టం చేశారు.ఈ సందర్భంగా విక్కుర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ, పార్టీ అధిష్ఠానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు నిరంతరం శ్రమిస్తానని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమని పేర్కొన్నారు.ప్రతిరోజూ పెద్ద ఎత్తున ప్రజలు, నాయకులు ఆయన కార్యాలయంకి తరలివస్తుండటంతో విక్కుర్తి కార్యాలయం రాజకీయ సందడికి కేంద్రంగా మారింది. అవనిగడ్డ నియోజకవర్గంలో కొత్త ఉత్సాహం కనిపిస్తోందని పార్టీ శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి.

# ఏపి టెట్ 2026 పరీక్షలు నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

## జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి

ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా

ఏలూరు, జిల్లా కలెక్టరేటు గోదావరీ సమావేశ మందిరంలో సోమవారం ఎపి టెట్ పరీక్షలు నిర్వహణకు తీసుకోవలసిన చర్యలుపై సంబంధిత శాఖలు అధికారులతో జిల్లా కలెక్టరు సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో ఆగస్టు 05వ తేదీ నుండి 21వ తేదీ వరకు జరగనున్న టెట్ పరీక్షలు నిర్వహణకు జిల్లాలో 02 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఏలూరు- వట్లూరు సిద్ధార్థ క్వెస్ట్ సిబిఎస్ఇ స్కూలులో 05-08-2026 టూ 21-08-2026 వరకూ, ఏలూరు - వట్లూరు శ్రీ సిఆర్ రెడ్డి ఇంజనీరింగు కాలేజీలో 09-08-2026 టూ 16-08-2026 వరక పరీక్షలు జరుగుతాయని అన్నారు. పరీక్షలు మొదటి షిఫ్టు ఉదయం 9:30 గంటలు నుండి మధ్యాహ్నం 12.00 గంటలు వరకు, రెండవ షిఫ్టు మధ్యాహ్నం 2.30 గంటలు నుండి సాయంత్రం 5.00 గంటలు వరకు పరీక్షలు జరగనున్నాయని తెలిపారు. ఏపి టెట్ పరీక్షలకు జిల్లాలో 4,625 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాలు వద్ద 144 సెక్షన్ అమలు చెయ్యాలని సూచించారు. పరీక్షకేంద్రాలు సమీపంలో ఎటువంటి జిరాక్స్, నెట్ సెంటర్లు లేకుండా మూసివేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాలు వద్ద ఎటువంటి విద్యుత్తు



అంతరాయం లేకుండా చూడాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద మెడికల్ సిబ్బందిని ఏర్పాటు చెయ్యాలని వైద్యఆరోగ్య శాఖ వారికి ఆదేశించారు. దివ్యాంగులకు మొదటిగతిలో పరీక్షలు వ్రాసేలా చూడాలని, వారికి మూడు చక్రాలు వాహనం, ఒక సహాయకుని సిద్ధం చెయ్యాలని సూచించారు. త్రాగునీరు, శానిటేషన్, మౌళిక సదుపాయాలు ఏర్పాటు చెయ్యాలని ఆయా శాఖలు అధికారులను ఆదేశించారు. పరీక్షలు జరిగే సమయాల్లో ఆయా రూట్లలో బస్సులు అంతరాయం లేకుండా తిరిగేలా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింటు కలెక్టరు యం.జె. అభిషేక్ గౌడ, అసిస్టెంటు కలెక్టరు సి.హెచ్. శ్రావణ్ కుమార్ రెడ్డి, సబ్ కలెక్టరు బొల్లిపల్లి వినూత్న, జిల్లా విద్యాశాఖ యం.వెంకటలక్ష్మమ్మ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.యు. శోభ, ఏపీఎస్ ఆర్టీసీ ప్రజారవాణా అధికారి ఎస్.కె.షబ్నమ్, నగర పాలకసంస్థ కమీషనరు ఏ.భానుప్రతాప్, సంబంధిత శాఖలు అధికారులు పాల్గొన్నారు.

## పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఎండుగడ్డి, మందులు పంపిణీ



ప్రజా భూమి ప్రతినిధి-వేలేరుపాడు

వేలేరుపాడు మండలం రుద్రంకోట గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువుల లబ్దిదారులకు డాక్టర్ సాయిబుచ్చారావు తన సిబ్బంది మందులు మరియు ఎండుగడ్డి పంపిణి చేసారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గోదావరి వరదల కారణం పశువులు మేత దొరకక ఇబ్బంది పడుతుంటాయి. పశువులకు మేత కొరత ఉండకుడదని అదేవిధంగా వర్షాకాలం లో పశువులకు అనేక రకాల వ్యాధులు వస్తువుంటాయి. వాటి నుండి ఆరోగ్యాంగా ఉండటం కొరకు మందులు పంపిణి చేయడం జరుగుతుంది. అదేవిధంగా ప్రతి ఒక్క లబ్దిదారుడు కూడా పశువుల పెంపకం పై అవగాహనా కలిగి ఉండాలని అన్నారు. పశువుల కు అనారోగ్య సమస్యలు ఏమైనా ఉన్నట్లయితే గ్రామంలో ఉన్న పశు సంవర్ధక శాఖ వారిని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమం లో పశుసంవర్ధక శాఖ సిబ్బంది భవాని, రాంబాబు, అశోక్, అదేవిధంగా రుద్రంకోట కూటమి నాయకులు అయిన కొవ్వాల క్రాంతికుమార్, అమరావరపు వెంకన్న, కొఠారి సత్యనారాయణ, నలజాల రాజేష్, సారే బాబ్జి, మద్దినాశెట్టి వెంకన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

## ఏలూరు విలీన గ్రామాలకు గోదావరి తాగునీరు

### -అమృత్ 2.0 పనులకు శంకుస్థాపన

ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు



నగరంలో విలీనమైన గ్రామాల ప్రజలకు గోదావరి జలాలను తాగునీరుగా అందించేందుకు అమృత్ 2.0 పథకం కింద కీలక పనులకు శ్రీకారం చుట్టారు. చొదిమెళ్ళలో రూ.1.65 కోట్ల వ్యయంతో 5 లక్షల లీటర్ల సామర్థ్యం గల ఓవర్ హెడ్ నీటి ట్యాంకు నిర్మాణానికి ఎంపీ పుట్టా మహేష్ కుమార్, ఎమ్మెల్యే బడేటి చంటి,ఆర్టీసీ జోన్-2 చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు,బీజేపీ జిల్లా అధ్యక్షుడు చౌటుపల్లి విక్రమ్ కిషోర్ తదితరులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మాట్లాడుతూ అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే బడేటి చంటి కోరిన మేరకు రహదారి,బోరు పనులకు రూ.57 లక్షల ఎంపీ నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ అమృత్ 2.0 కింద రూ.299.37 కోట్లతో తాగునీరు,డ్రైనేజీ ప్రాజెక్టులు చేపడుతున్నామని,విలీన గ్రామాల ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## వరద తగ్గింది... బురద మిగిలింది



ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.

గోదావరి వరదలు సంభవించి లోతట్టు గ్రామల ప్రజలు నానా అవస్తలు పడ్డారు. వరదలు తగ్గిన తరువాత ఇళ్లలో బురద పేరుకుపోయి, వాటిని కడుక్కొనేందుకు వరద బాదితులు నానా అవస్తలు పడ్డారు. అలాగే ఇళ్లలో బురదను ఎవరికి వారు శుభ్రం చేసుకున్నారు కానీ, విధులలో పేరుకు పోయిన బురదను ఎవరు తొలగించాలి. వరదల వల్ల విధులలో పేరుకు పోయిన బురదను సంబంధిత అధికారులు తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈమేరకు మండల పరిధిలోని శ్రీరామగిరి గ్రామంలో పేరుకు పోయిన బురద వల్ల వాహన చోదకులు అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండలంలోని ఆయా వరద ప్రభావిత ప్రాంతాలలో గల అన్ని గ్రామాలలో రహదారులను శుభ్రం చేయాలని వరద ముంపు బాధిత గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇదిలాఉంటే అదే శ్రీరామగిరి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి రవితేజ ఆద్వర్యంలో సోమవారం అంతర్గత వీధులు డ్రైన్లలో బ్లీచింగ్ చెల్లించారు.

# విద్య ద్వారానే ఉజ్వల భవిష్యత్తు సాధ్యం

## కారంపూడి ఫౌండేషన్ 15వ వార్షికోత్సవం.

ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా

బానిసత్వం, పేదరికం, అజ్ఞానం నుండి బయటపడాలంటే విద్య ఒక్కటే మార్గమని, విద్య ద్వారానే ఉజ్వల భవిష్యత్తు నిర్మించుకోవచ్చని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు, ప్రముఖ న్యాయవాది గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. కారంపూడి ఫౌండేషన్ 15వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సీనియర్ జర్నలిస్టు, సామాజిక కార్యకర్త ఎ. శివకేశవరావు (శివశ్రీ) అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమం లో రైతులు, కౌలు రైతులను దుశ్శాలువాలతో సత్కరించి నూతన వస్త్రాలను బహూకరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ప్రజాధనంతో ప్రభుత్వం ఉచిత విద్యను అందించేందుకు కృషి చేస్తోందని, దానిని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి విద్యార్థి, తల్లిదండ్రులపై ఉందన్నారు. విద్య జ్ఞానాన్ని అందించే వరమని, సమాజంలో సమానత్వం సాధనకు విద్య కీలక సాధనమని పేర్కొన్నారు. నిమ్నవర్గాల అభ్యున్నతి కోసం జీవితాలను అంకితం చేసిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, స్వామి వివేకానంద తమకు స్ఫూర్తి ప్రదాతలని అన్నారు. 2012లో కారంపూడి విజయ్ తన తండ్రి ఆశయాలను కొనసాగించాలనే సంకల్పంతో కారంపూడి ఫౌండేషన్‌ను స్థాపించినట్లు తెలిపారు. గత 15 సంవత్సరాలుగా నిరుద్యోగ యువతకు మార్గదర్శనం చేయడం, విద్యార్థులకు శిక్షణ అందించడం, రైతుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం, రైతులను గౌరవించడం వంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఫౌండేషన్ చైర్మన్ కారంపూడి విజయ్ మాట్లాడుతూ తమ కుటుంబ సభ్యులు తనను సివిల్ సర్వీసెస్‌లో చూడాలని ఆకాంక్షించినప్పటికీ ఆర్థిక పరిస్థితుల కారణంగా ఆ లక్ష్యాన్ని సాధించలేకపోయానన్నారు. అయితే పేద, ప్రతిభావంతులైన విద్యార్థులు అలాంటి పరిస్థితులు ఎదుర్కోకూడదనే ఉద్దేశంతో ఫౌండేషన్ ద్వారా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



విద్యార్థులు చిన్నప్పటి నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకుని కృషి చేయాలని, తల్లిదండ్రులు సరైన ప్రణాళికతో పిల్లలను తీర్చిదిద్దాలని సూచించారు. రైతుల పట్ల తనకు ఉన్న అభిమానం తన తండ్రి నుంచి వచ్చిందని పేర్కొన్న విజయ్, రైతులు తమ పిల్లలను వ్యవసాయానికి దూరం చేయవద్దని కోరారు. వ్యవసాయం దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని, ఇప్పటికీ దేశ జనాభాలో అధిక శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని చెప్పారు. రైతు ఏడాదికి ఒకసారి మాత్రమే పంట ద్వారా ఆదాయం పొందుతాడని, ఆశించిన ఫలితం రాకపోతే తీవ్ర నిరాశకు గురవుతాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఫౌండేషన్ ద్వారా శిక్షణ పొంది ఉద్యోగం సాధించిన సుధీర్ తన అనుభవాలను పంచుకుంటూ, ఫౌండేషన్ అందించిన మార్గదర్శనం తన జీవితాన్ని మలుపు తిప్పిందని తెలిపారు. ఫౌండేషన్ స్థాపన నుంచి ఇప్పటి వరకు సుమారు 3 వేల మంది విద్యార్థులకు ఉన్నత విద్య, పోటీ పరీక్షలు, ఉపాధి అవకాశాలకు సంబంధించిన శిక్షణ అందించినట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పతంజలి యోగా ప్రచారకులు దుర్గారావు, రైతు ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థులు, యువకులు తదితరులు పాల్గొన్నారు

# మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్యకు ఘనంగా నివాళులు

ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.

మండలంలోని సున్నవారిగూడెంలో మాజీ ఎమ్మెల్యే, సిపిఎం సీనియర్ నాయకుడు అమరజీవి సున్నం రాజయ్య 6వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సున్నవారిగూడెంలోని స్థూపం వద్ద మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్ అధ్యక్షతన వర్ధంతి సభ జరిగింది. కార్యక్రమం ప్రారంభంలో సున్నం రాజయ్య చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సున్నం రాజులు పూలమాలలు వేసి నివాళులర్పించి అనంతరం ఎంపిపి కారం లక్ష్మి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అలుపెరగని ప్రజాపోరాట యోధుడు సున్నం రాజయ్య ఈ వర్ధంతి సభకు ముఖ్య అతిథులుగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వి వెంకటేశ్వర్లు, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి. కృష్ణయ్య హాజరై మాట్లాడారు. సున్నం రాజయ్య శాసనసభ్యుడిగా మూడు పర్యాయాలు ప్రజలకు సేవ చేశారని కొనియాడారు. ఆయన తన పదవీ కాలంలో గిరిజన, గిరిజనేతర ప్రజల భూమి హక్కుల



కోసం, పోడు భూముల సమస్యలపై, ప్రజా సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని పోరాటాలు చేశారని గుర్తుచేసుకున్నారు. "నేడు ఏజెన్సీ ప్రాంతాల్లో మనం అనుభవిస్తున్న రహదారులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఇతర మౌలిక వసతులు సున్నం రాజయ్య చేసిన సుదీర్ఘ పోరాటాల ఫలితమే. ఆయన చేసిన నిష్కల్మషమైన ప్రజా సేవలు ఎప్పటికీ మరువలేనివి. రాజయ్య గారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి" అని వి. వెంకటేశ్వర్లు, వి. కృష్ణయ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ సిపిఎం జిల్లా నాయకులు సోయం చిన్నబాబు, కూనవరం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు, మడకం నాగమణి, కూనవరం మండల కార్యదర్శి బాబు బుర్రయ్య, ఎటపాక మండల కార్యదర్శి కాకా అర్జున్ , వి ఆర్ పురం మండల నాయకులు పంకు సత్తిబాబు, కారం సుందరయ్య, గిరిజన సంఘం మండల కార్యదర్శి ఎం పి టి సి ప్రదీప్ కుమార్, తోడంరాజు, కారం సత్తిబాబు, పులి బుజ్జి, వడ్లాది రమేష్, సిరప్ తాతబాబు, తుర్రం బాబురావు, చిక్కాల రామారావు, జల్లి సత్యనారాయణ, యుటిఎఫ్ నాయకులు సోడి నాగేశ్వరావు, రామకృష్ణ, కుటుంబ సభ్యులు సున్నం రాజయ్య తల్లి కన్నమ్మ, సతీమణి సు న్నం సుక్కమ్మ, కొడుకు చంద్రావు, సీతారా మరా జు, లక్ష్మి, స్వరాజ్యం, వివిధ మండలాల నుంచి కార్యకర్తలు నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మహిళా శారీరక విద్యా ఉపాధ్యాయురాలి పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం



ప్రజాభూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

బొద్దనపల్లిలోని ఆంధ్రప్రదేశ్ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో మహిళా శారీరక విద్యా ఉపాధ్యాయురాలు (పీఈటీ) పోస్టును భర్తీ చేయడానికి అర్హత కలిగిన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కె. గీతాంజలి తెలిపారు. శారీరక విద్యలో బీపీఈడీ అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థికి నెలకు రూ.10,900 వేతనంతో పాటు పాఠశాలలోనే ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పించబడుతుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు మరిన్ని వివరాల కోసం 8712625036 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

# కృష్ణా డెల్టాకు సాగునీటి కోసం రోడ్డెక్కిన అన్నదాతలు

## ఏలూరు కలెక్టరేట్ ముందు రైతు సంఘం ఆధ్వర్యంలో కృష్ణా డెల్టా రైతులు ధర్నా.

ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా.

కృష్ణా డెల్టాకు సాగునీటి కోసం కృష్ణా డెల్టా రైతులు రోడ్డెక్కారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఏలూరు కలెక్టరేట్ ముందు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. కలెక్టరేట్ లోపలికి వెళ్తే కేసులు పెడతామని పోలీసులు బెదిరించడంతో పోలీసులతో కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. అనంతరం భారీ గేడ్లు వద్ద బైఠాయించారు. రైతు సంఘం, రైతుల ప్రతినిధి బృందం పిజిఆర్ఎస్ లో జిల్లా కలెక్టర్ వెట్రిసిల్వికి వినతిపత్రం అందజేసి సాగునీటి పై చర్చలు జరిపారు. కృష్ణా డెల్టాను ఎడారిగా మార్చవద్దు.. సాగునీరు ఇవ్వాలి అంటూ పెద్ద ఎత్తున రైతులు నినాదాలు చేశారు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సాగునీరు ఇచ్చే అవకాశం ఉన్నా ప్రభుత్వాధినేతలు, జల వనరుల శాఖ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఏలూరు జిల్లా దెందులూరు, ఏలూరు నియోజక వర్గాల పరిధిలోని పరిధిలో కృష్ణా డెల్టా ఆయకట్టుకు భూములకు ప్రత్యామ్నాయ



మార్గాల ద్వారా గోదావరి జిలాలు అందించే అవకాశం ఉన్నా ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం దారుణమని విమర్శించారు. ఏలూరు రూరల్ మండలంలోని 10 వేల ఎకరాలకు పోణంగి పుంత కాలువ ద్వారా గోదావరి జలాలు ఎందుకు అందించలేకపోతున్నారని ఆయన ప్రశ్నించారు. గోదావరి మెయిన్ కెనాల్ ను ఆధునీకరించకుండా నిర్లక్ష్యం చేసి రైతులను బలి చేయడం తగదన్నారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ కు పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరుతోందని, పులిచింతల వద్ద 30 టీఎంసీల నీరు నిల్వ ఉందని, పట్టిసీమ కాలువ ద్వారా ఇప్పటివరకు కృష్ణా బ్యారేజ్ కు పది టీఎంసీల నీరుకు పైగా తరలించారని చెప్పారు. గోదావరి జలాలు సముద్రం పాలవుతున్నాయని, పంటలకు మాత్రం నీళ్లు ఇవ్వలేకపోతున్నారని ఇది ప్రభుత్వ వైఫల్యం అని తీవ్రంగా విమర్శించారు. జూన్ 15 నుండి కృష్ణా డెల్టాకు సాగునీరు ఇస్తామని చెప్పి, సబ్సిడీపై వరి విత్తనాలు సరఫరా చేసి ఇప్పుడు అర్థాంతరంగా సూపర్ ఎల్ నినో ఉందనే పేరుతో వరి సాగు చేయొద్దని ముఖ్యమంత్రి చెప్పడం రాష్ట్ర ప్రభుత్వానికి తగిన వ్యవసాయ ప్రణాళిక లేకపోవడమేనని అన్నారు. కృష్ణా డెల్టాలో రైతులు వరి నారుమళ్లు వేసుకున్నారని, కొన్నిచోట్ల నాట్లు కూడా వేశారని చెప్పారు. ఎకరాకు రూ.10 వేలు నుండి రూ.15 వేలు వరకు రైతులు పెట్టుబడి పెట్టారని, అత్యధిక మంది కౌలు రైతులేనని అన్నారు. అప్పులు చేసి పెట్టుబడి పెట్టిన తర్వాత వరి సాగు చేయవద్దని ప్రభుత్వం చెప్పడం వలన కృష్ణా డెల్టా రైతులు పరిస్థితి అగమ్య గోచరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీశైలం,నాగార్జునసాగర్ కు పెద్ద ఎత్తున వరద నీరు వస్తున్న క్రమంలో పట్టిసీమ నీరును కృష్ణా డెల్టాకు మళ్లించి పంటల సాగుకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. కృష్ణా డెల్టాలో ఖరీఫ్ లోనే వరి సాగు చేస్తున్నారని, రబీలో అపరాల పంటలు సాగు చేస్తారని కాబట్టి ఖరీఫ్ కు వరి సాగుకు మీరు ఇవ్వాల్సిందేనని అన్నారు. ఏలూరు రూరల్ మండలం కృష్ణా ఆయకట్టుకు పోణంగి పుంత కాలువ ద్వారా గోదావరి జలాలు అందించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని కోరారు. తాడిపూడి ఆయకట్టు రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు సాగునీరు ఇవ్వకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కృష్ణా డెల్టా ఆయకట్టు రైతులు వాడవల్లి రామారావు, దాసరి హనుమంతరావు, బైరెడ్డి లక్ష్మణరావు మాట్లాడుతూ మాకు



నీరు ఇవ్వకపోతే ఉపాధి లేక వలసలు పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పశు పోషణ కూడా భారంగా మారుతుందని చెప్పారు. కృష్ణా డెల్టాకు సాగునీరు విడుదల చేసి పేద రైతులు,కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తాడిపూడి ఎత్తిపోతల పథకం ఆయకట్టు రైతులు మలకలపల్లి నాగు, దాసరి సతీష్ మాట్లాడుతూ తాడిపూడి ఎత్తిపోతలకు సాగునీరు విడుదల చేసినా శివారు ప్రాంత భూములు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు ఎండిపోతున్నాయని సాగునీరు ఇచ్చి పంటలను కాపాడాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఆర్. లింగరాజు మాట్లాడుతూ సాగునీటి కోసం రైతులు చేస్తున్న ఆందోళనకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ప్రభుత్వం స్పందించి కృష్ణా డెల్టా రైతులను ఆదుకోవాలని కోరారు.


**జిల్లా కలెక్టర్ వినత పత్రం..**

సాగునీటికి ఇచ్చేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను చూసి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు, రైతులు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వికి వినతిపత్రం అందజేశారు. సాగునీటి సమస్యలను వివరించారు. తగు చర్యలు చేపడతామని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, జిల్లా కమిటీ సభ్యులు గుర్రం రాంబాబు, కృష్ణా డెల్టా ఆయకట్టు రైతులు పైడిపాటి భాస్కరరావు, తలారి జయరాజు, దాసరి నాగేశ్వరరావు, బండి శ్రీనివాసరావు, కోన శ్రీనివాసరావు, పుట్టి దుర్గాప్రసాద్, మారుమూడి సుధాకర్, ఎస్.బాబు, ఎలికే ఏసుపాదం, నూలు ధర్మరాజు,శలాకోటి సుబ్బారావు, సత్తెనపల్లి నరసింహారావు, చిన్ని పోతురాజు తదితరులు పాల్గొన్నారు. ఏలూరు, దెందులూరు,పెదపాడు, ఉంగుటూరు, ద్వారకా తిరుమల మండలాలు నుండి రైతులు తరలివచ్చారు.

# ఈ ఏడాది జనవరి నుండి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న పెద్దపులి

- స్వర్ణ వారి గూడెంలో మకాం వేసిన పెద్దపులి
- వందలాదిమంది నలువైపులా పహారా కాస్తున్నారు
- పులి ముమ్మర అన్వేషణ - అత్యంత జాగ్రత్తగా అటవీ శాఖ అధికారుల ప్రత్యేక ఆపరేషన్





ప్రజా భూమి ప్రతినిధి-జీలుగుమిల్లి

ఈ ఏడాది జనవరి నుండి పెద్ద పులి కంటి మీద కులుకు లేకుండా ఫారెస్ట్ అధికారులను ప్రజలను ముప్పతిప్పలు పెడుతుంది. పాపి కొండ ప్రాంతమైన కావిడి గూడెం నుండి ప్రారంభమైన తన జైత్రయాత్ర అనేక జిల్లాల లో తిరుగుతూ వేటికలకు ఏలూరు జిల్లాలోని జీలుగుమిల్లి మండలంలోని స్వర్ణ వారి గూడెంలో గత రెండు రోజుల నుండి దిష్టి వేసింది.ఆంధ్రప్రదేశ్ అటవీ దళాల అధిపతి (పిఆర్ఎల్ఐ). చీఫ్ కన్సర్వేటర్ అఫ్ ఫారెస్ట్స్ డ హెచ్ వై ఎఫ్ ఎఫ్ , అమరావతి) మరియు డాక్టర్ టి. జ్యోతి, ఐ.ఎఫ్.ఎస్. (చీఫ్ కన్జర్వే టర్ ఆఫ్ ఫారెస్ట్స్ - సీసీఫ్ , రాజమండ్రి) ఉత్తర్వుల మేరకు ఏలూరు - రాజమండ్రి - కాకినాడ - చింతూరు - పాపికొండ నేషనల్ పార్క్ ప్రాంతాలలో సంచరిస్తున్న పులిని సురక్షితంగా బంధించేందుకు అటవీ శాఖ తన ప్రయత్నాలను మరింత ముమ్మరం చేస్తున్నారు.ఇప్పటికే మహారాష్ట్ర (వార్ధా, పుణే) బృందాలతో పాటు, బెంగళూరు నుండి 'వైల్డ్లైఫ్ (విల్డలైఫ్ ఎస్ ఎస్ ) నిపుణుల బృందాన్ని, వార్ధా నుండి 'పీపుల్ ఫర్ యానిమల్స్' (పీపుల్ ఫర్ అనిమల్స్ ) బృందాన్ని, అలాగే వివిధ టైగర్ రిజర్వ్ నుండి అనుభవజ్ఞులైన ప్రత్యేక బృందాలను కూడా రంగంలోకి దించారు. మత్తుమందు తుపాకీలతో పులిని బంధించడం లో నైపుణ్యం ఉన్న ఆరుగురు (6) ట్రాం క్విలైజింగ్ షూటర్లను సిద్ధంగా ఉంచారు. అధికారుల పరిశీలన పులి ప్రవర్తన: ఈ పరిస్థితిని స్వయంగా సమీక్షించేందుకు ఏలూరు జిల్లా అటవీ శాఖాధికారి (డీఎఫ్) పి.వి. సందీప్ రెడ్డి, ఐ.ఎఫ్.ఎస్. క్షేత్రస్థాయిలో పర్యటించి ఆపరేషన్ను పరిశీలించారు.పులి చాలా చురుగ్గా, చాకచక్యంగా ప్రవర్తిస్తోంది. మానవ సంచారం ఉన్న ప్రాంతాలను, చివరకు ప్రత్యేకంగా అమర్చిన మంచెలను (మచ్చన్ ) కూడా చాలా తెలివిగా గమనిస్తూ, మనుషులు ఉండే ప్రదేశాలను తప్పించుకుంటూ ప్రయాణిస్తోంది. అయినప్పటికీ, నిపుణుల బృందాలు పక్కా వ్యూహంతో పులిని క్షేమంగా బంధించడానికి (ట్రానక్విలిజ్, కాప్చర్ ) రాత్రింబవళ్లు శ్రమిస్తున్నాయి.ప్రజలకు హెచ్చరికలు, అప్రమత్తత: ప్రతిరోజూ పులి సంచారాన్ని నిరంతరం ట్రాక్ చేస్తూ... పాములవారిగూడెం, స్వర్ణవారిగూడెం, పుల్లెపూడి, అక్కంపేట, ముసన్నగూడెం, శ్రీనివాసపురం, పెద్దిపల్లి, రామచర్లగూడెం, తడువాయి, రామన్నపాలెం, ఎ.పోలవరం, సూరంపల్లి, మాతంగిగూడెం, బోర్రంపాలెం, తిరుమలాదేవిపేట మరియు సమీప గ్రామాల ప్రజలను దప్పు చాటింపులు ( టామ్ టామ్ ) మరియు మైక్ అనౌన్స్మెంట్ల ద్వారా అప్రమత్తం చేస్తున్నారు.కన్నాపూర్, పోలవరం, కుకునూరు మరియు జంగారెడ్డిగూడెం ఫారెస్ట్ రేంజ్ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పూర్తి అప్రమత్తతతో ఉన్నారు. ప్రజలు కూడా భయాందోళన చెందకుండా అటవీ శాఖ సూచనలు పాటిస్తూ అధికారులకు సహకరించాలని కోరుతున్నారు. ఆదివారం రాత్రి 9 గంటలకు బృందాన్ని తప్పించుకొని జల్లేరు లోనికి ప్రవేశించి తిరిగి స్వర్ణం వారి గూడెం గ్రామంలో ముఖం వేసింది. స్వర్ణ వారి గూడెం ప్రాంతంలో తిన్న గేద దూడ సమీప్ ప్రాంతానికి వచ్చి విశ్రాంతి తీసుకుంటుంది. ఒక పక్కన వాగు, అదే ప్రాంతంలో దట్టమైన ఎదురు పొదల వద్ద వీలు లేని ప్రాంతంలో కులుకు తీస్తుంది. దీనిని బంధించడం కోసం ఐదు బృందాలను ఏర్పాటు చేసి ఒక్కో బృందంలో పాతికమంది చెప్పిన ఫారెస్ట్ అధికారులు పహార కాస్తున్నారు. ఏ క్షణంలోనైనా పులిని బంధించడం కోసం అన్ని ఏర్పాట్లు చేశారు.

# సమాజంలో ఎవ్వరూ నిరాదరణకు గురికాకూడదు

- విద్యావంతమైన సమాజ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.
- లొల్ల భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉచిత సహాయక పరికరాల పంపిణీ.



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.

సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని, ప్రత్యేక అవసరాల పిల్లలు కూడా ఇతరులతో సమానంగా ఎదిగేలా అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తున్నామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. ఆత్రేయపురం మండలంలోని లొల్ల భవిత కేంద్రంలో పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉచిత సహాయక పరికరాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్య, వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్యావంతమైన సమాజం ద్వారానే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని, సమాజంలో ఎవరూ నిరాదరణకు గురికాకుండా ప్రతి ఒక్కరినీ సమాన దృష్టితో చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని అన్నారు. ప్రత్యేక అవసరాల పిల్లల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని తెలిపారు. భవిత కేంద్రాల ద్వారా వారికి అవసరమైన విద్య, శిక్షణ, సహాయక పరికరాలు అందించి స్వయం సమర్థులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేక ప్రతిభావంతులు తమలోని సామర్థ్యాన్ని వెలికితీసుకుని సమాజంలో గౌరవప్రదమైన స్థానం సంపాదించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా తోడ్పాటు అందిస్తోం దన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు 9 టీఎల్ఎం (టీచింగ్ అండ్ లెర్నింగ్ మెటీరియల్) కిట్లు, 3 హియరింగ్ హెడ్‌సెట్లు, ఒక సీపీ చైర్, ఒక వీల్‌చైర్ పంపిణీ చేశారు. ఈ పరికరాలు పిల్లల విద్యాభ్యాసం, దైనందిన కార్యకలాపాలు మరింత సులభతరం చేస్తాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో విద్యాశాఖ, సమగ్ర శిక్ష అధికారులు, భవిత కేంద్రం సిబ్బంది, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రజల మేలు కోసమే... కూటమి ప్రభుత్వం కృషి

## రైతు బజార్లలో తక్కువ ధరకే బియ్యం విక్రయాలు ప్రారంభం




ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.

సామాన్య ప్రజలకు పెరిగిన బియ్యం ధరల భారం తగ్గించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రైతు బజార్లు, ఎమ్మార్వో కార్యాలయాల్లో ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసి తక్కువ ధరకే నాణ్యమైన బియ్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. సోమవారం కొత్తపేట, రావులపాలెం రైతు బజార్లలో ఏర్పాటు చేసిన బియ్యం విక్రయ కేంద్రాలను ఏపీ బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంత కుమారి, ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ, కొత్తపేట రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు వంటిపల్లి పాపారావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ పల్లి మంగాదేవి భీమరావుతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల మేలు కోసమే కూటమి ప్రభుత్వం నిరంతరం ఆలోచిస్తూ, నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో, రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘం సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా 150 రైతు బజార్లు, 500 రైస్ మిల్లర్ల ప్రత్యేక కౌంటర్లలో బియ్యం విక్రయ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో బీపీటీ సూపర్ ఫైన్ బియ్యం రూ.62కు విక్రయిస్తుండగా, ప్రభుత్వ కేంద్రాల్లో అదే బియ్యాన్ని రూ.52కే అందిస్తున్నట్లు చెప్పారు. అలాగే బీపీటీ రా (పచ్చి) బియ్యాన్ని మార్కెట్ ధర రూ.58తో పోలిస్తే రూ.50కే విక్రయిస్తున్నట్లు వెల్లడించారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగినప్పుడు ధరల స్థిరీకరణ నిధి ద్వారా ప్రభుత్వం నేరుగా జోక్యం చేసుకుని ప్రజలకు అందుబాటు ధరల్లో వస్తువులు అందేలా చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నాణ్యమైన బియ్యాన్ని తక్కువ ధరకే ప్రజలకు అందించాలనే సంకల్పంతో రైతు బజార్లతో పాటు ఆయా మండలాల ఎమ్మార్వో కార్యాలయాల్లో కూడా విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ప్రజలకు నిత్యావసర వస్తువులు తక్కువ ధరలకు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. త్వరలో "మీ మార్ట్" కేంద్రాలను కూడా ప్రారంభించి, మార్కెట్ ధరల కంటే తక్కువ ధరకే అవసరమైన వస్తువులను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. రైతు బజార్ వ్యవస్థను చంద్రబాబు నాయుడు ప్రారంభించారని గుర్తు చేసిన ఎమ్మెల్యే, రైతులకు గిట్టుబాటు ధర లభించడంతో పాటు వినియోగదారులకు కూరగాయలు, ఇతర వస్తువులు సరసమైన ధరలకు లభించేలా రైతు బజార్లు కీలక పాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. జిల్లాలో ఉన్న మూడు రైతు బజార్లలో రెండు కొత్తపేట నియోజకవర్గంలోనే ఉండటం గర్వకారణమన్నారు. డిమాండ్-సరఫరా సూత్రానికి అనుగుణంగా ధరలను నియంత్రిస్తూ రైతు బజార్ల నిర్వహణ జరుగుతోందని తెలిపారు. రావులపాలెం మార్కెట్ యార్డు ప్రాంగణంలో శాశ్వత రైతు బజార్ నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే వెల్లడించారు.

## పరమేశ్వరునికి ప్రత్యేక అభిషేక పూజలు

ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి



ఆషాఢ బహుళ పంచమి సందర్భంగా సోమవారం శోభనాచల గుట్టపై ఉన్న స్వయంభు దుర్గా పార్వతి సమేత మల్లికార్జున స్వామివారికి, బస్టాండ్ సమీపంలోని గంగా అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకవారాభిషేకం, పంచామృతాభిషేకం, అలంకరణ, సహస్రనామార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకుడు దేవులపల్లి శ్రీనివాసమూర్తి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి సి.హెచ్. సాయి పర్యవేక్షించారు.

## తల్లిపాలే శిశువుకు సంపూర్ణ ఆహారం

-తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన కరపత్రం ఆవిష్కరణ.



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.

తల్లిపాల వారోత్సవాలు (ఆగస్టు 1-7) సంద ర్భంగా ఆత్రేయపురం మండలం వసంతవాడ గ్రామ పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేం ద్రం నెం.145 (కాలనీ)లో సోమవారం తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించే కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ పి.వి.ఆర్.కె. రాజు మాట్లాడుతూ తల్లిపాలు శిశువుకు తొలి, సంపూర్ణ ఆహారమని తెలిపారు. శిశువు జన్మించిన గంటలోపే తల్లిపాలు పట్టించడం వల్ల ఆరోగ్యకరమైన ఎదుగుదలతో పాటు అనేక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని పేర్కొన్నారు. తొలి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, అనంతరం తగిన పరిపూరక ఆహారంతో పాటు రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం వరకు తల్లిపాలు అందించడం తల్లి, శిశువు ఇద్దరి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వై. అరుంధతి, అంగన్‌వాడీ టీచర్లు ఎన్. మనకమ్మ, పి. సాయిలక్ష్మి, జె. సుబ్బలక్ష్మి, పి. నిరోషా, ఆర్. భవాని, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

## రామచంద్రపురం పట్టణంలో బిజెపి కార్యవర్గ సమావేశం.



ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం

భారతీయ జనతా పార్టీ రామచంద్రపురం పట్టణ కార్యవర్గ సమావేశం ఆపార్టీ శ్రేణులు నిర్వహించారు. ఈ మేరకు సోమవారం జరిగిన కార్యక్రమం పట్టణ అధ్యక్షులు దునే శ్రీనివాసు అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశానికి రామచంద్రపురం టౌన్ ఇన్‌చార్జ్ అవసరాల రమణమూర్తి, మాజీ పట్టణ అధ్యక్షులు కేశవ రాఘవేంద్ర,జిల్లా కార్యవర్గ సభ్యులు కొట్టవాడ హరిబాబు, పట్టణ ప్రధాన కార్యదర్శి మాధవభట్ల కృష్ణమూర్తి, సీనియర్ నాయకులు కుప్పల సూర్యనారాయణ,అవసరాల నారాయణమూర్తి,జిల్లా యువమోర్చా అధ్యక్షులు గానాల కళ్యాణ్, రాయుడు మణికంఠ, బిజెపి కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.ఈ సమావేశంలో పార్టీ బలోపేతం, బూత్ స్థాయి కార్యక్రమాల నిర్వహణ, సభ్యత్వ విస్తరణ, ప్రజా సమస్యలపై పార్టీ చేపట్టాల్సిన కార్యాచరణ తదితర అంశాలపై పార్టీ శ్రేణులు విస్తృతంగా చర్చించారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలని నాయకులు కార్యకర్తలకు ఈసందర్భంగా పిలుపునిచ్చారు.కార్యవర్గ సమావేశం అనంతరం సంత్ రవిదాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

# వరద ప్రభావం తగ్గిన తర్వాత పునరుద్ధరణపై ప్రత్యేక దృష్టి కీలకం

- క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి
- మలేరియా వ్యాప్తి జరగకుండా చురుగ్గా ఉండటం, ఇంటింటి ఆరోగ్య సర్వే పూర్తి చేయాలి
- కలెక్టర్ దినేష్‌కుమార్





ప్రజా భూమి ప్రతినిధి-కూనవరం

వరదల హెచ్చరిక ఉపసంహరణ అనంతరం పునరుద్ధరణ చర్యలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె. దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు,స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సోమవారం చింతూరు డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు,ఈ సందర్భంగా కలెక్టర్ కె దినేష్ కుమార్ మాట్లాడుతూ, వరద ప్రభావిత గ్రామాల్లో అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి సమయోచితంగా స్పందించడం వల్ల నష్ట నివారణ చర్యలు సమర్థవంతంగా అమలయ్యాయని కలెక్టర్ పేర్కొన్నారు. "రోగానికి చికిత్స కంటే ముందస్తు నివారణ మేలు" అనే నానుడిని గుర్తుచేస్తూ, హెచ్చరిక దశలో తీసుకున్న జాగ్రత్తలు సత్ఫలితాలు ఇచ్చాయని చెప్పారు. కొత్తగా ఏర్పాటైన పోలవరం జిల్లాలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసిన తీరు ప్రశంసనీయమన్నారు,ప్రస్తుతం వరద ప్రభావం తగ్గుతున్న నేపథ్యంలో తదుపరి చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, రహదారులు, వైద్య సేవల పునరుద్ధరణను శాఖలవారీగా పర్యవేక్షించాలని దినేష్ కుమార్ ఆదేశించారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టాలని చెప్పారు.

### ముందస్తుగా రేషన్ పంపిణీ

వరదల కారణంగా సెప్టెంబర్ నెల రేషన్ సరుకులను ప్రభుత్వం ముందుగానే విడుదల చేయనున్నందున, క్షేత్రస్థాయిలో నిత్యావసర సరుకుల పంపిణీకి సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పంపిణీ ప్రక్రియలో ఎలాంటి అంతరాయం లేకుండా పర్యవేక్షణ చేపట్టాలని పేర్కొన్నారు. గ్రామ స్థాయి నోడల్ అధికారులు, మండల స్థాయి ప్రత్యేక అధికారులు వ్యక్తిగత బాధ్యతతో పనిచేయాలని స్పష్టం చేశారు.వరదల సమయంలో ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలు, వరద నీరు తగ్గిన తర్వాత తీసుకోవాల్సిన పారిశుధ్య, ఆరోగ్య, భద్రతా చర్యలపై గ్రామాల్లో విస్తృత అవగాహన కల్పించాలని అన్ని శాఖల అధికారులకు సూచించారు,వరద నీరు తగ్గిన అనంతరం మలేరియా, డెంగ్యూ తదితర వ్యాధులు వ్యాపించకుండా అన్ని శాఖల అధికారులు చురుకుగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల్లో నిల్వ నీరు, చెత్త పేరుకుపోయిన ప్రాంతాలను వెంటనే గుర్తించి శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి ఇంటిని సందర్శిస్తూ ఇంటింటి ఆరోగ్య సర్వేను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, జ్వరం, విరేచనాలు, చర్మవ్యాధులు వంటి లక్షణాలు ఉన్న వారిని వెంటనే గుర్తించి వైద్య సేవలు అందించాలని తెలిపారు. దోమల నివారణ చర్యలు, క్లోరినేషన్, పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరంగా కొనసాగిస్తూ ప్రజల్లో ఆరోగ్య అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.

### టేకుబాకలో వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ

గోదావరి వరదల ప్రభావానికి గురైన మండలంలోని టేకుబాక గ్రామంలో బాధిత కుటుంబాలకు అవసరమైన నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె. దినేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్‌కుమార్, ఐటీడీఏ చింతూరు ప్రాజెక్టు అధికారి శుభం నోక్వాల్, చింతూరు ఏఎస్ పి, బి. హేమంత్ పాల్గొన్నారు. వరద సహాయార్థం ఆయిల్, ఉల్లిపాయలు, బంగాళదుంపలు, కందిపప్పు, బియ్యం తదితర సరుకులను గ్రామస్థులకు అందజేశారు. బాధిత కుటుంబాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సహాయక చర్యలు నిరంతరం కొనసాగుతాయని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో సమన్వయ శాఖల జిల్లా అధికారులు, తహశీల్దార్లు, ఏం పి డి వో లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## పారా లీగల్ వాలంటీర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం న్యాయాధికారి సేవా సంస్థ పరిధిలో పారా లీగల్ వాలంటీర్లుగా పనిచేసేందుకు ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ వి.వెంకటేశ్వరరావు సూచించారు. రాష్ట్ర న్యాయధికారి సంస్థ ఆదేశాల మేరకు ఈ పోస్టులను భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. హిందూపురం మండలంలో స్థిర నివాసం కలిగి పదవ తరగతి లేదా అందుకు సమాన విద్యార్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈనెల 12వ తేదీలోపు ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మౌఖిక పరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని న్యాయమూర్తి తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు ఏడాది పాటు ఈ పోస్టులో కొనసాగుతారని చెప్పారు.

## తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

### -సిడిపిఓ సుధా వరలక్ష్మి

ప్రజాభూమి, హిందూపురం టౌన్

తల్లి పాలే బిడ్డ ఎదుగుదలకు సంపూర్ణ ఆరోగ్యమని, పుట్టిన బిడ్డకు తప్పక ముర్రుపాలు తాగించాలని ఐసిడిఎస్ సిడిపిఓ సుధా వరలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోనే 13 వ వార్డు ఎస్.సడ్లపల్లి అంగన్వాడి కేంద్రాలలో ప్రపంచ తల్లిపాల వారోత్స వాలు సూపర్వైజర్లు తో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపివో మాట్లాడుతూ, తల్లి పాలు ప్రకృతి ప్రసాదించిన అమూల్యమైన వరమన్నారు.



నవజాత శిశువుకు, శిశువుకు తల్లి పాలు అత్యుత్తమమైన, సంపూర్ణమైన ఆహారం అన్నారు. పుట్టిన వెంటనే వచ్చే పసుపు రంగు పాలను కొలస్ట్రం అంటారన్నారు. దీనిని మొదటి టీకా అని కూడా పిలుస్తారన్నారు. ఇందులో వ్యాధులను ఎదుర్కొనే రోగనిరోధక శక్తి అధికంగా ఉంటుందన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల ప్రకారం శిశువు పుట్టిన మొదటి గంటలోనే తల్లి పాలు పట్టించాలన్నారు. మొదటి ఆరు నెలల వరకు తల్లి పాలు మాత్రమే ఇవ్వాలన్నారు. ఈ కాలంలో నీరు, తేనె, గ్లూకోజ్ లేదా ఇతర ఆహార పదార్థాలు ఇవ్వకూడదన్నారు. ఆరు నెలల తర్వాత ఇంట్లో వండిన పౌష్టికాహారంతో పాటు రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లి పాలను కొనసాగించడం మంచిదన్నారు. తల్లి పాలు శిశువు శారీరక, మానసిక ఎదుగుదలకు ఎంతో అవసరమన్నారు. వీటి వల్ల సులభంగా జీర్ణమవుతాయని, విరేచనాలు, న్యుమోనియా వంటి వ్యాధుల నుండి రక్షణ కల్పిస్తాయన్నారు. శిశువు ఎదుగుదలకు కావాల్సిన అన్ని పోషకాలు సరైన మోతాదులో తల్లి పాలలో లభిస్తాయన్నారు. తల్లి పాలివ్వడం వల్ల తల్లికి కూడా అనేక ప్రయోజనాలు ఉన్నాయని, ప్రసవం తర్వాత గర్భాశయం త్వరగా సాధారణ స్థితికి చేరుతుందన్నారు. రక్తస్రావం తగ్గుతుందని, అలాగే రొమ్ము క్యాన్సర్, అండాశయ క్యాన్సర్ వచ్చే ప్రమాదం తగ్గుతుందన్నారు. తల్లి, శిశువు మధ్య ప్రేమ, అనుబంధం మరింత బలపడుతుందన్నారు. ప్రతి తల్లి తన బిడ్డకు తప్పనిసరిగా తల్లి పాలను అందించాలన్నారు. కుటుంబ సభ్యులు కూడా తల్లికి అవసరమైన విశ్రాంతి, పౌష్టికాహారం అందించి ఆమెను ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు శాంతి, అనిత, పద్మ,అంగన్వాడి కార్యకర్తలు లక్ష్మీదేవి, శైలజ, లక్ష్మీదేవి, కాసింబీ, అరుణ, మంజుల, ఆశా కార్యకర్త శాంతమ్మ, గర్భవతులు, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి ఉత్తీర్ణులకు అవకాశం

**-పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి 5న స్పాట్ అడ్మిషన్లు**

**-ఈసీఈ, సివిల్ ఇంజనీరింగ్ విభాగాల్లో ఖాళీ సీట్ల భర్తీ**

**-ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి నాయుడు**

ప్రజాభూమి, హిందూపురం టౌన్




స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో పాలీసెట్ కౌన్సిలింగ్ అనంతరం మిగిలిన ఖాళీ సీట్ల భర్తీకి ఈ నెల 5వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి నాయుడు తెలిపారు. ఈసీఈ, సివిల్ ఇంజనీరింగ్ విభాగాల్లో ఉన్న ఖాళీ సీట్లకు ఉదయం 10 గంటలనుంచి కళాశాల ప్రాంగణంలో ప్రవేశాల ప్రక్రియ చేపడతామని పేర్కొన్నారు. సోమవారం ఈ విషయంపై ఆయన సమగ్రంగా వివరించారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థినులు స్పాట్ అడ్మిషన్లకు అర్హులని, పాలీసెట్ ప్రవేశ పరీక్ష రాయకపోయిన వారు కూడా ఇందులో పాల్గొనవచ్చని తెలిపారు. అయితే పాలీసెట్ కౌన్సిలింగ్ ద్వారా ఇప్పటికే సీటు పొంది, ఏదైనా కోర్సులో ప్రవేశం పొందిన అభ్యర్థులు స్పాట్ అడ్మిషన్లకు అర్హులు కాదని స్పష్టం చేశారు. స్పాట్ అడ్మిషన్లకు హాజరయ్యే విద్యార్థినులు పదో తరగతి మార్కుల మెమో, ట్రాన్స్ఫర్ సర్టిఫికెట్ (టీసీ), 4వ తరగతినుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు ఒరిజినల్తో పాటు మూడు సెట్ల జిరాక్స్ ప్రతులు, ఆరు పాస్పోర్ట్ సైజు ఫొటోలు తీసుకురావాలని సూచించారు. స్పాట్ అడ్మిషన్ పొందే అభ్యర్థులు సుమారు రూ.6,500 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. స్పాట్ అడ్మిషన్ల ద్వారా ప్రవేశం పొందిన విద్యార్థినులకు ఫీజు రీయింబర్స్మెంట్ వర్తించదని ఇంచార్జ్ ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి నాయుడు వెల్లడించారు.

## సామాన్య ప్రజలకు నాణ్యమైన బియ్యం

### -రేషన్ కార్డుకు రాయితీతో నెలకు 10 కేజీల బియ్యం

### -ప్రత్యేక కౌంటర్ ప్రారంభంలో ఎమ్మెల్యే పిఏ వీరయ్య

ప్రజాభూమి, హిందూపురం టౌన్



పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరల నేపథ్యంలో సామాన్య ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని అందుబాటు ధరలకు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రాయితీ బియ్యం విక్రయాల కార్యక్రమానికి హిందూపురంలో శ్రీకారం చుట్టారు. మునిసిపల్ కాంప్లెక్స్లోని రూమ్ నంబర్--14లో ఏర్పాటు చేసిన ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వ్యక్తిగత సహాయకులు వీరయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతి రేషన్ కార్డుదారుడికి నెలకు 10 కిలోల నాణ్యమైన బియ్యాన్ని రాయితీ ధరకు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతతూ, సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై పెరుగుతున్న ధరల భారాన్ని తగ్గించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. నాణ్యమైన బియ్యాన్ని అందుబాటు ధరలకు అందించడం ద్వారా ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఇలాంటి కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం బీపీటీ సూపర్ ఫైన్ బియ్యం కిలో రూ.52, గ్రేడ్--1 ముడి (పచ్చి) బియ్యం కిలో .రూ.50కు విక్రయిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రతి రేషన్ కార్డుదారుడికి నెలకు 10 కిలోల వరకు ఈ బియ్యాన్ని అందజేస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా రైతు బజార్లు, ప్రత్యేక విక్రయ కేంద్రాలు, రైస్ మిల్లర్లు ఏర్పాటు చేసిన కౌంటర్ల ద్వారా ఈ బియ్యం అందుబాటులో ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వెంకటేష్, రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులు బాబురెడ్డి, డిప్యూటీ తహసీల్దార్, పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, రేషన్ డీలర్లు, వినియోగదారులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా టెట్ పరీక్షలు నిర్వహించాలి జిల్లా జాయింట్ కలెక్టర్ సి విష్ణు చరణ్

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

జిల్లా వ్యాప్తంగా ఈనెల 5 నుండి 16 వరకు జరిగే ఎ పి టెట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించే విధంగా ఆయాశాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సి విష్ణు చరణ్ ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని రెవెన్యూ సమావేశ భవన్ లో ఆంధ్రప్రదేశ్ టెట్ పరీక్షల నిర్వహణపై ఇంచార్జ్ డిఇఓ శ్రీనివాసరావు తో కలిసి సంబంధితశాఖ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి పలు సూచనలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 18191 మంది దాకా అభ్యర్థులు,128 స్క్రైబ్స్ ఈ టెట్ పరీక్షలకు హాజరవుతున్నారని మొదటి షిఫ్ట్ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు అలాగే రెండవ షిఫ్ట్ మధ్యాహ్నం 2.30 గంటల నుండి 5 గంటల సమయం వరకు టెట్ కంప్యూటర్ బేస్డ్ విధానంలో టెస్ట్ పరీక్షలు 11 రోజులపాటు ఉంటాయని పేర్కొన్నారు. పరీక్షల్లో పాల్గొనే అభ్యర్థులు ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని తెలిపారు. మరి ముఖ్యంగా నిర్దేశించిన సమయంలోగా అభ్యర్థులు తప్పనిసరిగా తమ హాల్ టికెట్లను వెంట తీసుకొని పరీక్ష కేంద్రాలకు హాజరుకావాల్సిందిగా సూచించారు. ఆర్టీసీ సంస్థ వారి ద్వారా అవసరమైన మేరకు ఆయా ప్రాంతాలకు సంబంధించి బస్సుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇందులో 6 మంది డిపార్ట్మెంట్ ఆఫీసర్లను, ఫ్లయింగ్ స్క్వాడ్ ను నియమించినట్లు తెలిపారు. జిల్లాలోని ఆరు కేంద్రాలు బుక్కరాయసముద్రం మండలం రోటరీపురం వద్దనున్న శ్రీనివాస రామానుజన్ కళాశాల, గుత్తి గేట్స్, అనంతపురం పి వి కే కే రుద్రంపేట, తాడిపత్రి సి.వి రామన్, నేషనల్ కౌన్సిల్ చర్చ్ సోషల్ యాక్షన్ ప్రసన్నాయపల్లి, ఎస్ కే యు వద్ద ఉన్న అనంతలక్ష్మి కళాశాలలో కంప్యూటర్ ఆధారిత పరీక్షలు జరుగుతాయన్నారు.



ముఖ్యంగా పరీక్ష సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా త్రాగునీటి వసతి వైద్య శిబిరం పారిశుధ్య పనులను చేపట్టాలని ఆదేశించారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే వైద్య ఆరోగ్య పర సిబ్బంది ఏర్పాటు, వికలాంగ అభ్యర్థులకు తగిన సౌకర్యాలు ఏర్పాటు, తదితర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఏపీస్సీ అడ్మిన్ నాగభూషణం, డి ఆర్ ఓ మాలోల, ఇంచార్జ్ శ్రీనివాసరావు , ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ ఇ శేషాద్రి, డిఐపిఆర్ఓ బాలకొండయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా వెంకటేశ్వర్లు డిపిఓ నాగరాజు నాయుడు పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్సీ అక్రమాలపై అనంతపురంలో రౌండ్ టేబుల్ సమావేశం

- **ఈనెల 6 నుంచి 9 వరకు రిలేదీక్షలు • 10వ తేదీన నియోజకవర్గాల్లో ర్యాలీలు**
- **డీఎస్సీ అక్రమాలకు బాధ్యతవహిస్తూ లోకేష్ రాజీనామా చేయాలి**
- **టీచర్ పోస్టుల భర్తీపై తక్షణం సీబీఐ విచారణ చేయించాలి**
- **వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి డిమాండ్**

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం



డీఎస్సీ-2025 నియామకాల్లో జరిగిన అక్రమాలకు బాధ్యతవహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని వైఎస్ఆర్సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం వైసీపీ జిల్లా కార్యాలయంలో అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో జడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, వైయస్సార్సీపి రాష్ట్ర పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షులు వెన్నపూస రవీంద్రారెడ్డి, మైనార్టీ నాయకులు నదీమ్ అహ్మద్, మాజీ మేయర్ సలీం వాసిం, మాజీ డిప్యూటీ మేయర్లు వాసంతి, కోగటం భాస్కర్ రెడ్డి, విద్యార్థి నాయకుడు చంద్రశేఖర్ యాదవ్, ఆల్మూరు శ్రీనివాసరెడ్డి, ఖాజా మొయిద్దీన్, మీసాల రంగన్న తదితరులు పాల్గొన్నారు. డీఎస్సీ నియామకాల్లో అక్రమాలపై అనంతపురం అర్బన్ నియోజకవర్గ స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వైసీపీ నాయకులు, విశ్రాంత ఉపాధ్యాయులు, కుల సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు నాయకత్వం తెలుగుదేశం, జనసేన, బీజేపీలు జతకట్టి ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ తో పాటు అనేక హామీలను గుప్పించారని గుర్తు చేశారు. యువతకు ఏటా జాబ్ క్యాలెండర్ ద్వారా ఉద్యోగాలు భర్తీ చేస్తూ ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామంటూ హామీ ఇచ్చారని తెలిపారు. లేని పక్షంలో ప్రతి నెలా రూ.3 వేలు నిరుద్యోగభృతి ఇస్తామన్నారని గుర్తు చేశారు. కూటమి అధికారం లోకి వచ్చిన తర్వాత మెగా డీఎస్సీ పేరుతో పరీక్షలు నిర్వహించి, ఉద్యోగ నియామకాల్లో అవకతవకలకు పాల్పడి అనర్హులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారని విమర్శించారు. తమకు కావాల్సి వారి కోసమే జీవోలను సృష్టించి ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. తక్షణం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే రాజీనామా చేయాలని, ఆయన రాజీనామా చేయని పక్షంలో మంత్రివర్గం నుండి వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా డీఎస్సీ అవకతవకలపై సీబీఐ విచారణ చేపట్టాలన్నారు. ఎన్నికల సమయంలో యువతకు చెప్పిన హామీ మేరకు నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగభృతి ఇవ్వాలన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. కూటమి ప్రభుత్వం విద్యార్థులు, యువతకు చేస్తున్న అన్యాయాలను ఖండిస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 6,7,8,9 వ తేదీల్లో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో రిలే నిరాహారదీక్షలతో పాటు ఈ నెల 10వ తేదీన ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు, యువతకు, నిరుద్యోగులకు మద్దతుగా వైయస్సార్ సీపీ చేపట్టబోతున్న రిలే నిరాహారదీక్షలు, నిరసన ర్యాలీకి పార్టీ శ్రేణులతో పాటు మేధావులు, విద్యావంతులతో పాటు పెద్ద ఎత్తున యువతీయువకులు, విద్యార్థులు, రాజకీయాలకు అతీతంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## గ్రీవెన్స్ డే ను ఈ ప్రభుత్వమే అగౌర పరుచుకుంది టిడిపి పాపాలు పరాకాష్టకు! -ఉరవకొండలో పోలీసు రాజ్యం!

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

రెండు సంవత్సరముల కాలంలోనే టిడిపి పాపాలు పరాకాష్టకు చేరుకున్నాయి. కెవి రమణ, రాయలసీమ జోనల్ అధికార ప్రతినిధి, వైఎస్ఆర్సిపి, అనంతపురం ఉరవకొండ మాజీ శాసనసభ్యులు వై విశ్వేశ్వర్ రెడ్డి, వైసీపీ నాయకులు రమేష్ గౌడ్, మీసాల రంగన్న, వక్తలు మాట్లాడుతూ ఉరవకొండ నియోజకవర్గం లో విచ్చల విడిగా మంత్రి పయ్యావుల కేశవ్ కనుసన్నల్లో నడుస్తున్న పేకాటక క్లబ్బులు, బెల్ట్ షాపులు, భూ ఆక్రమణలకు వ్యతిరేకంగా వైసిపి శాంతియుతంగా ధర్నా చేయడానికి ప్రయత్నిస్తే, పోలీసులను అడ్డు పెట్టుకొని పోటీ ధర్నాలకు పాల్పడితే ప్రజాస్వామ్యాన్ని గౌరవించేవారుగా వాయిదా వేసుకున్న తర్వాత కూడా ధర్నాకు అనుమతి ఇవ్వకపోవడంతో, సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా ఎమ్మార్వోకి అర్జీ ఇవ్వడానికి వస్తున్న వైసిపి కార్యకర్తలను ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. అయినా వందలాదిగా తరలివచ్చిన కార్యకర్తలతో వై విశ్వేశ్వర్ రెడ్డి ఎమ్మార్వో ఆఫీస్ కు బయలుదేరితే పోలీసులు అడ్డుకొని అరెస్టు చేసి, ఈ ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ డే ను ఈ ప్రభుత్వమే అగౌర పరుచుకుంది. తద్విరుద్ధంగా రోడ్డులోనే బైటాయించి, టిడిపి దుండగులను శిక్షించాలని గుంతకల్లు డిఎస్పి కి మెమొరాండం ఇవ్వడం జరిగింది. సందర్భంగా రోడ్డులో బైటాయించిన వారిని ఉద్దేశించి మాట్లాడుతూ నిర్బంధం ఎక్కడుంటుందో తిరుగుబాటు అక్కడ ఉంటుంది అని చెప్పడానికి ఈరోజు వైసీపీ కార్యకర్తలు పోలీసుల నిర్బంధాన్ని చేదించి, నియోజకవర్గ వ్యాప్తంగా ఎవరికి వారుగా స్వచ్ఛందంగా అడ్డదారులలో పోలీసులను తప్పించుకొని వందలాదిగా తరలివచ్చి వైసిపి ఆఫీసు వద్ద ఉన్న జననేత మాజీ ఎమ్మెల్యే వై విశ్వేశ్వర్ రెడ్డిని కలుసుకున్న వారిని అక్రమంగా నిర్బంధించి ఆఫీసు వద్దే అరెస్టు చేయడం అన్యాయం అప్రజాస్వామికం. మొన్న శ్రీకాకుళం జిల్లా పలాస నియోజకవర్గంలో అనుకోకుండా కొడుకు ఆరవ్ యాక్సిడెంట్ చేస్తే, అతని తండ్రి,మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు పై హత్యాయత్నం కేసు పెట్టి జైలుకు పంపడడం, నిన్న కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గం పరిధిలో గల ఒక గ్రామంలో వైసీపీ కార్యకర్త నేను ఆపదలో ఉన్నాను, నన్ను రక్షించు అని ఫోన్ చేస్తే అతనిని కాపాడడానికి వెళ్ళిన ఆలూరు ఎమ్మెల్యే పై దాడికి పూనుకొని,తన తమ్ముని చేయి విరగ్గొట్టి, ఎమ్మెల్యే పైనే కేసు పెట్టడంలో భాగంగా అప్పటికే ముందస్తు పథకంతో ఉన్న పోలీసులు టిడిపి కార్యకర్త నాగరాజుతో తన భార్య నైటీ చింపేటట్టుగా చేశారు. (ఈ దృశ్యాలు సిసి కెమెరాలలో స్పష్టంగా కనపడతాయి) ఎమ్మెల్యే నైటీ చింపేసినారని, అత్యాచార యత్నం హత్యాయత్నం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టి, ఉగ్రవాదిని అరెస్టు చేసినట్టు అర్ధరాత్రి ఇంటికి వెళ్లి తలుపులు పగలగొట్టి అరెస్టు చేసి జైలుకు పంపడం బట్టి చంద్రబాబు ప్రభుత్వం పాపాలు పరాకాష్టకు చేరుకున్నాయని తెలుస్తుంది. మహాభారతంలో శ్రీకృష్ణుడు కూడా శిశుపాలుడి తప్పులు నూరు వరకు చూశాడు, ఆ తర్వాత ఏమైందో చంద్రబాబు మహాభారతం



చదువుకోవాలి. ఇంత నిర్బంధంలో కూడా మొక్కవోని దీక్షతో అదరక, బెదరక వైసిపి కార్యకర్తలు చేస్తున్న పోరాటానికి సెల్యూట్ చేయక తప్పదు. ఉరవకొండలో తెలుగుదేశం పార్టీ మంత్రి పయ్యావుల కేశవ్ వైసిపి జెండాను చూసి నిద్రలో కూడా బెదురుకుంటున్నాడని చెప్పడానికి సోమవారం జరిగిన ఘటనలే ప్రత్యక్ష సాక్ష్యాలు. నేరస్తునికి రక్షణగా, మంచివారి పట్ల కఠినంగా వ్యవహరిస్తున్న ఈ ప్రభుత్వం తీరు ప్రజాస్వామ్యానికి హానికరం. ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో పరిస్థితులు ఎవరి చేతులలో ఉండవు. చేతులు దాటి పోయినాక ఆకులు పట్టుకుంటే ఫలితం లేదు. కాక్రోచ్ ల ఢిల్లీ పోరాటం చూసి మేలుకోవాలి. ప్రభుత్వాలు శాశ్వతం కాదు, వ్యవస్థలు స్వతంత్రంగా పనిచేయాలి, లేకుంటే రేపు అవి మీకు శాపాలుగా మారుతాయన్న విషయాన్ని అధికారులు గమనించాలి. అయ్యా పయ్యావుల కేశవ్, అప్పులు చేసి పేదవాడు కొన్న భూమిని ఆక్రమించుకోవాలనుకోవడం అన్యాయం కాదా? ఇది నీ భూస్వామ్య, పెత్తందారీ అహంకారం కాదా? అది దేవాలయ భూమి కాదని కలెక్టర్ ఎండార్స్మెంట్ ఇవ్వలేదా? కోర్టు ఇంజక్షన్ ఇచ్చి పంట కూడా తానే ఒడుపుకున్న మాట వాస్తవం కాదా? అయినా పొలంలోకి పోనివ్వకుండా మీ అనుచర తెలుగుదేశం గూండాలు అడ్డుకుంటుంటే వారికే ఉరవకొండ పోలీస్ను రక్షణ కవచంగా ఏర్పాటు చేయడం ఎంతవరకు సబబు? అన్ని రోజులు మీవి కావు, రేపంటూ ఒకటి ఉంటుంది ఆనాడు మీరు న్యాయ స్థానాలలో సమాధానం చెప్పుకోవాలి. కావున ఎవరి ధర్మాన్ని వారు పాటించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, లేకుంటే ఈ పోరాటాలు మరింత ఉధృతం అవుతాయని హెచ్చరిస్తున్నాము. ఈ కార్యక్రమంలో సిపి వీరన్న, అశోక్ రాకెట్ల, నరసింహులు ఎంపీపీ, దేవి ఎంపీపీ, మచ్చన్న వైసీపీ ప్రెసిడెంట్ బెలుగుప్ప, రమేష్ వైసీపీ ప్రెసిడెంట్ విడపనకల్, సుశీలమ్మ మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్, చంద్రమ్మ మాజీ ఎంపీపీ, బసవరాజ్ పంచాయతీరాజ్ విభాగం, ఈడిగ ప్రసాద్ ఎంపీటీసీ, నరేష్ వైఎస్ఆర్టియుసి కురుబ గోవిందు, జల్లిపల్లి దేవేంద్ర బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాదిపై దాడిని ఖండిస్తూ బీఎస్పీ ఆందోళన

### -వన్టౌన్ సీఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

ప్రజాభూమి, హిందూపురం టౌన్

హైకోర్టు న్యాయవాది, బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు శివరామకృష్ణపై హిందూపురం ప్రభుత్వాసుపత్రిలో జరిగినట్లు ఆరోపిస్తున్న ఘటనను ఖండిస్తూ బహుజన్ సమాజ్ పార్టీ బీఎస్పీ ఆధ్వర్యంలో సోమవారం హిందూపురం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ హారతికి వినతిపత్రం అందజేసి, సంబంధిత అధికారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ రాష్ట్ర



కార్యదర్శి శ్రీరాములు మాట్లాడుతూ, బహుజనుల సమస్యలపై పోరాడుతున్న హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణతో హిందూపురం వన్టౌన్ సీఐ రాజగోపాల్ నాయుడు దురుసుగా ప్రవర్తించి, దాడి చేసినట్లు ఆరోపించారు. అవమానకరమైన పదజాలం ఉపయోగించడం ద్వారా దళితుల మనోభావాలు దెబ్బతిన్నాయని పేర్కొంటూ, సంబంధిత అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ, రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు, స్వేచ్ఛ కల్పించిందని, దళిత, బహుజనుల కోసం పనిచేసే న్యాయవాదిపై బూటుకాలితో దాడి చేశారన్న ఆరోపణలు అత్యంత ఆందోళనకరమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. వైఎస్సార్సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అమానుల్లా మాట్లాడుతూ, బహుజన సమస్యలపై పనిచేస్తున్న వ్యక్తిపై దౌర్జన్యంగా వ్యవహరించిన అధికారిపై శాఖాపరమైన చర్యలతో పాటు విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఆర్ఎస్పీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు, కెవీపీఎస్ నాయకులు రమణ, జై భీమ్ రావు భారత్ పార్టీ నాయకుడు నాగరాజు, ఎంఎస్ఎఫ్ నాయకుడు రవికుమార్, న్యాయవాది, బీఎస్పీ సీనియర్ నాయకులు లక్ష్మీనారాయణ తదితరులు మాట్లాడుతూ, న్యాయవాది పట్ల వ్యవహరించిన తీరు తీవ్రంగా ఖండనీయమన్నారు. సంబంధిత సీఐని వెంటనే సస్పెండ్ చేసి, ఎస్సీ, ఎస్టీ (అత్యాచార నిరోధక) చట్టం కింద కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు కే. రామాంజనేయులు, కొట్నూరు గంగప్ప, ఎస్.ఆర్.పల్లి శ్రీనివాసులు, బాలంపల్లి నర్సింహులు, సిరివరం మూర్తి, న్యాయవాది నాగప్ప, నవీన్ కుమార్, నారాయణప్ప, బాలకృష్ణ, మోతుకపల్లి నారాయణప్ప, తుంగేపల్లి రామాంజి, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## బాలయేసు కళాశాలకు అరుదైన గౌరవం

### -యువ వికసిత్ భారత్ కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ పీఓ

ప్రజాభూమి, హిందూపురం టౌన్

దేశ ప్రధాని నరేంద్ర మోడీతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొనే అరుదైన అవకాశం హిందూపురం బాలయేసు డిగ్రీ కళాశాలకు దక్కింది. భారత యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ మార్గదర్శకత్వంలో, ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమాల్లో భాగంగా శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన జెన్ జెడ్ ఎగైనెస్ట్ అడిక్షన్ -- నషా ముక్త యువ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ఎంపికైన 125 కళాశాలలు, విద్యాసంస్థలతో పాటు హిందూపురం బాలయేసు డిగ్రీ కళాశాల కూడా ఎంపికైంది. ప్రధానితో జరిగిన వీడియో కాన్ఫరెన్స్లో బాలయేసు డిగ్రీ కళాశాల తరఫున ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి అశ్వర్థ నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశ ప్రధాని నరేంద్ర మోడీ యువతను ఉద్దేశించి మాట్లాడుతూ, మాదక ద్రవ్యాల దుర్వినియోగం దేశ భవిష్యత్తుకు పెను ముప్పుగా మారుతోందని, యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ సమాజంలో అవగాహన కల్పించడంలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యవంతమైన, మాదకద్రవ్య



రహిత జీవనశైలిని అలవర్చుకోవడం ద్వారానే వికసిత్ భారత్ లక్ష్యం సాకారమవుతుందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో తమ కళాశాలకు ప్రాతినిధ్యం వహించే అవకాశం దక్కడం గర్వకారణమని బాలయేసు విద్యాసంస్థల అధ్యక్షుడు ఎం. బలరామిరెడ్డి, కరస్పాండెంట్ ప్రతాప్ రెడ్డి, పరిపాలనాధికారి శౌరి రెడ్డి, ప్రిన్సిపాల్ జియావుల్లా ఖాన్ తెలిపారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ ముందుంటుందని, మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహి స్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి అశ్వర్థ నారాయణను అభినందించారు.

# 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా అర్హుల ఖాతాల్లో రూ.25 వేల జమకు ప్రభుత్వం సిద్ధం

- ఆగస్టు 5లోపు అవసరమైన ధ్రువపత్రాలతో సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి
- అర్హులైన ప్రతి నేతన్నకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందనే విశ్వాసం
- రాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘం యువజన విభాగం కార్యదర్శి అవ్వారు రవిశంకర్

ప్రజాభూమి, సిద్ధవటం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'నేతన్నకు భరోసా' పథకంపై చేనేత కార్మికులు ఎలాంటి అపోహలకు లోనుకావద్దని, నిజమైన అర్హులైన చేనేత కార్మికు లందరికీ ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందని రాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘం యువజన విభాగం కార్యదర్శి అవ్వారు రవిశంకర్ అన్నారు. సోమవారం మాధవరం-1 గ్రామంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అర్హులైన ప్రతి చేనేత కుటుంబానికి రూ.25 వేల ఆర్థిక సాయం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా అర్హులైన చేనేత కార్మికుల బ్యాంకు ఖాతాల్లో రూ.25 వేల ఆర్థిక సహాయం జమ చేయనున్న నేపథ్యంలో, చేనేత ఔ జౌళి శాఖ మంత్రి సవితమ్మ సూచనల మేరకు అర్హులైన నేతన్నలు ఆగస్టు 5 సాయంత్రంలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు సమయంలో ఆధార్ కార్డు, రేషన్ కార్డు, చేనేత గుర్తింపు కార్డు, ఆధార్‌తో అనుసంధానమైన బ్యాంకు ఖాతా వివరాలతో సంబంధిత గ్రామ



లేదా వార్డు సచివాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు. అద్దె ఇళ్లలో నివసించడం, విద్యుత్ మీటర్లు కుటుంబ సభ్యులు లేదా ఇతరుల పేర్లపై ఉండడం వంటి సాంకేతిక కారణాలతో నిజమైన చేనేత కార్మికులు పథకానికి దూరం కాకుండా ప్రభుత్వం తగిన మార్గదర్శకాలు జారీ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. క్షేత్రస్థాయిలో చేనేత ఔ జౌళి శాఖ అధికారులు సమగ్రంగా పరిశీలించి, వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న నిజమైన చేనేత కార్మికులకే నేరుగా ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం పూర్తి పారదర్శకంగా వ్యవహరించి అర్హులైన ప్రతి నేతన్నకు 'నేతన్నకు భరోసా' పథకం లబ్ధి చేకూరుస్తుందనే విశ్వాసం వ్యక్తం చేసిన రవిశంకర్, చేనేత కార్మికులందరూ ఆలస్యం చేయకుండా అవసరమైన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకుని ఈ సంక్షేమ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

### - జడ్పీ హైస్కూల్‌లో పోలీసుల అవగాహన కార్యక్రమం
### - కళా జాగృతి బృందం నాటికతో విద్యార్థులకు సందేశం




ప్రజాభూమి, సిద్ధవటం: జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు సిద్ధవటం జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం మత్తు పదార్థాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల ఎస్ఐ హారిక ఆధ్వర్యంలో పోలీస్ కళా జాగృతి బృందం 'యువత మేలుకో' నాటికను ప్రదర్శించి విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా ఏఎస్ఐ సుబ్బరామచంద్ర మాట్లాడుతూ యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండి తమ భవిష్యత్తును కాపాడుకోవాలని సూచించారు. మత్తు పదార్థాల వినియోగం, విక్రయానికి సంబంధించిన చట్టపరమైన శిక్షలను వివరించి, వాటి ఆచూకీ తెలిసిన వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1972కు సమాచారం అందించాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత మాట్లాడుతూ మత్తు పదార్థాల వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక దుష్పరిణామాలను వివరించి, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేలా విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. ఈగల్ టీం సభ్యుడు గురుశేఖర్ ఆధ్వర్యంలో విద్యార్థులు "డ్రగ్స్ వద్దు -- జీవితం ముద్దు", "మత్తుకు దూరంగా ఉండి భవిష్యత్తును కాపాడుకుందాం" అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్థానిక పోలీసులు, కళా జాగృతి బృందం సభ్యులు సుశీల, ఉదయ్, శ్రీరామ్, మధు, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రామ్మోహన్ ను సన్మానించిన డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి



ప్రజాభూమి పోరుమామిళ్ల : పోరుమామిళ్ల పట్టణంలోని రచయిత బొల్లు రామ్మోహన్ కు న్యూఢిల్లీలో ఇటీవల జాతీయ విశేష ప్రతిభ వాగ్దేవి పురస్కారాన్ని అందుకున్న శుభ సందర్భంలో వైసిపి డాక్టర్స్ విభాగపు కార్యదర్శి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, పట్టణంలోని పుర ప్రముఖులు రామ్మోహన్ ను శాలువా తో సత్కరించి, డాక్టర్ కళ్యాణ్ మాట్లాడుతూ పోరుమామిళ్ల వాసి కి జాతీయస్థాయిలో గుర్తింపు రావడం పోరుమామిళ్లకే గర్వకారణం అని అన్నారు. దేశ రాజధానిలో తెలుగు గలం విప్పి భాష అనేది కేవలం మాట్లాడే సాధనం కాదు భాష మన జాతి జీవన నాడి అని, సినారే నేటి తెలుగు రచయితలు ఆయన స్ఫూర్తితో సమాజ చైతన్యానికి కృషి చేయాలని, ఎన్నో ఆధ్యాత్మిక కెరియర్ గైడెన్స్ వ్యాసాలు రాసి జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చిన రచయితయని, విద్యారంగంలో విశేష సేవలు, విద్యార్థుల అభ్యున్నతికి సమాజ శ్రేయస్సుకు మరింత దోహదపడాలని కోరారు. రాబోయే రోజుల్లో మరెన్నో అవార్డులు అందుకోవాలని, పోరుమామిళ్ల ప్రాంతానికి వన్నె తీసుకురావాలని కోరారు ఈ కార్యక్రమంలో ఆరు సుబ్రమణ్యం సురే ప్రసాద్, గురు స్వామి, తదితరులు పాల్గొన్నారు.

## పబ్బతి రాధాకృష్ణమూర్తి ద్వితీయ వర్ధంతి - దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ

### వాసవిమాత త్యాగనిరతే స్ఫూర్తి - వాసవి క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం



ప్రజాభూమి,పులివెందుల

పట్టణంలోని పబ్బతి జువెలర్స్ అధినేత పబ్బతి దక్షిణామూర్తి తండ్రి, స్వర్గీయ పబ్బతి రాధాకృష్ణమూర్తి ద్వితీయ వర్ధంతి సందర్భంగా దివ్యాంగులకు నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.



వాసవి క్లబ్ పులివెందుల శాఖ ఆధ్వర్యంలో ముద్దనూరు రోడ్డులోని వికలాంగుల కమ్యూనిటీ భవనంలో సంస్మరణ కార్యక్రమం జరిగింది. విశిష్ట అతిథులు రాధాకృష్ణమూర్తి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘననివాళులు అర్పించారు. అనంతరం ఆయన ఆత్మశాంతి కోసం రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ సరస్వతి పథకం చైర్మన్ మేడం దినేష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ, అంగవైకల్యం శారీరకమేనని, మానసికంగా దృఢంగా ఉంటే ఏ ఆటుపోట్లనైనా ఎదుర్కొని ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని అన్నారు. అంధుల క్రికెట్ ప్రపంచ కప్ విజేతలు, ప్యారా అథ్లెట్లు దివ్యాంగులకు స్ఫూర్తి అని, అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారని పేర్కొన్నారు. వాసవీమాత త్యాగనిరతిని ఆదర్శంగా తీసుకుని భవిష్యత్తులో ఉచిత వైద్యశిబిరాలు, ఉపాధి కల్పన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. వక్తలు మాట్లాడుతూ రాధాకృష్ణమూర్తి మరణానంతరం నేత్రదానం చేసి అంధులకు చూపునిచ్చి చిరంజీవిగా నిలిచిపోయారని కొనియాడారు. ఈ సందర్భంగా దక్షిణామూర్తి తన తండ్రి స్మారకార్థం 30 మంది దివ్యాంగుల కుటుంబాలకు నిత్యావసర సరుకులను అందించారు. అనంతరం దివ్యాంగులు, వాసవి క్లబ్ సభ్యులు దక్షిణామూర్తిని దుశ్శాలువాతో సత్కరించి, వికలాంగులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షులు డా. ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, వాసవి క్లబ్ అధ్యక్షులు మాలేపాటి హరిబాబు, జోనల్ చైర్మన్ రొట్టెల వినోద్ కుమార్, పబ్బతి దక్షిణామూర్తి, టైలరింగ్ టీచర్ మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలే బిడ్డకు శ్రేష్ఠమైన ఆహారం- సీడీపీవో వి. సునీత



ప్రజాభూమి, వేంపల్లె

బిడ్డకు తల్లిపాలే శ్రేష్ఠమైన ఆహారమని, అవే శిశువుకు తొలి రోగనిరోధక శక్తిని అందిస్తాయని ఐసీడీఎస్ వేంపల్లె ప్రాజెక్టు సీడీపీవో వి. సునీత అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సోమవారం అలవలపాడు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల విశిష్టతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆగస్టు 1 నుంచి 8వ తేదీ వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పుట్టిన గంటలోపే శిశువుకు తల్లిపాలు పట్టించాలని, తొలి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, నీరు కూడా అవసరం లేదని సూచించారు. తల్లిపాలు శిశువు ఎదుగుదలకు అవసరమైన పోషకాలను అందించడంతో పాటు వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయని తెలిపారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల శిశువుతో పాటు తల్లికి కూడా ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రమణమ్మ, ఐసీడీఎస్ సూపర్వైజర్ సుభద్ర, అంగన్వాడీ కార్యకర్తలు త్రివేణి, నాగేశ్వరి, ఏఎన్ఎం రమాదేవి, ఆశా కార్యకర్త చంద్రకళ, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## టైక్వాండో ఛాంపియన్ గా పోరుమామిళ్ల విద్యార్థులు



ప్రజాభూమి పోరుమామిళ్ల : ఆగస్టు 2వ తేదీ ఆదివారం చిత్త ఫంక్షన్ హాల్ నందు జరిగిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీలలో పోరుమామిళ్ల క్రీడాకారులను సబ్ జూనియర్. క్యాడియట్. జూనియర్స్ మరియు సీనియర్స్



విభాగంలో 25 గోల్డ్ 15 రజతం 10 కాంస్య పతకాలు సాధించిఓవరాల్ ఛాంపియన్ షిప్ సాధించినట్లు మాస్టర్ నాయబ్ రసూల్ తెలిపారు. ఈ టోర్నమెంట్ నందు ముఖ్యఅతిథిగా మదర్ తెరిసా ఫౌండర్ రవి ప్రకాష్ రెడ్డి, వైస్ ఎంపీపీ సి భాషా, జెడ్పిటిసి ముత్యాల ప్రసాద్, ఎంఈఓ షఫీ శ్రీ వెంగమాంబ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఫౌండర్ పుల్లపునాయుడు, మైనారిటీ నాయకులు రాజీవ్ భాష పాల్గొన్నారు. బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు ఈనెల 21. 22 మరియు 23వ తేదీలలో శ్రీకాకుళంలో జరుగు రాష్ట్రస్థాయి టైక్వాండో పోటీలలో పాల్గొంటారు. బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులకు జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రెసిడెంట్ శివ శంకర్ రెడ్డి అభినందించారు ఈ కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు నరసింహ ప్రసాద్. ఆంజనేయులుమరియు ఉస్మాన్ పాల్గొన్నట్లు మాస్టర్ నాయబ్ రసూల్ తెలిపారు. ఓరల్ ఛాంపియన్షిప్ ట్రోఫీ తో పోరుమామిళ్ల క్రీడాకారుడు.

## దేశ ఆర్థిక వ్యవస్థలో బ్యాంకింగ్ రంగమే కీలకం



ప్రజాభూమి,పులివెందుల

దేశ ఆర్థిక వ్యవస్థలో బ్యాంకింగ్ రంగమే కీలక పాత్ర పోషిస్తుందని యూనియన్ బ్యాంక్ మేనేజర్ వెంకట్,ఏపీజీబీ మేనేజర్ సందీప్ కుమార్ రెడ్డి అన్నారు. స్థానిక శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో సోమవారం అంతర్జాతీయ వాణిజ్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఇద్దరు మేనేజర్లు మాట్లాడుతూ, వాణిజ్య వ్యవస్థల ద్వారా ప్రజల ఆర్థిక స్థితిగతులు మారుతాయని, భవిష్యత్తులో వాణిజ్య రంగంపైనే దేశ అభివృద్ధి ఆధారపడి ఉందని పేర్కొన్నారు. కామర్స్ విద్యార్థులు బ్యాంకింగ్ రంగంపై ఆసక్తి చూపి దేశాభివృద్ధికి పాటుపడాలని సూచించారు. బ్యాంకింగ్ రంగంలో మంచి అవకాశాలు, ఉజ్వల భవిష్యత్తు ఉన్నాయని యువతను ప్రోత్సహించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ నారాయణ రెడ్డి, డైరెక్టర్ వెంకట సుబ్బారెడ్డి, ప్రిన్సిపల్ మునేశ్వరయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సంక్షేమం ప్రతి కుటుంబానికి, అభివృద్ధి ప్రతి గ్రామానికి చేరాలన్నదే కూటమి ప్రభుత్వ ధ్యేయం

### గడ్డంవారిపల్లిలో ఇంటింటికీ తెలుగుదేశం - ప్రజల సమస్యలు తెలుసుకున్న బీటెక్ రవి



ప్రజాభూమి, పులివెందుల

సంక్షేమం ప్రతి కుటుంబానికి, అభివృద్ధి ప్రతి గ్రామానికి చేరాలన్నదే కూటమి ప్రభుత్వ సంకల్పం అని పులివెందుల టీడీపీ ఇంచార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి – బీటెక్ రవి అన్నారు. చక్రాయపేట మండలం గడ్డంవారిపల్లి గ్రామంలోని గొందిలో నిర్వహించిన ఇంటింటికీ తెలుగుదేశంకార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటిని సందర్శించిన బీటెక్ రవి, గ్రామ ప్రజలతో ఆత్మీయంగా మాట్లాడి వారి అభిప్రాయాలు, సమస్యలు, స్థానిక అవసరాలను తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ సేవలు ప్రతి అర్హులైన కుటుంబానికి చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల సూచనలు, సహకారంతోనే గ్రామాభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందని పేర్కొంటూ, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చక్రాయపేట మండల ఇంచార్జ్ మహేశ్వర రెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమగ్ర శిక్ష ఉద్యోగులకు వెంటనే బకాయి జీతాలు విడుదల చేయాలి

### - ఉద్యోగ భద్రత కల్పించి పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లను రెగ్యులర్ చేయాలని రాష్ట్ర సంఘం డిమాండ్



ప్రజాభూమి, సిద్ధవటం: రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర శిక్ష (ఎస్ఎస్ఏ) పరిధిలో పనిచేస్తున్న పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు, కాంట్రాక్టు ఉద్యోగులకు గత రెండు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్ల 138/2017 రాష్ట్ర సంఘం కోశాధికారి బద్వేలి చిన్న వెంకటయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్ వేతనాలను విడుదల చేయడంతో పాటు ఉద్యోగుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులు ఎన్నో సంవత్సరాలుగా అతి తక్కువ వేతనాలతో, ఎలాంటి ఉద్యోగ భద్రత లేకుండా విద్యాశాఖకు సేవలందిస్తున్నప్పటికీ నెలల తరబడి జీతాలు అందక కుటుంబ పోషణ, పిల్లల విద్య, వైద్య ఖర్చులు, ఇంటి అద్దెలు, నిత్యావసరాల నిర్వహణ భారంగా మారిందని తెలిపారు. గత 14 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లకు ఇప్పటికీ ఉద్యోగ భద్రత కల్పించకపోవడం విచారకరమని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఉద్యోగుల సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరిస్తోందని విమర్శించారు. పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లకు ఎంటీఎస్ విధానాన్ని అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, దీర్ఘకాలంగా సేవలందిస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని కోరారు. "పార్ట్‌టైమ్" అనే పదాన్ని తొలగించి ఒకేషనల్ ఫుల్‌టైమ్ టీచర్లుగా గుర్తించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వేలాది మంది ఉద్యోగుల కుటుంబాలు జీతాల కోసం ఎదురుచూస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం వెంటనేస్పందించి బకాయి వేతనాలు విడుదల చేయడంతో పాటు ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను సానుకూలంగా పరిశీలించి అమలు చేయాలని చిన్న వెంకటయ్య కోరారు.

## మదర్ థెరెసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవయవ దాన అవగాహన పోస్టర్ విడుదల



ప్రజాభూమి పోరుమామిళ్ల : పోరుమామిళ్ల, ఆగస్టు 3: జాతీయ అవయవ దాన దినోత్సవాన్ని పురస్కరించుకొని మదర్ థెరెసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవయవ దానంపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో రూపొందించిన ప్రత్యేక పోస్టర్‌ను బద్వేల్ శాసనసభ్యులు డాక్టర్ దాసరి సుధమ్మ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధమ్మ మాట్లాడుతూ, "అవయవ దానం అనేది ఒక మహోన్నత మానవతా సేవ. ప్రతి ఒక్కరూ అవయవ దానం పట్ల అవగాహన పెంపొందించుకొని, జీవితాలను కాపాడే ఈ గొప్ప నిర్ణయంలో భాగస్వాములు కావాలని హృదయపూర్వకంగా కోరుతున్నాను" అని అన్నారు. మదర్ థెరెసా ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ చిత్తా రవి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ, మరణానంతరం కూడా మన అవయవాలు మరొకరికి కొత్త జీవితాన్ని అందించగలవు. ఒక అవయవ దాత ఎనిమిది మంది వరకు ప్రాణాలను కాపాడగలడు. ప్రతి ఒక్కరూ అవయవ దాన ప్రతిజ్ఞ చేసి, 'ఒక దాత -- ఎన్నో ప్రాణాలకు ఆశ' అనే సందేశాన్ని ప్రతి ఇంటికి చేరవేద్దాం" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ కల్లూరు రమణారెడ్డి, పోరుమామిళ్ల జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, మదర్ థెరెసా ఫౌండేషన్ కో-చైర్మన్ చిత్తా గిరి ప్రణీత్ రెడ్డి, పోరుమామిళ్ల మండల వైస్ ప్రెసిడెంట్ సి. భాష, యోగానంద రెడ్డి, చాపాటి సాయి నారాయణ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

## తల్లిపాలే శిశువుకు శ్రేష్ఠమైన ఆహారం: లక్ష్మీ నరసమ్మ



ప్రజాభూమి, సిద్ధవటం: అప్పుడే జన్మించిన శిశువుకు తల్లిపాలే ఉత్తమమైన, సంపూర్ణమైన ఆహారమని కమ్యూనిటీ హెల్త్ అధికారి లక్ష్మీ నరసమ్మ తెలిపారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సోమ వారం సిద్ధవటం ఎగువపేట అంగన్వాడి కేంద్రంలో నిర్వహించిన అవగాహన కార్యక్ర మంలో ఆమె మాట్లాడారు. శిశువు పుట్టిన గంటలోపే తల్లిపాలు ఇవ్వడం ప్రారంభించాలని, అనంతరం శిశువు కోరినప్పుడల్లా పగలు, రాత్రి తేడా లేకుండా తల్లిపాలు అందించాలనిసూచించారు. తొలి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలేఇవ్వడం వల్ల శిశువు ఆరోగ్యంగా ఎదగడంతో పాటు తల్లి ఆరోగ్యానికీ మేలు జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ మౌలాలి, హెల్త్ అసిస్టెంట్ వెంకటసుబ్బయ్య, అంగన్వాడి టీచర్, ఆశా వర్కర్ ఓబులమ్మ, బాలింతలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## దేవాలయ భూమి అక్రమ విక్రయంపై చర్యలు తీసుకోవాలి

### పోరుమామిళ్ల, బి.కోడూరు ఎస్ఐలకు వినతిపత్రం



ప్రజాభూమి పోరుమామిళ్ల :

వైఎస్సార్ కడప జిల్లా బి.కోడూరు మండలం మున్నెల్లి గ్రామంలోని శ్రీ మద్దిమాన్ గురప్పస్వామి దేవాలయ భూమిని అక్రమంగా వ్యక్తిగత పేరుకు మార్చుకుని విక్రయించారనే ఆరోపణలపై బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ పోరుమామిళ్ల, బి.కోడూరు పోలీస్ స్టేషన్ల ఎస్ఐలకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మున్నెల్లి గ్రామానికి చెందిన ఒకిలి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ, సర్వే నెం. 39/దిలోని 2.23 ఎకరాల దేవాలయ భూమిని అక్రమంగా రికార్డుల్లో మార్చి, బ్యాంకుల్లో రుణాలు తీసుకుని అనంతరం రూ.22 లక్షలకు విక్రయించినట్లు ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, అక్రమాలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు, రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసి దేవాలయ భూమిని తిరిగి దేవస్థానానికి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదుతో పాటు రిజిస్ట్రేషన్ పత్రాల ప్రతులు, ఈసీ, రెవెన్యూ రికార్డులు మరియు సంబంధిత పత్రాలను సమర్పించినట్లు పేర్కొన్నారు. ఈ వినతిపత్రం సమర్పించిన వారిలో ఒకిలి శ్రీనివాస్ రెడ్డి మున్నెల్లి విహెచ్ పి ,యాదాల రమేష్ విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి, ఉండేల శ్రీనివాస్ రెడ్డి బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి, ఫణిరావు స్వామి ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ సెక్రటరీ, వీహెచ్‌పీ అధ్యక్షుడు, నాగేంద్రబాబు బీజేపీ కార్యకర్త, టంగుటూరి శంకరయ్య వీహెచ్‌పీ పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలకు సోమవారం కలెక్టరేట్‌లో మహా దర్బార్

**జిల్లా, డివిజన్, మండల కేంద్రాల్లో ఏకకాలంలో వినతుల స్వీకరణ**
**జిల్లా యంత్రాంగం ప్రజల సేవలో సిద్ధం!**



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.
సమస్య ఏదైనా పరిష్కారం ఒక్కటే నేడు జిల్లా వ్యాప్తంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక! ప్రజల గడపకు పాలన ప్రతి వినతికి న్యాయం పీజీఆర్ఎస్‌లో అర్జీలు స్వీకరణ! ఆలస్యం వద్దు మీ సమస్యను వినిపించండి జిల్లా ప్రజలకు కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ ప్రత్యేక పిలుపు! ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించి ప్రభుత్వ సేవలను ప్రజల గడపకు చేరవేయాలనే లక్ష్యంతో ఈ నెల 3వ తేదీ సోమవారం జిల్లా వ్యాప్తంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ వెల్లడించారు.తిరుపతి జిల్లా కలెక్టరేట్‌తో పాటు జిల్లా, డివిజన్, మండల కేంద్రాల్లో ఒకేసారి జరిగే ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వాటిపై వెంటనే చర్యలు ప్రారంభించనున్నారు. కలెక్టరేట్‌లో ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కార్యక్రమం కొనసాగనుంది.ఇప్పటికే సమర్పించిన వినతులు పరిష్కారం కాకపోయినా, వాటి స్థితిగతులను తెలుసుకోవాలన్నా ప్రజలు 1100 సహాయ సంఖ్యకు సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు. అలాగే మీకోసం సేవా వేదిక ద్వారా కొత్త వినతులను నమోదు చేసుకునే అవకాశమూ కల్పించినట్లు పేర్కొన్నారు.వినతిదారులు తమ పూర్తి వివరాలతో పాటు సమస్యకు సంబంధించిన పత్రాలను జతచేయాలని, గతంలో వినతి ఇచ్చిన వారు పాత రసీదును వెంట తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారానికి సంబంధించిన సమాచారం నేరుగా వారి దూరవాణికి చేరేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన బాధ్యత అనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని జిల్లా ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

## గ్రీవెన్స్ సెల్‌కు గైర్హాజరైతే షోకాజ్ నోటీసులు తప్పవు: ఎమ్మార్వో చంద్రశేఖర్ రెడ్డి హెచ్చరిక.



ప్రజా భూమి ప్రతినిధి నాయుడుపేట.
నాయుడుపేట తాసిల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం నాడు నిర్వహించే గ్రీవెన్స్ డే (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమానికి నిర్లక్ష్యంగా గైర్హాజరయ్యే వివిధ శాఖల అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి హెచ్చరించారు. విధులకు హాజరుకాని అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఫిర్యాదుల స్వీకరణ: కార్యాలయానికి వచ్చిన అర్జీదారుల నుంచి ఎమ్మార్వో స్వయంగా వినతులను స్వీకరించి, వారి సమస్యలను ఆరా తీశారు. ప్రజలు ఎదుర్కొంటున్న రెవెన్యూ మరియు ఇతర సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి, వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్దేశించిన గ్రీవెన్స్ డే కి కొందరు అధికారులు గైర్హాజరు కావడంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. అలాంటి కార్యక్రమంలో కొంతమంది అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని ఆయా శాఖలపై శాఖాపరమైన చర్యలు తప్పవు. ప్రజలు తమ సమస్యల పై చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వస్తుంటారని, సంబంధిత శాఖల అధికారులు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా ఆయన అధికారులకు గుర్తుచేశారు.

## విద్యుత్ శాఖ నిర్లక్ష్యం... గంగమ్మ ఆలయ కుంభాభిషేక ఉత్సవాలకు శాపం



ప్రజా భూమి ప్రతినిధి వరదయ్యపాలెం.
రంగువల్లె వేయడానికి ఆలయంపై విద్యుత్ తీగలు తొలగించాలని పది రోజులుగా ప్రాధేయపడుతున్నా.. పట్టించుకోని లైన్ మెన్, ఫోన్ ఎత్తని ఏఈ. మేం చూడం.. మేం వినం.. మేం పట్టించుకోం అన్న చందాన విద్యుత్ శాఖ తీరు. కాసులిస్తే గానీ స్పందించరా... మండల వ్యాప్తంగా విద్యుత్ శాఖ అధికారుల తీరుపై వెల్లువెతుతున్న విమర్శలు. వరదయ్యపాలెం మండలం. కళత్తూరు ఎస్సీకాలనీలో నూతనంగా నిర్మించిన గంగమ్మ ఆలయంలో ఈనెల 15 వ తేదీ నుంచి కుంభాభిషేక ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు గ్రామపెద్దలు అన్ని ఏర్పాట్లు చేస్తుండగా, ఆలయానికి రంగులు వల్లె వేయడానికి ఆలయం పైన విద్యుత్ తీగలు అడ్డుగా ఉండటంతో వాటిని తొలగించాలని గత పది రోజులుగా స్థానిక లైన్ మెన్ కు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదు. దీనిపై ఏఈకి ఫోన్ చేస్తున్నా ఆయన కనీసం ఫోన్ ఎత్తక స్పందించడం లేదని గ్రామపెద్దలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. కనీసం ప్రజలు దైవంగా ఆరాధించే గంగమ్మ అమ్మవారిపై కూడా విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యంతో కరుణచూపక పోవడంపై విమర్శలు వ్యక్తం అవుతోంది. మండలంలో పలు విద్యుత్ సమస్యలను పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తుండగా వివిధ సమస్యలపై ఏఈ కి ఫోన్ చేస్తున్నా ఆయన ఫోన్ తీయరనీ స్పందించారని ప్రజలు ఆరోపిస్తున్నారు. గంగమ్మ అమ్మవారి విషయంలో సైతం కాసులిస్తే గానీ స్పందించరా అంటూ ప్రజలు విద్యుత్ శాఖ అధికారుల తీరుపై అసంతృప్తి ఆగ్రహం వెల్లువెతుతున్నయి. ఇకనైనా జిల్లా అధికారులు స్పందించి మండలంలో విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యతీరుపై చర్యలు తీసుకోవాలని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండేలా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

## తల్లిపాల వారోత్సవాల నిర్వహణ నివేదిక



ప్రజా భూమి ప్రతినిధి వరదయ్యపాలెం.
తిరుపతి జిల్లా వరదయ్యపాలెం మండలం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అంగన్వాడీ కేంద్రం శిల్ప ఆధ్వర్యంలో సి ఆర్ సి కండ్రిగ ఏ డబ్ల్యు సి నవజాత శిశువుల ఆరోగ్యం, పోషణ మరియు వ్యాధినిరోధక శక్తి పెంపొందించడంలో తల్లిపాల ప్రాముఖ్యతపై



గర్భిణులు, బాలింతలు మరియు వర్ధమాన తల్లులకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమాలము ముఖ్య ఉందేశం. గ్రామంలో తల్లిపాల విశిష్టతపై నినాదాలు చేస్తూ ప్లకార్డులతో అవగాహన గ్రహసం ధర్శనాలు పసిపిల్లలు ఉన్న తల్లుల ఇళ్లకు వెళ్లి నేరుగా పాలు పట్టే పద్ధతులు, ప్రయోజనాలను వివరించారు. అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు మరియు కిషోర బాలికలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి బాలింతలకు అవసరమైన పౌష్టికాహారం (ఆకుకూరలు, గుడ్లు, పాలు, బలవర్ధకమైన ఆహారం) పై ప్రదర్శన మరియు అవగాహన కల్పించాము.ఈ సందర్భంగా శిల్ప మాట్లాడుతూ తొలి పాలు (ముర్రు పాలు): కాన్పు అయిన వెంటనే ఇచ్చే ముర్రు పాలు బిడ్డకు మొదటి టీకా లాంటివని, వ్యాధినిరోధక శక్తిని పెంచుతాయని వివరించాము. పరిపూర్ణ తల్లిపాలు (6 నెలల వరకు): మొదటి 6 నెలల వరకు బిడ్డకు నీళ్లు, తేనె, గ్లూకోజ్ వంటివి ఇవ్వకూడదని, కేవలం తల్లిపాలు మాత్రమే పట్టాలని స్పష్టం చేశారు. అనుబంధ ఆహారం (6 నెలల తర్వాత): 6 నెలలు పూర్తయిన తర్వాత తల్లిపాలతో పాటు మెత్తటి ఉడికించిన అనుబంధ ఆహారం ప్రారంభించాలని తెలియజేశారు.ఈ కార్యక్రమం లో గర్భిణులు, అంగన్వాడీ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## "డిఫ్తీరియా, కోరింత దగ్గు, ధనుర్వాతం నివారణకు టీకాలే రక్షణ"



ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.
రేణిగుంట మండల వైద్యాధికారి డాక్టర్ చక్రపాణి ఆదేశాలమేరకు రేణిగుంట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం, టి.డి. టీకాల పంపిణీ కార్యక్రమాన్ని హెల్త్ సూపర్వైజర్ కామరాజు నిర్వహించారు. డిఫ్తీరియా , పర్టుసిస్ (కోరింత దగ్గు), టెటనస్ (ధనుర్వాతం) వంటి ప్రాణాంతక అంటువ్యాధుల నుండి పిల్లలు, యువతను రక్షించడంలో టీకాలు అత్యంత ప్రభావవంతమైనవని హెల్త్ సూపర్వైజర్ కామరాజు తెలిపారు.డాక్టర్ చక్రపాణి ఆదేశాల మేరకు రేణిగుంట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థినులకు డిఫ్తీరియా, పర్టుసిస్,టెటనస్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించి, జాతీయ టీకాల కార్యక్రమం ( యు ఐ పి)లో భాగంగా అర్హులైన విద్యర్థినులకు టి.డి. టీకాలు వేశారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్వైజర్ కామరాజు మాట్లాడుతూ డిఫ్తీరియా అనేది బ్యాక్టీరియా వల్ల వచ్చే తీవ్రమైన అంటువ్యాధి అని, గొంతు నొప్పి, జ్వరం,గొంతులో బూడిద రంగు పొర ఏర్పడటం,శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు వంటి లక్షణాలు కనిపిస్తాయని వివరించారు.సరైన సమయంలో చికిత్స అందకపోతే గుండె,నరాలపై తీవ్ర ప్రభావం ,ప్రాణాపాయానికి దారితీసే అవకాశం ఉందన్నారు. పర్టుసిస్ (కోరింత దగ్గు) చిన్నారులకు అత్యంత ప్రమాదకరమైన వ్యాధి అని, ఎక్కువ రోజుల పాటు ఆగని దగ్గు, దగ్గు అనంతరం ఊపిరి పీల్చుకోవడంలో ఇబ్బంది,వాంతులు వంటి లక్షణాలు ఉంటాయని తెలిపారు.తీవ్రమైన సందర్భాల్లో న్యుమోనియా, మెదడు దెబ్బతినడం, మరణం కూడా సంభవించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. టెటనస్ (ధనుర్వాతం) గాయాల ద్వారా శరీరంలోకి ప్రవేశించే బ్యాక్టీరియా వల్ల వస్తుందని,దవడ బిగుసుకుపోవడం, కండరాలు గట్టిపడటం,శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. శరీరం ధనుస్సులా వంగి పోయే పరిస్థితి కూడా ఏర్పడే ఈ వ్యాధి కూడా ప్రాణాంతకమని పేర్కొన్నారు. ఈ మూడు వ్యాధుల నివారణకు ప్రభుత్వ జాతీయ టీకాల కార్యక్రమం కింద 6, 10, 14 వారాలలో ఇూ/పెంటావాలెంట్ టీకాలు,16--24 నెలల్లో మొదటి బూస్టర్,5--6 సంవత్సరాలలో రెండో బూస్టర్ అందజేస్తున్నారని తెలిపారు. అదేవిధంగా 10 సంవత్సరాలు,16 సంవత్సరాల వయస్సులో టి.డి. టీకా వేయించుకోవడం ద్వారా డిఫ్తీరియా, టెటనస్ వ్యాధుల నుండి రక్షణ పొందవచ్చని వివరించారు. గర్భిణులు కూడా తప్పనిసరిగా టి.డి. టీకాలు తీసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉచితంగా అందించే టీకాలను సమయానికి వేయించి ఆరోగ్య వంతమైన భవిష్యత్తుకు బాటలు వేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని శ్యామల, ఉపాధ్యాయులు, ఎఎన్ఎం రేవతి, ఆశాకార్యకర్తలు శాంతి, సులోచన, కళ్యాణి, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ప్రజాసంక్షేమమే ధ్యేయం.. తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం పంపిణీ ప్రారంభం

**తిరుపతి రైతు బజార్‌లో ప్రారంభించిన తుడా ఛైర్మన్ డా. డాలర్స్ దివాకర్ రెడ్డి**





ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి
సామాన్య, మధ్యతరగతి ప్రజలపై నిత్యావసర వస్తువుల భారం తగ్గించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "తక్కువ ధరకే బియ్యం అమ్మకాల" కార్యక్రమాన్ని తిరుపతి రైతు బజార్‌లో తుడా ఛైర్మన్, తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్, తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డా. డాలర్స్ దివాకర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా డా. డాలర్స్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజాసంక్షేమాన్ని మాటల్లో కాకుండా చేతల్లో చూపించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ నిత్యావసర వస్తువుల ధరల భారం నుంచి ఉపశమనం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు.ఆగస్టు 1వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా బహిరంగ మార్కెట్ ధరల కంటే తక్కువ ధరకే నాణ్యమైన బీపీటీ రకం బియ్యాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించడం, ధరలను అనవసరంగా పెంచడం వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ప్రత్యేక విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు.కార్యక్రమంలో భాగంగా బియ్యం విక్రయ కౌంటర్లను పరిశీలించి, బియ్యం నాణ్యతా ప్రమాణాలను స్వయంగా తనిఖీ చేశారు. పంపిణీ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా నిర్వహించాలని అధికారులకు సూచించారు. వినియోగదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్రమశిక్షణతో పంపిణీ చేపట్టాలని ఆదేశించారు. తిరుపతి పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన బియ్యాన్ని తక్కువ ధరకే కొనుగోలు చేసుకోవాలని డా. డాలర్స్ దివాకర్ రెడ్డి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. వెంకటేశ్వర్లు, జాయింట్ కలెక్టర్, తుడా వైస్ ఛైర్మన్ ఆర్. గోవిందరావు,తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, గ్రీనరీ బ్యూటిఫికేషన్ ఛైర్మన్ సుగు ణమ్మ, నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు రుద్ర కోటి సదాశివం, పౌరసరఫరాల శాఖ అధికారులు, రైతు బజార్ అధికారులు, స్థానిక కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, వినియోగదారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర వ్యాప్తంగా తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం 1 నుండి విక్రయాల ప్రారంభం





ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.
రాష్ట్ర వ్యాప్తంగా తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం ఆగష్టు 01 నుండి విక్రయాల ప్రారంభించడం జరిగిందని, అందులో భాగంగా తిరుపతి జిల్లాలో 28 కేంద్రాలలో తక్కువ ధరకే బియ్యం విక్రయాలు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. సోమవారం ఉదయం తిరుపతి పట్టణం నందు రైతుబజార్‌లో జరిగిన తక్కువ ధరల బియ్యం విక్రయ ధరల స్థిరీకరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన తక్కువ ధరల బియ్యం విక్రయ కార్యక్రమాన్ని తిరుపతి శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు, తుడా ఛైర్మన్ దివాకర్ రెడ్డి, క్లీన్ అండ్ గ్రీన్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ సదాశివం, జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావులతో కలసి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా సివిల్ సప్లైస్ శాఖ ఆధ్వర్యంలో రెండు రకాల ఫైన్ వెరైటీ బియ్యాన్ని మార్కెట్ ధర కంటే తక్కువ ధరకే ప్రజలకు అందిస్తున్నట్లు తెలిపారు. మార్కెట్‌లో కిలోకు రూ.65 ల నుంచి రూ.70 ల వరకు విక్రయిస్తున్న స్టీమ్డ్ బీపీటీ బియ్యాన్ని రూ.52లకు, రూ.58 నుంచి రూ.62 వరకు విక్రయిస్తున్న రా బీపీటీ బియ్యాన్ని రూ.50లకు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 115 రైతుబజార్లు, 500 రైస్ మిల్లర్ల ప్రత్యేక విక్రయ కేంద్రాల ద్వారా ఈ కార్యక్రమం అమలవుతుండగా, తిరుపతి జిల్లాలో 28 కేంద్రాల్లో బియ్యం విక్రయాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సంవత్సరం ఎల్‌నినో ప్రభావంతో అధిక ఉష్ణోగ్రతలు, తక్కువ వర్షపాతం నమోదవుతున్నాయని, తిరుపతి జిల్లాలో జూన్, జూలై నెలల్లో సుమారు 22 శాతం వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయని కలెక్టర్ తెలిపారు. రాష్ట్రంలోని 28 జిల్లాల్లో 22 జిల్లాలకు పైగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని చెప్పారు. వర్షాభావం కొనసాగితే వరి ఉత్పత్తి తగ్గి బియ్యం ధరలు పెరిగే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యల్లో భాగంగా రైస్ కార్డుదారులకు మార్కెట్ ధర కంటే కిలోకు రూ.10 నుంచి రూ.14 వరకు తక్కువ ధరకే బియ్యం అందిస్తున్నామని తెలిపారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఒక్కో రైస్ కార్డు కు నెలకు 26 కిలోల బియ్యాన్ని ఒకే బ్యాగ్ రూపంలో అందజేస్తామని, విడివిడిగా విక్రయించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తిరుపతి శాసనసభ్యులు మాట్లాడుతూ, ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. రైతుబజార్లు, రైస్ మిల్లర్ల అవుట్‌లెట్ల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 115 రైతుబజార్లు, 500 ప్రత్యేక విక్రయ కేంద్రాల్లో తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. మార్కెట్‌లో రూ.65కు విక్రయించే స్టీమ్డ్ బియ్యాన్ని రూ.52కే, రూ.58కు విక్రయించే రా బియ్యాన్ని రూ.50కే అందించడం ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భారం తగ్గుతుందని పేర్కొన్నారు. అభివృద్ధితో పాటు సంక్షేమానికి సమాన ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు అవసరమైన వస్తువులను అందుబాటు ధరల్లో అందించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. గౌరవ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, విద్యా మరియు ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా అమలవుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రామ్మోహన్, పౌర సరఫరాల శాఖ అధికారి శేషాచల రాజు,మార్కెటింగ్ అధికారి సురేంద్ర బాబు, తిరుపతి అర్బన్ తహసీల్దార్ సురేష్ బాబు, సివిల్ సప్లై అధికారులు, రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైస్ మిల్లర్స్ ప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల అభ్యున్నతే ధ్యేయం... మన తిరుపతి ప్రెస్ క్లబ్ సేవలకు డీఎస్పీ ప్రశంసలు

**జర్నలిస్టుల నైపుణ్యాభివృద్ధే లక్ష్యం -- మన తిరుపతి ప్రెస్ క్లబ్ సేవలు అభినందనీయం**



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.
గత ఆదివారం నిర్వహించిన ప్రత్యేక శిక్షణా కార్యక్రమంలో విజయవంతంగా పాల్గొన్న మన తిరుపతి ప్రెస్ క్లబ్ సభ్యులకు తిరుపతి టౌన్ డీఎస్పీ ఎం. భక్తవత్సలం చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి సభ్యుడి కృషిని ప్రశంసిస్తూ, శిక్షణ ద్వారా పొందిన నైపుణ్యాలను వృత్తి జీవితంలో సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా డిఎస్పీ ఎం. భక్తవత్సలం మాట్లాడుతూ, మన తిరుపతి ప్రెస్ క్లబ్ జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి నైపుణ్యాభివృద్ధి, సామాజిక సేవ వంటి అనేక రంగాల్లో చేపడుతున్న కార్యక్రమాలు ప్రశంసనీయమని అన్నారు. మీడియా రంగంలో పనిచేసే ప్రతి జర్నలిస్టు సమయపాలన, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన విధానాన్ని అలవర్చుకోవాలని, నిరంతరం కొత్త విషయాలను నేర్చుకుంటూ తమ ప్రతిభను మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. త్వరలో మన తిరుపతి ప్రెస్ క్లబ్‌ను స్వయంగా సందర్శించి సభ్యులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తానని హామీ ఇచ్చారు. మన తిరుపతి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గొడ్డిండ్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, జర్నలిస్టుల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని త్వరలో ఉచిత యోగా శిక్షణా కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. అలాగే జర్నలిస్టుల కుటుంబ సభ్యులు, విద్యార్థులు, విద్యార్థినుల వ్యక్తిత్వ వికాసం, కమ్యూనికేషన్ నైపుణ్యాల పెంపు కోసం ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణా తరగతులను కూడా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మన తిరుపతి ప్రెస్ క్లబ్ ఫౌండర్ ప్రెసిడెంట్ తపసి మురళి రెడ్డి మాట్లాడుతూ, ప్రెస్ క్లబ్ తక్కువ సమయంలోనే జర్నలిస్టుల కోసం అనేక వినూత్న కార్యక్రమాలను చేపట్టి ప్రత్యేక గుర్తింపు పొందడం ఆనందంగా ఉందన్నారు. జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి నైపుణ్యాభివృద్ధి, సామాజిక బాధ్యతను పెంపొందించే కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ మేనేజర్ అనిల్, వైస్ ప్రెసిడెంట్ పొన్నా రవి కుమార్, క్లబ్ సభ్యులు, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు. శిక్షణ పూర్తి చేసిన సభ్యులకు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమం సభ్యుల్లో నూతన ఉత్సాహాన్ని నింపడంతో పాటు, జర్నలిస్టుల వృత్తి నైపుణ్యాభివృద్ధికి, వ్యక్తిత్వ వికాసానికి, సమాజ సేవ పట్ల మరింత బాధ్యతాయుతమైన దృక్పథాన్ని పెంపొందించే వేదికగా నిలిచింది.

## సేవా కార్యక్రమాలతో మనిషి జీవితం సార్థకం:మణి యాదవ్.!

**విద్యార్థులకు పుస్తకాలు,పలకలు,పంపిణీ..**



ప్రజా భూమి ప్రతినిధి,చంద్రగిరి:
సేవా కార్యక్రమాలతో మనిషి జీవితం సార్థకమని, మానవ సేవయే మాధవ సేవ అని మాజీ జూపార్కు డైరెక్టర్ మణి యాదవ్ అన్నారు. సోమవారం చంద్రగిరి మండలం పనపాకం పంచాయతి లోని అరిగిలవారిపల్లె లోని అంగన్వాడి కేంద్ర,ప్రాథమిక పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులు, నోటు పుస్తకాలు,పలకలు, పెన్నులను,మణి యాదవ్ వితరణ చేయగా, అదేవిధంగా పనపాకం పేట అంగన్వాడీ కేంద్రంలో పలకలు,ప్రాథమిక పాఠశాలకు ర్యాక్ ను, తిరుపతి కొర్లగుంటలోని సమర్థ సద్గురు శ్రీ శిరిడి సాయిబాబా మందిరం ధర్మకర్త జవ్వాజి సాంబయ్య, భాగ్యలక్ష్మి దంపతులు వితరణ గా అందజేశారు. మణియాదవ్ మాట్లాడుతూ పంచాయతి లో ఉన్న పాఠశాలలో మా శక్తి మేరకు సహకారాన్ని అందస్తామన్నారు. పనపాకం పేట ప్రాథమిక పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్లు కు వైట్ పెయింట్ వేయిస్తానన్నారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా పనపాకం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎ.మంజువాణి,విశ్రాంత హెచ్.యం. అరిగిల రామచంద్రయ్యులు హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ శిరిడి సాయిబాబా మందిరం ధర్మకర్త జవ్వాజి సాంబయ్య, భాగ్యలక్ష్మీ, మణి యాదవ్ ల ఆధ్వర్యంలో చంద్రగిరి మండలం పనపాకం పంచాయతిలోని అరిగిలవారిపల్లె అంగన్వాడీకి, ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థుల కు పలకలు, పుస్తకాలు, పనపాకం పేట అంగన్వాడీలోని చిన్నారులకు పలకలు,ప్రాథమిక పాఠశాలకు ఆరడుగుల రాక్ ను పంపిణీ చేశారన్నారు. ఇలా ప్రతి సంవత్సరం చేస్తున్నారని వారు తెలిపారు.పలు సేవా కార్యక్రమాలను చేపట్టి ఆదర్శంగా నిలిచారని వారు ప్రశంసించారు. విద్యార్థులకు పలకలు, పుస్తకాలు, పెన్నులు పంపిణీ ఆనవాయితీగా చేస్తున్నారని వారు కొనియాడారు. డబ్బులు అందరి దగ్గర ఉంటాదని అయితే సమాజానికి సేవ చేసే గునం ఉండాలని వారు అన్నారు.ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేయాలని ఆకాంక్షిస్తున్నానని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ తిరుపతి జిల్లా ఉపాధ్యక్షులు పానేటి చెంగల్రాయులు,వైస్ యంపిపి,వెంకటరత్నం,మాజీ సర్పంచ్ కె.గోపాల్, ఢిల్లీ, అరిగిలవారిపల్లె ప్రాథమిక పాఠశాల హెచ్.యం.అనుసూయ,పనపాకం పేట,హెచ్.యం సురేష్, ఉపాధ్యాయులు చలపతి, చిట్టిబాబు, అశ్వని,అంగన్వాడి వర్కర్స్ క్రిష్ణ కుమారి,శాంతి, తదితరులు పాల్గొన్నారు.

# భూస్వాముల కబంధ హస్తాల నుంచి గిరిజన భూములను కాపాడాలి

- స్మశాన వాటికల ఆక్రమణలు తొలగించి దళితులకు భూ పట్టాలు ఇవ్వాలి
- 30 ఏళ్లుగా సాగు చేస్తున్న భూములకు హక్కులు కల్పించాలని సిపిఎం డిమాండ్

ప్రజా భూమి ప్రతినిధి – బుచ్చినాయుడు కండ్రిగ

తిరుపతి జిల్లా బి.ఎన్ కండ్రిగ మండల పరిధిలోని పలు దళిత, గిరిజన గ్రామాల్లో నెలకొన్న భూ, గృహ, మౌలిక వసతుల సమస్యల పరిష్కారం కోసం సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం ప్రజా సమస్యల వేదిక సందర్భంగా తహసీల్దార్ లక్ష్మీనారాయణకు ఉమ్మడి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. కుక్కంబాకం గ్రామంలో దళితులు సాగు చేస్తున్న సర్వే నంబర్ 81లోని 42 ఎకరాల భూమికి తక్షణమే పట్టాలు మంజూరు చేయాలని కోరారు. నీరుపకోట గ్రామంలో నివాస స్థలాల కొరత తీవ్రంగా ఉందని, సర్వే నంబర్లు 106, 107లో భూములను సేకరించి ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు. గజాలపెళ్లూరులో స్మశాన వాటికకు వెళ్లే దారిపై ఉన్న ఆక్రమణలను తొలగించాలని, అటవీ భూములకు సంబంధించిన న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు. అలాగే 40 ఏళ్ల క్రితం నిర్మించిన పాత ఇళ్ల స్థానంలో కొత్త ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కొత్త కండ్రిగలో పశువుల మేత కోసం అడవికి వెళ్లే మార్గాన్ని భూస్వాములు అడ్డుకుంటున్న సమస్యను పరిష్కరించాలని, సౌర విద్యుత్ దీపాలు, కాలువల నిర్మాణం చేపట్టాలని కోరారు. కారణి మిట్ట జగనన్న కాలనీలో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించి, సిమెంట్ రహదారులు, వీధి కాలువల సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. నెలవాయి గ్రామంలో దళితులు సాగు చేస్తున్న భూములకు పట్టాలు మంజూరు చేసి, డ్రైనేజీ కాలువలను శుభ్రపరచాలని కోరారు. వేణుగోపాలపురంలో భూమిలేని 60 కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, చదువుకున్న నిరుద్యోగ యువతకు నెలకు రూ.26 వేల కనీస వేతనంతో ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. తలారివేటు-- కలవలమిట్ట గ్రామాల్లో దళితులకు ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇతరులు అక్రమంగా ఆక్రమించిన భూములను స్వాధీనం చేసుకుని అసలైన లబ్ధిదారులకు అప్పగించాలని కోరారు. సామాజిక సర్వే ద్వారా గుర్తించిన ఈ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపి నిరుపేదలకు న్యాయం చేయాలని సిపిఎం నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల అధ్యక్షుడు నలుగురి రమణయ్య మాట్లాడుతూ గిరిజన భూములు, స్మశాన వాటికలను ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుని బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా రైతు సంఘం నాయకుడు అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ మండలంలో అగ్రవర్ణాల ఆధిపత్యం పెరిగి దళిత, గిరిజన వర్గాలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన తహసీల్దార్ సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సంఘం ఉపాధ్యక్షుడు ధనుంజయులు, సీఐటీయూ మండల అధ్యక్షుడు కత్తి హేమచంద్ర, మండల వ్యవసాయ సంఘం అధ్యక్షుడు గాలి వెంకట రమణారెడ్డి, తిరుపాల్, దూడల సుబ్బయ్య, కత్తి గురువయ్య, బాల గురువయ్యతో పాటు పెద్ద సంఖ్యలో దళిత, గిరిజన ప్రజలు పాల్గొన్నారు.




# తిరుపతిలో దాసరి మఠం పునరుద్ధరణకు స్థలం కేటాయించాలని

## రాష్ట్ర దాసరి కార్పొరేషన్ డైరెక్టర్ ప్రేమ్ కుమార్ విజ్ఞప్తి

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి రూరల్

తిరుపతిలో ఒకప్పుడు దాసరి కులానికి ఆధ్యాత్మిక, సాంస్కృతిక కేంద్రంగా ఉన్న దాసరి మఠాన్ని పునరుద్ధరించేందుకు ప్రభుత్వం తగిన స్థలాన్ని కేటాయించాలని రాష్ట్ర దాసరి కార్పొరేషన్ డైరెక్టర్ ప్రేమ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. దాసరి కులస్థుల ఆత్మగౌరవం, చారిత్రక వారసత్వాన్ని పరిరక్షించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆధునిక సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నప్పటికీ దాసరి కులం సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిపోయిందన్నారు. ఒకప్పుడు సమాజానికి భక్తి, సంస్కృతి, నైతిక విలువలను హరికథలు, బుర్రకథల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లిన గొప్ప కళాకారులు దాసరి కులంలో ఎందరో ఉన్నారని తెలిపారు. ఆదిశంకరాచార్యుల కాలం నుంచి భారత స్వాతంత్ర్య ఉద్యమం వరకు దాసరి కళాకారులు ప్రజల్లో చైతన్యం నింపడంలో విశేష పాత్ర పోషించారని పేర్కొన్నారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా దాసరి కళాకారుల సంప్రదాయం క్రమంగా కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రిజర్వేషన్ల జాబితాలో దాసరి కులం బీసీ-ఏ వర్గంలో ఉన్నప్పటికీ, తగిన గుర్తింపు, ప్రోత్సాహం అందడం లేదన్నారు. 'దాసరి' అంటే భగవంతుని సేవకుడని, పూర్వం నుంచి దాసరి కులస్థులు శ్రీమహావిష్ణువును ఆరాధిస్తూ శంఖం ఊదుతూ, చక్రం ధరించి గ్రామాల్లో భగవన్నామ స్మరణ చేస్తూ ఆధ్యాత్మిక సేవలు అందించేవారని వివరించారు. ముఖ్యంగా వైష్ణవ ఆలయాల్లో, తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి సన్నిధిలో గరుడ స్తంభాన్ని ఎత్తుకొని జ్యోతి ప్రజ్వలన చేస్తూ సేవ చేసిన గొప్ప చరిత్ర దాసరి కులానికి ఉందన్నారు. తిరుపతిలో గతంలో దాసరి మఠం ఉండేదని, అక్కడ దాసరి కులస్థులు నివసిస్తూ ఇతర ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులకు సత్రంలో వసతి కల్పించి, హరికీర్తనలు, భజనలు నిర్వహిస్తూ ఆధ్యాత్మిక సేవలు అందించేవారని గుర్తు చేశారు. కాలక్రమేణా ఆ మఠం ఆక్రమణలకు గురై నేడు ఉనికిని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దాసరి మఠం పునరుద్ధరణ కోసం తిరుపతిలో తగిన స్థలాన్ని ప్రభుత్వం కేటాయించాలని, ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రేమ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. దాసరి కులస్థుల కళలు, సంప్రదాయాలు, చరిత్రను భావి తరాలకు అందించేందుకు మఠం పునర్నిర్మాణం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. దాసరి కులస్థుల ఆకాంక్షలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, తిరుపతిలో దాసరి మఠం ఏర్పాటుకు స్థలం మంజూరు చేసి చారిత్రక నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర దాసరి కార్పొరేషన్ డైరెక్టర్ ప్రేమ్ కుమార్ కోరారు.



# ఇంటర్ స్కూల్ క్రికెట్ పోటీలలో ఫైనల్స్కు చేరుకున్న

## జడ్పీ హైస్కూల్ గూడూరు - లిటిల్ ఏంజెల్ స్కూల్ జట్లు

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,

రోటరీ క్లబ్, గూడూరు క్రికెట్ క్లబ్, అల్లూరు ఆదిశేషారెడ్డి క్రికెట్ క్లబ్, కనుమూరు హరిచంద్రారెడ్డి క్రికెట్ క్లబ్ మరియు సత్యనారాయణ రెడ్డి క్రికెట్ క్లబ్ ల ఆధ్వర్యంలో గూడూరులోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో గత వారం రోజులుగా నిర్వహించబడుతున్న అంతర్ పాఠశాలల క్రికెట్ పోటీలలో జిల్లా పరిషత్ హై స్కూల్ గూడూరు జట్టు మరియు లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్ స్కూల్ జట్టు ఫైనల్స్ కు చేరుకున్నాయి. ఉదయం జరిగిన మొదటి సెమి ఫైనల్ మ్యాచ్లో జిల్లా పరిషత్ హై స్కూల్ కొండగుంట జట్టు మరియు గూడూరు జడ్పీ హైస్కూల్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కొండగుంట జడ్పీ హైస్కూల్ జట్టు ముందుగా బ్యాటింగ్ ఎంచుకుని 12 ఓవర్లలో కేవలం 65 పరుగులు మాత్రమే చేసి అంతా ఆల్ అవుట్ అయ్యారు. అనంతరం 66 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన జడ్పీ హైస్కూల్ గూడూరు జట్టు కేవలం 12.1 ఓవర్లలో నాలుగు వికెట్లు మాత్రమే కోల్పోయి 66 పరుగులు చేసి విజయం సాధించింది. ఈ చెట్టులోని దివేశ్ ఆల్రౌండ్ ప్రతిభతో 26 పరుగులు చేయడమే కాకుండా మూడు వికెట్లు తీసుకొని జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. బౌలర్ నబీల్ 3 వికెట్లు తీసుకున్నాడు మధ్యాహ్నం జరిగిన మరొక సెమి ఫైనల్ మ్యాచ్లో లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్ స్కూల్ జట్టు మరియు ఆదిశంకర స్కూల్ జట్టు తలపడ్డాయి. టాస్ గెలిచిన ఆదిశంకరా జట్టు ముందుగా బ్యాటింగ్ ఎంచుకుని నిర్ణీత 15 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 87 పరుగులు సాధించింది. అనంతరం 88 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన లిటిల్ ఏంజెల్ స్కూల్ జట్టు కేవలం 8.1 ఓవర్లలో కేవలం 4 వికెట్లు మాత్రమే కోల్పోయి 88 పరుగులు సాధించి విజయాన్ని అందుకుంది. ఈ జట్టులోన బ్యాటర్లు దేవ్ సింగ్ రాణా 22, హేమంత్ 19 పరుగులు చేసి విజయంలో కీలక పాత్ర పోషించారు. ఈ మ్యాచ్ లకు అంపైర్లుగా స్టాలిన్, యూసఫ్, వెంకి లు మరియు స్కోరర్లుగా నాని, హరి,పూర్ణేష్ లు వ్యవహరించారు . మంగళవారం ఉదయం ఆదిశంకరా జట్టు మరియు కొండగుంట జడ్పీ హైస్కూల్ జట్ల మధ్య మూడవ స్థానం కొరకు మ్యాచ్ జరుగుతుందని, అలాగే మధ్యాహ్నం రెండు గంటలకు లిటిల్ ఏంజెల్ స్కూల్ మరియు జిల్లా పరిషత్ హై స్కూల్ గూడూరు జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరుగుతుందని నిర్వాహకులు తిరుమూరు సురేష్ రెడ్డి, కొణిదల ముని గిరీష్ మరియు లవ కుమార్ లు తెలిపారు.



# అంగన్వాడీ కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాలు

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,

గూడూరు ఐ. సీ. డి.ఎస్. ప్రాజెక్ట్, అశోక్ నగర్ సెక్టార్ పరిధిలోని సత్రపు వీధి 1, 2 అంగన్వాడీ కేంద్రాలలో సూపర్ వైజర్ ఆర్ సుజన తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమం నిర్వహించారు, ఈ కార్యక్రమంలో భాగంగా గర్భవతులకు,బాలింతలకు, తల్లి పాలు ప్రాముఖ్యత ,మరియు ప్రయోజనాలు, అదేవిధంగా పుట్టిన ఒక గంట లోపు తల్లి పాలు ప్రారంభించాలి. 6 నెలల వరకు కేవలం తల్లి పాలు మాత్రమే ఇవ్వాలి. చక్కెర నీళ్లు గానీ, పండ్ల రసాలు గాని,ఫార్ములా పాలు గాని, ఏ ఇతర పదార్థాలు గాని ఇవ్వకూడదు, తల్లీ పాలు మాత్రమే బిడ్డ కు మొదటి వ్యాధి నిరోధక టీకా, తల్లి ఉద్యోగానికి వెళ్ళినా తల్లి పాలు ఇవ్వచ్చు, తల్లీ పాలను శుభ్రమైన మూత ఉన్న పాత్ర లో నిల్వ చేసుకొని వాటిని ఫ్రిజ్ లో ఉంచి 24 గంటల్లో ఉపయోగించవచ్చు . అని తల్లులకు వివరించడం జరిగింది ఈ కార్యక్రమంలో తల్లులు,అంగన్వాడీ కార్యకర్తలు,నాగూరమ్మ, షాజిదా, ఆశా కార్యకర్త ఏ.న్ . యం పాల్గొన్నారు.



# పెండింగ్ జీతాలను వెంటనే ఇవ్వాలి

## ఏ. ఐ.టి. యు.సి నియోజవర్గ అధ్యక్షులు సి .వి.ఆర్ కుమార్

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,

స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల జీతాలను వెంటనే ఇవ్వాలని ఏఐటి యుసి నియోజకవర్గ అధ్యక్షులు సి.వి.ఆర్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 6 నెలలుగా ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే శానిటేషన్ సిబ్బందికి జీతాలు చెల్లించడం లేదన్నారు. కొత్త కాంట్రాక్టర్ క్రమం తప్పకుండా జీతాలు చెల్లించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. ఏం. ఓ.యు ప్రకారం పూర్తి జీతాలు చెల్లించాలన్నారు . .ప్రభుత్వ ఆసుపత్రి లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు ప్రతి నెల క్రమం తప్పకుండా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జీతాలు లేకపోవడం వలన కుటుంబ జీవనం అగమ్య గోచరంగా ఉందన్నారు.అనంతరం స్థానిక ఏరియా ఆసుపత్రి సూపర్నెంట్ కు వినతిపత్రం అందచేశారు.. వెంటనే జీతాలు చెల్లించక పోతే దశల వారీగా ఆందోళనలు చేపడతామని , అవసరమైతే విధులు బహిష్కరిస్తామన్నారు. జరిగే పరిణామాలకు కాంట్రాక్టర్, ఏరియా ఆసుపత్రి సూపర్డెంట్ , రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు .ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కన్వీనర్ సునీల్, చిల్లకూరు మండల కార్యదర్శి రమేష్, మెడికల్ శానిటేషన్ వర్కర్స్, తదితరులు పాల్గొన్నారు.



# అధికారులపై వైసీపీ నేత ఓవర్ యాక్షన్..!

ప్రజాభూమి ప్రతినిధి సూళ్లూరుపేట

అధికారం పోయినా అహంకారం తగ్గలేదా..? దొరవారిసత్రం మండల ట్రాన్స్కో ఏఈతో మాజీ ఎంపీటీసీ దురుసుగా వ్యవహరించిన ఘటన కలకలం రేపుతోంది. విద్యుత్ కనెక్షన్ విషయమై ట్రాన్స్కో అధికారికి ఫోన్ చేసిన మాజీ ఎంపీటీసీ, ఏఈని తీవ్ర అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు ఆయన కుటుంబ సభ్యులను ఉద్దేశించి కూడా అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఘటనపై ట్రాన్స్కో అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఘటనకు సంబంధించిన వాయిస్ రికార్డింగ్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్గా మారింది. సదరు మాజీ ఎంపీటీసీ, మాజీ ఎమ్మెల్యే కలివేటికి సన్నిహితుడిగా ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారం జిల్లాలో రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఈ ఘటనపై పలువురు ప్రజలు, "ఇలాంటి అహంకార ధోరణుల వల్లే వైసీపీకి ప్రజల్లో వ్యతిరేకత పెరిగింది" అంటూ అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారని ప్రచారం సాగుతోంది.మరోవైపు, అధికారుల పట్ల దురుసు ప్రవర్తనపై స్థానిక ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం



# "ఆధ్యా వైన్స్ బి సర్వేశ్ వైన్స్" మద్యం దుకాణాలనుతొలగించాలని.. రేణిగుంట ఎమ్మార్వో కార్యాలయం వద్ద ఐద్వా ధర్నా!

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

మండల తహసీల్దార్ కు.. మద్యం వ్యతిరేక మహిళా కార్యాచరణ కమిటీ వినతి పత్రం అందజేశారు. సోమవారం రేణిగుంట పట్టణంలో నూతనంగా పెట్టిన "ఆధ్యా వైన్స్ బి సర్వేశ్ వైన్స్" మద్యం దుకాణాలను తక్షణమే ఊరు బయటికి తరలించాలని లేనిపక్షంలో మద్యం వ్యతిరేక మహిళా కార్యాచరణ కమిటీ, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) కలసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించాల్సి వస్తుందని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కొండ్రెడ్డి ఈశ్వరమ్మ సోమవారం నాడు ధర్నా లోప్రభుత్వ ఉన్నతాధికారులను హెచ్చరించారు. సోమవారం నాడు ఉదయం 11 గంటలకు రేణిగుంట ఎమ్మార్వో కార్యాలయం వద్ద ఐద్వా ఆధ్వర్యంలో "ఆధ్యా వైన్స్ బి సర్వేశ్ వైన్స్" షాపులను రేణిగుంట పట్టణం నుండి తొలగించాలని ధర్నా చేశారు. అనంతరం మండల తహసిల్దార్ ఐ. శ్రావణ్ కుమార్ కు స్థానిక మహిళలుబి మద్యం వ్యతిరేక మహిళా కార్యాచరణ కమిటీ నాయకత్వం కలసి వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నాలో సిఐటియు మండల కన్వీనర్ సెల్వరాజ్, బిల్డింగ్ యూనియన్ మండల కార్యదర్శి రాజశేఖర్, ఆటో యూనియన్ నాయకురాలు దీపా, హేమనాథ్ పాల్గొని మద్యం వ్యతిరేక పోరాటానికి తమ సంఘం మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కొండ్రెడ్డి ఈశ్వరమ్మ, రేణిగుంట మండల అధ్యక్షురాలుబి.భారతి, తారకరామనగర్ ఐద్వా నాయకురాలు కుమారి, రేణిగుంట మద్యం వ్యతిరేక మహిళా కార్యాచరణ కమిటీ అధ్యక్షురాలు మనీలా, కార్యదర్శి పద్మవతి, టి.లక్ష్మీ, శోభారాణి, హసీనా, శారద, లక్ష్మీ, సులోచన, ప్రగతినగర్ నాయకురాలు శాంతి, మునిస్వామి, సి.పి.ఎం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ కె. హరినాథ్ పాల్గొన్నారు.



# ప్రేమించి పెళ్లి చేసుకున్న మాకు, మా చిన్నారికి ప్రాణహాని ఉంది -- దంపతుల ఆవేదన

ప్రజా భూమి ప్రతినిధి చిత్తూరు

ప్రేమించి వివాహం చేసుకున్న తమకు, తమ చంటి బిడ్డకు ప్రాణహాని ఉందని, తమ కుటుంబ సభ్యుల నుంచే బెదిరింపులు ఎదురవుతున్నాయని తవణంపల్లి మండలం ఎగువమారేడుపల్లి గ్రామానికి చెందిన దంపతులు భరత్, బిందుప్రియ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం చిత్తూరు ప్రెస్ క్లబ్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు తమ గోడును వెల్లడించారు.ఈ సందర్భంగా బిందుప్రియ మాట్లాడుతూ, తాము పరస్పర అంగీకారంతో ఏడాదిన్నర క్రితం ప్రేమ వివాహం చేసుకున్నామని తెలిపారు. అప్పటి నుంచి తన తల్లిదండ్రులు, సోదరులు, పిన్ని తదితర కుటుంబ సభ్యులు తమ దాంపత్య జీవితాన్ని అంగీకరించకుండా తన భర్త భరత్తో పాటు అత్తమామలపై కూడా పలుమార్లు దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు.గతంలో తన భర్తను కిడ్నాప్ చేసిన ఘటనపై బెంగళూరులో కేసు నమోదైందని తెలిపారు. అయినప్పటికీ తమపై వేధింపులు, బెదిరింపులు కొనసాగుతున్నాయని, ప్రస్తుతం తమతో పాటు తమ చిన్నారి ప్రాణాలకు కూడా ముప్పు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై జిల్లా పోలీసు అధికారులు వెంటనే స్పందించి తమ కుటుంబానికి రక్షణ కల్పించాలని, తమకు న్యాయం చేయాలని భరత్, బిందుప్రియ విజ్ఞప్తి చేశారు.




# నగరపాలక సంస్థకు 39 వినతులు. కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 39 వినతులు వచ్చాయని కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫోన్ ద్వారా 16 మంది, కార్యాలయంకు నేరుగా వచ్చి 23 మంది వినతులు సమర్పించి తమ సమస్యలు తెలిపారు. కాగా కొర్లగుంట దండు మారియమ్మ గుడి వద్ద మురుగునీటి కాలువ బ్లాక్ అయినది సరి చేయాలని, ఎస్. వి నగర్ లో నూతనంగా కాలువలు నిర్మించాలని, ఇందిరా నగర్ లో భూగర్భ డ్రైనేజి సమస్య పరిష్కరించాలని, ఆటో నగర్ లో కాలువలు శుభ్రం చేయించాలని, రామచంద్ర మిషన్ వద్ద హోటల్ వారు వ్యర్థాలు రోడ్లపై వేస్తున్నారు చర్యలు తీసుకోవాలని, తెలుగు నగర్లోని మసీదు వద్ద కాలువకు గోడ నిర్మించాలని, నారాయణ పురం వద్ద వీధి లైట్లు మరమ్మత్తు చేయాంచాలని, తెలుగు గంగ నీరు సక్రమంంగా సరఫరా చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, సెక్రటరీ శ్రీ విద్య, రెవిన్యూ ఆఫీసర్ సేతు మాధవ్, రవి, డి.ఈ.లు ఏసీపీ పార్వతి ప్రియ, మూర్తి, సర్వేయర్ గురువారెడ్డి, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు, మేనేజర్ హసీమ్, శానిటరీ సూపర్ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి తదితరులు పాల్గొన్నారు.



# చిత్తూరు నియోజకవర్గ కాంగ్రెస్ సమీక్షా సమావేశం ఘనంగా నిర్వహణ

ప్రజా భూమి ప్రతినిధి చిత్తూరు

చిత్తూరు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం చిత్తూరు నియోజకవర్గ సమీక్షా సమావేశం గుడిపాల మండలం వసంతాపురం పంచాయతీ తుమ్మలవారిపల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. గుడిపాల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జి. సెల్వం ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మది వానన్, శన్ముగం, రాకేష్, సుబ్రహ్మణ్యం, గుడిపాల మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా చిత్తూరు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డి. రమేష్, పూతలపట్టు నియోజకవర్గ కోఆర్డినేటర్ ప్రభాకర్ హాజరయ్యారు. అలాగే చిత్తూరు జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సుమంత్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పూర్ణచంద్ర, లోకేష్ బాబు, గణేష్, విశ్వనాథ్, సురేష్, మునిరాజా, తులసి తదితర నాయకులు పాల్గొన్నారు. సమావేశంలో చిత్తూరు నియోజకవర్గంలో పార్టీ బలోపేతం, గ్రామస్థాయిలో పార్టీ కార్యక్రమాల విస్తరణ, ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేపట్టడం, రానున్న కార్యక్రమాలను విజయవంతం చేయడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేశారు.



ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 10

మంగళవారం 04 ఆగష్టు 2026

# మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలి మాజీ మంత్రి కాకాని డిమాండ్



ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,
డీ.ఎస్సీలో జరిగిన అవకతవకలపై బాధ్యత వహిస్తూ నారా లోకేష్ రాజీనామా చేయాలని మాజీ మంత్రి మరియు వైకాపా జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు డిమాండ్ చేశారు. గూడూరు పట్టణంలోని పీ.వీ.ఆర్ కల్యాణ మండపంలో వైకాపా అద్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. డీ.ఎస్సీ స్కాం బాధ్యత వహిస్తూ నారా లోకేష్ రాజీనామా చేయాలంటూ...గూడూరు పట్టణంలోని పీ.వీ.ఆర్ కల్యాణ మండపంలో వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త బూదూరు గురవయ్య అద్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు తరలి రావడంతో పోలీసులు అడ్డుకున్నారు. ట్రాఫిక్ కు అంతరాయం కలుగుతుందంటూ ఆంక్షలు విధించడంతో పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.అక్కడి నుండి పీవీఆర్ కల్యాణ మండపానికి చేరుకున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డికి నాయకులు క్రేన్ సాయంతో భారీ గజమాలను వేసి ఘన స్వాగతం పలికారు. కల్యాణ మండపంలో జ్యోతి ప్రజ్వలన గావించారు.వైఎస్సార్ విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. గూడూరులో సభను అడ్డుకోవాలని పోలీసు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయని తెలుస్తోందన్నారు. జగన్ పేరు చెబితేనే వ్యవస్థలు వణికి పోతున్నాయని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలు అవస్థలు పడుతున్నారని, ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని పేర్కొన్నారు.తల్లికి వందనం కింద 15 వేల రూపాయలు ఇవ్వకుండా తక్కువ మొత్తంలో జమ చేశారని,ఆ మొత్తం సొమ్ము ఎక్కడికి వెళ్ళిందని ప్రశ్నించారు. డీ.ఎస్సీలో జరిగిన అవకతవకల కారణంగా యువత పెద్ద ఎత్తున నష్టపోయిందని, డీ.ఎస్సీ స్కాం కు బాధ్యత వహిస్తూ నారా లోకేష్ రాజీనామా చేయాలని కాకాణి డిమాండ్ చేశారు.ఇంకా పలువురు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ సమన్వయకర్త బూదూరు గురవయ్య,సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్ రెడ్డి, నాయకులు ఎద్దల నరేంద్ర రెడ్డి,కోడూరు కల్పలత, నాశిన నాగులు, మీరారెడ్డి,సునీల్ రెడ్డి,బత్తిని విజయకుమార్,బొమిడి శ్రీనివాసులు,మగ్దూం మొహిద్దీన్,అజీజ్ ఖాన్,గిరిబాబు పాల్గొన్నారు.

# స్థానికేతరుల పట్టాలని రద్దుచేసి స్థానికులకు ప్రభుత్వ భూమిని పంచాలి సిపిఐ డిమాండ్



ప్రజా భూమి ప్రతినిధి శ్రీ కాళహస్తి రూరల్.
శ్రీకాళహస్తి నియోజకవర్గం శ్రీకాళహస్తి రూరల్ మండలం పాత గుంట పంచాయితీలో 118 లో ఆరు ఎకరాల 20 సెంట్లు సర్వే నంబర్ 120 లో 12 ఎకరాల 80 సెంట్లు పశువుల మేత పోరంబోకు సర్వే నంబర్ 119 లో 11 ఎకరాల 62 సెంట్లు ఉన్నటువంటి భూములు మూడు ఎకరాల 45 సెంట్లు భూమిని ఈ నియోజకవర్గంలో ఉన్నటువంటి వాళ్లు కాకుండా స్థానికేతరులుసైదాపురం గ్రామస్తులు 51 సెంట్లు ఆక్రమించుకోవడం జరిగింది ఈ భూ అక్రమంలో రెవెన్యూ అధికారులు ప్రస్తుత అధికార పార్టీ నాయకులు అండదండలతో ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటున్నటువంటి వారిపై ల్యాండ్ గ్రాఫింగ్ కేసులు నమోదు చేయాలని స్థానికంగా ఉన్నటువంటి గ్రామస్తులకు ఈ ప్రభుత్వ భూములు పంచాలని సిపిఐ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నారు.



# రెండేళ్ల పాలన,ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న టీడీపీ నాయకులు



ప్రజా భూమి ప్రతినిధి
రేణిగుంట.
రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు చేపట్టిన ప్రత్యేక ఇంటింటి ప్రచార కార్యక్రమం రేణిగుంట పట్టణంలోని 170, 171 బూత్‌ల పరిధిలో సోమవారం నిర్వహించారు. రేణిగుంట మండల సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకుడు, క్లస్టర్ ఇన్‌చార్జ్ పుష్పనాదం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పుష్పనాదం మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, మహిళా సాధికారత, రైతు సంక్షేమం, యువతకు ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాలను ప్రజలకు వివరించినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రచార కార్యక్రమంలో ప్రజల సమస్యలు, వినతులను స్వీకరించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని నాయకులు హామీ ఇచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ప్రభుత్వం పారదర్శక పాలనతో అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయం చేస్తూ ముందుకు సాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో 170వ బూత్ ఇన్‌చార్జిలు నవాబ్, చిత్ర, అంబికాపతి, కన్నారెడ్డి, సాగర్, సుమన్, యూనిట్ ఇన్‌చార్జ్ జగదీష్, నిత్య పాల్గొన్నారు.

# నేటి నుండి 8 వ తేదీ వరకు శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి 78వ ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు..!





ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి:
తిరుపతి జిల్లా, చంద్రగిరి నియోజకవర్గం, పాకాల మండలం, ఊట్లవారిపల్లి సమీపంలోని ఆనందగిరి (పాల్యం కొండ)పై వెలసిన శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి 78వ ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అధికారులను ఆదేశించారు. ఆలయఈ.ఓయువరాణి,ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ నాయుడు,వివిధ శాఖల అధికారులు,ఉభయదారులు,గ్రామస్తులు,ఆలయ కమిటీ సభ్యులు మరియు ప్రజా ప్రతినిధులతో కలిసి బ్రహ్మోత్సవాల ముందస్తు ఏర్పాట్ల పై సమీక్ష సమావేశం ఎమ్మెల్యే పులివర్తి నాని నిర్వహించారు. సమావేశంలో స్థానికులు,అధికారుల నుంచి సలహాలు,సూచనలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ ఈ నెల ఆగస్టు 4వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ఐదు రోజుల పాటు జరిగే 78వ ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలను భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా వైభవంగా నిర్వహించాలన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత 76వ ఆడికృత్తిక ఉత్సవాలను మొదటిసారి ఎమ్మెల్యే హోదాలో నిర్వహించానని,ఇప్పుడు మూడోసారి కూడా అదే స్థాయిలో అత్యంత వైభవంగా ఈ 78వ బ్రహ్మోత్సవాలను జరిపిస్తున్నామని తెలిపారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రతి సంవత్సరం ఆధ్యాత్మిక విషయాల్లో ఎలాంటి రాజకీయం లేకుండా,ఆలయ అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ ఉత్సవాలను విజయవంతం చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. పాకాల మండలంలోనే అత్యంత ప్రాముఖ్యత కలిగిన ఈ ఆధ్యాత్మిక వేడుకలకు రోజు రోజుకూ భక్తుల ఆదరణ పెరుగుతోందని పేర్కొన్నారు. ఉత్సవాలకు వేలాదిగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున,ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా ఏర్పాట్లను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టాలని పోలీసు శాఖను ఆదేశించారు. గతంలో ఆలయానికి వచ్చే వాహనాలకు రోడ్డు అసౌకర్యంగా ఉండటంతో తీవ్ర ట్రాఫిక్ సమస్యలు ఎదురయ్యేవని,ఈసారి భక్తుల రాకపోకలకు ఆటంకం కలగకుండా ఒకవైపు వచ్చేందుకు,మరొకవైపు తిరిగి వెళ్లేందుకు ప్రత్యేక మార్గాలను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ప్రతి ఏటా భక్తులకు ఉచితంగా లడ్డూ ప్రసాదం అందించే ఆనవాయితీ ఉందన్న ఎమ్మెల్యే,ఈసారి కూడా ఎలాంటి నాణ్యతా లోపం లేకుండా ప్రసాదాల పంపిణీ మరియు ఉచిత అన్నదాన కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని స్పష్టం చేశారు. పాకాల మండలంతో పాటు దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఉత్సవాల ముఖ్యమైన రోజుల్లో తాను స్వయంగా ఆలయం వద్దే ఉండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తానని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వైద్య, విద్యుత్, రెవెన్యూ, పోలీస్,ఆర్టీసీ,పంచాయతీరాజ్,శానిటేషన్ తదితర అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అదనపు ఆర్టీసీ బస్సులు నడపడం,నిరంతర తాగునీటి సరఫరా,ప్రత్యేక వైద్య శిబిరాలు,పారిశుద్ధ్య నిర్వహణ,భద్రత మరియు పార్కింగ్ సౌకర్యాలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పాకాల జడ్పీటీసి నంగా పద్మజా రెడ్డి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సహకరించి బ్రహ్మోత్సవాలను ఘన విజయం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రధాన అర్చకులు హెచ్.ఎన్.కృష్ణమూర్తి శర్మ,డి.ఎల్.పి.ఓ సురేష్ నాయుడు,పాకాల ఎంపీడీఓ వాసుదేవరావు, పిటి ఎంపీడీఓ శశిరేఖ,తాసిల్దార్ కిరణ్ కుమార్,సెక్రటరీ శ్రీలేఖ,బోయపాటి నాగరాజు నాయుడు,పల్లగ కుమార్,టిడిపి సీనియర్ నాయకుడు వలపల దశరథ నాయుడు,మాజీ ఆలయ కమిటీ చైర్మన్ ఆముదుపాకల శ్రీహరి నాయుడు,సింగల్ విండో చైర్మన్ కృష్ణవేణి సావిత్రి, చిత్తూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి మండలపు వెంకటేష్ బాబు,వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు,ఆలయ కమిటీ ప్రతినిధులు,గ్రామ పెద్దలు,నాయకులు మరియు భక్తులు పాల్గొన్నారు.

# శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయానికి శాశ్విత ధర్మకర్తను నేనే- చంద్రశేఖర్ రెడ్డి



ఆలయ శాశ్విత ధర్మకర్త అరవ భూమి చంద్రశేఖర్ రెడ్డి

ప్రజా భూమి ప్రతినిధి సూళ్లూరుపేట.
చట్టబద్ధత లేని శ్రీ చెంగాళ్ళమ్మ పరమేశ్వరి ఆలయ అభివృద్ధి కమిటీ ని వ్యతిరేకిస్తున్నాను. ఆయకట్ట సర్పంచ్ గా అభివృద్ధి చేయలేని వాళ్లను, ఆలయ కమిటీ చైర్మన్ హోదాలో అభివృద్ధి చేస్తారా? ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉమ్మడి కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు అవుతున్న తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో వెలసిన శ్రీ చెంగాళమ్మ అమ్మవారి దేవస్థానం చైర్మన్ ఎంపికలో రాజకీయ సంసిద్ధత ఉన్న ఇప్పటికి సరైన నిర్ణయం తీసుకుపోవడంపై సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఉన్నా భక్తులు ఆలోచనలో పడ్డారు. శ్రీ చెంగాళమ్మ ఆలయ శాశ్విత ధర్మకర్త అరవ భూమి చంద్రశేఖర్ రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ చట్టబద్ధతలేని ఆలయ అభివృద్ధి కమిటీని నేను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నానని, కమిటీ లో ఉన్న 6 గురు సభ్యులకు ఆలయాన్ని అభివృద్ధి చేసే అనుభవం ఉందా అని ప్రశ్నించారు, శ్రీ చెంగాళమ్మ ఆలయాన్ని వేనాటి ముని రెడ్డి, వేనాటి రామచంద్రారెడ్డి,వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కొండేపాటి గంగా ప్రసాద్, రవి సన్నారెడ్డి, దువ్వూరు బాలచంద్రారెడ్డి ఇలా ఎంతోమంది అభివృద్ధి చేశారని తెలిపారు. కొంతమంది నన్ను రాజకీయంగా అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని అందుకని నేను కోర్టును ఆశ్రయించానని తెలిపారు. అమరావతిలోని హైకోర్టు నందు ఈ చైర్మన్ ఎంపిక విధానం సరైన పద్ధతిలో జరగడం లేదని పిటిషన్ వేయడం జరిగిందని తెలిపారు. శ్రీ చెంగాళ్ళమ్మ పరమేశ్వరి గుడి కి ఆలయ అభివృద్ధి కమిటీ అని ఏర్పాటు చేయడం సమంజసం చట్టబద్ధత కాదని, కోర్టులో ఉన్నప్పుడు నిర్ణయాలు తీసుకోవడం సరికాదని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ఎంపీ టిటిడి బోర్డు మెంబర్ నెలవల సుబ్రహ్మణ్యం శ్రీ చెంగాళమ్మ గుడి అభివృద్ధికి సహకరించారని తెలిపారు. ప్రస్తుతం ఆలయ కమిటీ చైర్మన్ గా ఎంపిక చేయాలని నిర్ణయిస్తున్న తిరుమూరు సుధాకర్ రెడ్డి కారిజాత గ్రామపంచాయతీలో ఆయకట్ట సర్పంచ్ గా ఉన్నారని, ఆ ఆయకట్ట సర్పంచ్ బాధ్యతనే సరిగా నిర్వర్తించలేని వ్యక్తినే ఆలయ చైర్మన్ గా దీవించడం సరైన నిర్ణయం కాదని తెలిపారు.

# మాముండూరు అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాలు వారోత్సవాలు



ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.
రేణిగుంట మండలం మాముండూరు అంగన్వాడి కేంద్రంలో రేణిగుంట స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారిని కృష్ణవేణి ఆదేశాల మేరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో ప్రగతి స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ జయలక్ష్మి మాట్లాడుతూ తల్లులు అందరూ తల్లిపాలు ఇవ్వడంలో ఎలాంటి అపోహలు వద్దని బిడ్డ పుట్టిన వెంటనే గంటలోపు ముర్రుపాలు ఇవ్వడం వలన బిడ్డ ఆరోగ్యంగా వ్యాధి నిరోధక శక్తి పెంపొందించుకుని ఎదుగుదలకు తోడ్పడుతుందని కనుక బాలింతలు ప్రభుత్వం అందించే పౌష్టికాహారం తో పాటు ఆకుకూరలు కూరగాయలు పండ్లు పాలు గుడ్లు విరివిగా తీసుకోవాలని తెలిపారు ఏఎన్ఎం నాగమణి మాట్లాడుతూ బిడ్డకు ఆరు నెలల వరకు పాలు క్రమం తప్పకుండా రోజుకు ఎక్కువసార్లు ఇవ్వాలని ఆరు నెలల తర్వాత రెండు సంవత్సరం వరకు పాలతో పాటు సమీకృత ఆహారం ఇవ్వాలని గర్భిణీ స్త్రీలు బాలింతలు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని తెలిపారు అంగనవాడి టీచర్ మధుమతి మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రానికి గర్భిణీ స్త్రీలు తప్పకుండా హాజరై ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలని కోరారు కార్యక్రమంలో గర్భిణీ స్త్రీలు బాలింతలు పాల్గొన్నారు అనంతరం తల్లిపాల వారోత్సవాలపై బ్యానర్లు పోస్టర్లతో ర్యాలీ నిర్వహించారు.




# "శిశు వికాస్ యోజన"ను సద్వినియోగం చేసుకోండి

## హెడ్మాస్టర్ సుజాతచే సభ్యత్వ పత్రం అందజేత




ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి
ఒకటి నుంచి పదవ తరగతి లోపు విద్యార్థులకు సి ఎస్ ఆర్ ఫండ్స్ ద్వారా శిశు వికాస్ యోజన పథకం అందించే సౌకర్యాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తుమ్మవానికుంట హెడ్మాస్టర్ సుజాత పేర్కొన్నారు. పివిఆర్ గ్రూప్ ఆర్గనైజేషన్ చే ఆ పాఠశాలకు చెందిన డింపుల్, సాయి తేజలకు శిశు వికాస్ యోజన సభ్యత్వ పత్రాన్ని అందజేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ప్రతినిధులు రాష్ట్ర సూపర్వైజర్ వెంకటరమణ, కోఆర్డినేటర్ లక్ష్మయ్య, జిల్లా ఇంచార్జ్ సుకుమార్ రాజులు మాట్లాడుతూ శిశు వికాస్ యోజన ప్రయోజనాలను వివరించారు. సభ్యత్వం పొందిన ప్రతి విద్యార్థి ఏడాదిలో చికిత్స కోసం 25 వేల గ్రాంటు, ఉన్నత విద్య కోసం ఐదు లక్షల స్కాలర్షిప్, మూడులక్షల ప్రాణ నష్టపరిహారం లతోపాటు ఐదు నుంచి 10వ తరగతి వరకు ప్రతి ఏటా 3000 నుంచి 5000 వరకు స్కాలర్షిప్లు, 21 సంవత్సరాల తరువాత ఐదు సంవత్సరాల పాటు ఏటా రెండు లక్షల వరకు వడ్డీ లేని రుణం అందజేస్తారని వివరించారు. ఎన్రోల్ కావడానికి విద్యార్థి ఆధార కార్డు, పాస్పోర్ట్ సైజ్ ఫోటో, తల్లితండ్రుల ఆధార కార్డు పాన్ కార్డ్ బ్యాంక్ పాస్బుక్ జిరాక్స్ కాపీలు అందజేసి ఫ్యామిలీ గ్రూప్ ఫోటో తో సభ్యత్వం పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో వీరితోపాటు హెడ్మాస్టర్ ప్రవీణ్, కంప్యూటర్ ఆపరేటర్ వి ధరణి పతి, కోఆర్డినేటర్లు ప్రసన్న కుమారి, రాజేశ్వరి, ఉమాపతి ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# చిట్టత్తూరు గ్రామంలోఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం

## ప్రజల్లోకూటమి ప్రభుత్వంపై ఉన్న ఆదరణ అర్థమవుతుంది : ఎమ్మెల్యే పులివర్తి నాని



ప్రజా భూమి ప్రతినిధి
రామచంద్రపురం
రామచంద్రాపురం మండలం చిట్టత్తూరు-కాలేపల్లి పంచాయతీలోని చిట్టత్తూరు, చిట్టత్తూరు హరిజనవాడలో ఎమ్మెల్యే పులివర్తి నాని అధ్యక్షతన "2 ఏళ్ల నమ్మకం... అభివృద్ధి... సంక్షేమ" కార్యకమం ప్రారంభం. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పులివర్తి నానికి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించిన ఎమ్మెల్యే ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ సంక్షేమ పథకాల అమలుపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. "కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదు... పనులు చేసి చూపించే ప్రభుత్వం" అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం పంచాయతీలోని సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకొని ..... త్వరితగతిన పరిస్కరిస్తా అని తెలియజేశారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# రేణిగుంట సంత సమీపంలో హత్యాయత్నం కేసు ఛేదన

## నిందితుడి అరెస్ట్.. కత్తి, మొబైల్ స్వాధీనం

ప్రజాభూమి ప్రతినిధి రేణిగుంట.
రేణిగుంట, ఆగస్టు 3: రేణిగుంట సంత సమీపంలో ఇటీవల జరిగిన హత్యాయత్నం కేసును గాజులమండ్యం పోలీసులు త్వరితగతిన ఛేదించి నిందితుడిని అరెస్టు చేశారు. ఈ మేరకు రేణిగుంట రూరల్ సీఐ ఎం. మంజునాథ రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. రామకృష్ణాపురం గ్రామానికి చెందిన ఆర్. కుమార్ (44) గతంలో తనతో సహజీవనం చేసిన మహిళ తన ఫోన్ నంబర్‌ను బ్లాక్ చేయడంతో ఆమెపై కక్ష పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో ఆగస్టు 1న రేణిగుంట సంత సమీపంలో ఆమెపై కత్తితో దాడి చేసినట్లు విచారణలో అంగీకరించినట్లు తెలిపారు. క్రైమ్ నెం.104/2026 కింద భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్లు 109(1), 79 ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాలు, రేణిగుంట డీఎస్పీ వై. శ్రీనివాసరావు పర్యవేక్షణలో నిందితుడిని అరెస్టు చేశారు. నిందితుడి ఒప్పుకోలు మేరకు దాడికి ఉపయోగించిన కత్తి, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని న్యాయస్థానంలో హాజరుపరచగా, కోర్టు రిమాండ్ విధించింది. కేసును వేగంగా ఛేదించిన గాజులమండ్యం పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఉన్నతాధికారులు అభినందించారు.




# ఇంటింటి కార్యక్రమంలో పాల్గొన్న పేరం నాగరాజు నాయుడు





ప్రజా భూమి ప్రతినిధి ఏర్పేడు.
ఏర్పేడు మండలం లో మాధవమాల, ఇసుకతగేలి , పాత వీరాపురం గ్రామాలలో టీడీపీ పార్టీ ఇంటింటి కార్యక్రమం లో పాల్గొన్న మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు పేరం నాగరాజ నాయుడు, శివశంకర్ రెడ్డి, మోహన్ నాయుడు, సూరి నాయుడు, మహేష్ రెడ్డి,క్లస్టర్ రాఘవేంద్ర , యూనిట్స్ కేశినేని సుబ్రమణ్యం ఉ మధు రెడ్డి,చంద్ర రెడ్డి, కేకే రమణ, గుణా యాదవ్, మునిరంగారెడ్డి, కె రవి, కె దొరస్వామి,హంస, కుమారస్వామి,వై మనోహర్ నాయుడు, పాల్గొని ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం చేసినటువంటి అభివృద్ధిని గురించి ప్రజలకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భారీ ఎత్తున టిడిపి నాయకులు, గ్రామ ప్రజలు, కూటమి కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

# సుబ్రహ్మణ్యం కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే పులివర్తి నాని



ప్రజా భూమి ప్రతినిధి
రామచంద్రపురం
రామచంద్రాపురం మండలం రాయలచెరువు పేటలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న టీడీపీ కార్యకర్త సుబ్రహ్మణ్యం కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే పులివర్తి నాని స్థానిక నాయకులతో కలిసి సుబ్రమణ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మృతుని భార్య నిర్మల, కుమారుడు ప్రశాంత్ కుమార్, కుమార్తె జయలక్ష్మిలను ఓదార్చి ధైర్యంగా ఉండాలని తెలిపారు. వారి కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటూ... అన్ని విధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు,గ్రామస్తులు, సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# అందుబాటులో ఉండని రెవెన్యూ యంత్రాంగం..!

## -ప్రజా సమస్యల పరిష్కార వేదిక రోజునే వెలవెలబోయిన తహసీల్దార్ కార్యాలయం

## -కార్యాలయం చుట్టూ తిరుగుతున్న బాధితులు

ప్రజాభూమి, హిందూపురం టౌన్
హిందూపురం రూరల్ మండలం తూముకుంట గ్రామానికి చెందిన ఉప్పర సిద్ధమ్మ సర్వే నంబర్ 53-4 లో 85 సెంట్లు విస్తీర్ణం భూమి ఉందని సర్వే నిర్వహించి తన భూమిని చూపించాలని గత నెల రోజుల నుంచి రెవెన్యూ న్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతోంది..చౌళూరు పంచాయతీ రామచంద్రాపురం గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ సుమారు ఒక సంవత్సరానికి పైగా తన భూమి ఇతరుల కబ్జా ఉందని, సర్వే నిర్వహించి హద్దులు చూపించాలని రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఇప్పటికి న్యాయం జరగలేదు.... ఇలా సిద్ధమ్మ, లక్ష్మి నారాయణప్పలే కాదు ఇలాంటి వారు ఏంతో మంది కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అధికారులు అందుబాటులో ఉండరు... ఉన్న సమయంలో ఏదో ఒకటి చెప్పి వారిని పంపుతున్నారు....ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా, ఒకే వేదికపై సమస్యలకు పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తోంది. అన్ని శాఖల అధికారులు ఒకే చోట అందుబాటులో ఉండి ప్రజల వినతులు స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నదే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. అయితే హిందూపురం మండలంలో ఈ లక్ష్యం క్షేత్రస్థాయిలో ఎంతవరకు అమలవుతోంది, ప్రజలకు నిజంగా రెవెన్యూ సేవలు సకాలంలో అందుతున్నాయా.. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో కనిపించిన పరిస్థితులు ఈ ప్రశ్నలకు ఆందోళన కలిగించే సంకేతాలుగా మారాయి. సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉన్నప్పటికీ, కేవలం తొమ్మిది శాఖల అధికారులు మాత్రమే హాజరైనట్లు తెలిసింది. వారిలో ముగ్గురు అధికారులు హాజరు నమోదులో సంతకాలు చేసి వెళ్లిపోయారని అక్కడికి వచ్చిన పలువురు పేర్కొన్నారు. మిగిలిన కొద్దిమంది అధికారులు మాత్రమే అందుబాటులో ఉండడంతో, పలు శాఖలకు సంబంధించిన సమస్యలతో వచ్చిన ప్రజలు సంబంధిత అధికారులను కలవలేక వెనుదిరిగిన పరిస్థితులు కనిపించాయి...

**రెవెన్యూ సమస్యలతో వచ్చిన వారికి నిరాశ**

ప్రజా సమస్యల పరిష్కార వేదిక రోజున అత్యధికంగా రెవెన్యూ సమస్యలే నమోదవుతుంటాయి. భూమి సర్వేలు, హద్దుల నిర్ధారణ, పట్టాదార్ పాస్‌బుక్‌లు, మ్యూటేషన్లు, వారసత్వ మార్పులు, ఆదాయ,కుల ధ్రువీకరణ పత్రాలు, ఆక్రమణల ఫిర్యాదులు వంటి అనేక సమస్యలతో మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు ఉదయం నుంచే తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుంటారు. సంబంధిత అధికారులు అందుబాటులో ఉంటారని, తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశతో వచ్చిన వారికి మాత్రం ఈసారి తీవ్ర నిరాశ ఎదురైంది. ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరుగుతున్న రోజునే తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌తో పాటు ఇతర రెవెన్యూ అధికారులు కోర్టు విధుల నిమిత్తం జిల్లా కేంద్రానికి వెళ్లడంతో కీలక సేవలు నిలిచిపోయినట్లు కనిపించింది. అధికారులు లేకపోవడంతో ప్రజలు తమ వినతిపత్రాలను ఎవరికి ఇవ్వాలో తెలియక కార్యాలయం చుట్టూ గంటల తరబడి నిరీక్షించారు. కొందరు ఇప్పటికే పలుమార్లు వచ్చినప్పటికీ మళ్లీ రావాలని చెప్పడంతో అసహనం వ్యక్తం చేశారు. భూమి సర్వేలు నిర్వహించాలని నెలల తరబడి ఎదురు చూస్తున్న బాధితులు, ఆక్రమణలపై ఫిర్యాదులు చేసిన రైతులు, ధ్రువీకరణ పత్రాల కోసం వచ్చిన విద్యార్థులు, ఇతర రెవెన్యూ సేవల కోసం వచ్చిన వృద్ధులు, మహిళలు ఇలా వివిధ వర్గాల ప్రజలు ఒకేరోజు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమస్యలు పరిష్కారం కాకపోవడమే కాకుండా, అధికారులను కలిసే అవకాశం కూడా లేకపోవడంతో పలువురు నిరాశతో వెనుదిరిగారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఉద్దేశం ప్రజలకు ఒకేరోజు, ఒకేచోట సేవలు అందించడం. అయితే కీలక అధికారులు అందుబాటులో లేకపోవడం వల్ల ఆ లక్ష్యం ఎంతవరకు నెరవేరుతోందనే ప్రశ్నలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.



**వీరిద్దరే కాదు... ఇంకా ఎందరో**

తూమకుంట గ్రామానికి చెందిన ఉప్పర సిద్ధమ్మ, రామచంద్రాపురానికి చెందిన లక్ష్మీనారాయణ మాత్రమే కాదు. హిందూపురం మండలంలోని పలు గ్రామాలకు చెందిన అనేక మంది ప్రజలు ఇదే తరహా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు కార్యాలయానికి వచ్చే బాధితులు చెబుతున్నారు. భూమి సర్వేలు, హద్దుల నిర్ధారణ, మ్యూటేషన్లు, పట్టాదార్ పాస్‌బుక్‌లలో మార్పులు, వారసత్వ నమోదు, ఆక్రమణల ఫిర్యాదులు, ఆదాయ,కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు, భూ రికార్డుల సవరణలు వంటి వివిధ రెవెన్యూ సేవల కోసం ప్రజలు పదేపదే తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోందని వాపోతున్నారు. మండలంలోని మారుమూల గ్రామాల నుంచి ఆటోలకు, బస్సులకు డబ్బులు ఖర్చు చేసి కార్యాలయానికి వచ్చిన ప్రజలకు చాలా సందర్భాల్లో అధికారులు అందుబాటులో లేకపోవడం లేదా సంబంధిత అధికారి లేరని చెప్పి వెనక్కి పంపుతున్నారని బాధితులు పేర్కొంటున్నారు. కొందరికి ఫైల్ పరిశీలనలో ఉంది, సర్వేయర్ అందుబాటులో లేరు, తహసీల్దార్ వచ్చిన తర్వాత చూస్తాం, మరోసారి రండి వంటి సమాధానాలు తరచూ వినిపిస్తున్నాయని ఆరోపిస్తున్నారు. దీంతో ఒక పని కోసం పలుమార్లు కార్యాలయానికి రావాల్సి రావడం వల్ల సమయం, ప్రయాణ ఖర్చు, కూలి నష్టం భరించాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రైతులు వ్యవసాయ పనులను పక్కనబెట్టి, వృద్ధులు ఇబ్బందులు పడుతూ, మహిళలు చిన్నపిల్లలతో కలిసి కార్యాలయానికి వచ్చినా అదే పరిస్థితి ఎదురవుతోందని చెబుతున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక రోజునైనా తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందనే ఆశతో వచ్చిన ప్రజలు కూడా నిరాశతో వెనుదిరుగుతున్న దృశ్యాలు తరచూ కనిపిస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ పరిస్థితుల వల్ల రెవెన్యూ కార్యాలయంపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని, పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి, భూమి సర్వేలు, హద్దుల నిర్ధారణ వంటి అంశాలకు నిర్దిష్ట గడువు నిర్ణయించి పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**తహసీల్దార్ అందుబాటుపై ఆరోపణలు**

హిందూపురం మండల తహసీల్దార్ కార్యాలయంలో ప్రజలకు సకాలంలో సేవలు అందడం లేదన్న విమర్శలు ఇటీవల ఎక్కువగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా భూమి సర్వేలు, హద్దుల నిర్ధారణ, మ్యూటేషన్లు, పట్టాదార్ పాస్‌బుక్‌లు, ఆక్రమణల ఫిర్యాదులు వంటి అంశాలపై ప్రజలు తరచూ కార్యాలయానికి వస్తున్నప్పటికీ, తహసీల్దార్‌ను నేరుగా కలిసే అవకాశం చాలా అరుదుగా లభిస్తోందని పలువురు బాధితులు చెబుతున్నారు. ప్రజల వాదన ప్రకారం, తహసీల్దార్ తరచూ కోర్టు విచారణలు, అధికారిక సమావేశాలు, సమీక్షలు, ఇతర పరిపాలనా కార్యక్రమాల నిమిత్తం కార్యాలయానికి దూరంగా ఉంటున్నారు. దీంతో సాధారణ ప్రజలు పలుమార్లు కార్యాలయానికి రావాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు నెలల తరబడి ఒకే సమస్యపై పలుమార్లు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా తుది నిర్ణయం వెలువడడం లేదని చెబుతున్నారు. ముఖ్య అధికారి అందుబాటులో లేకపోవడంతో కింది స్థాయి రెవెన్యూ సిబ్బంది కూడా కీలక నిర్ణయాలు తీసుకోలేక, తహసీల్దార్ వచ్చిన తర్వాత చూస్తాం, మరో రోజు రండి అంటూ ప్రజలను వెనక్కి పంపుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫలితంగా చిన్న చిన్న రెవెన్యూ పనులు కూడా రోజుల తరబడి, కొన్ని సందర్భాల్లో నెలల తరబడి పెండింగ్‌లోనే ఉంటున్నాయని బాధితులు వాపోతున్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక రోజునైనా తహసీల్దార్ పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటే ప్రజల సమస్యలకు వేగంగా పరిష్కారం లభించే అవకాశం ఉంటుందని మండల ప్రజలు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత రెవెన్యూ అధికారుల వివరణ తీసుకుంటే పూర్తి చిత్రం మరింత స్పష్టమవుతుంది.

**కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారిస్తారా,**

హిందూపురం మండల రెవెన్యూ కార్యాలయంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉందని మండల ప్రజలు కోరుతున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక రోజున అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా పూర్తిస్థాయిలో హాజరై, కార్యక్రమం ముగిసే వరకు ప్రజలకు అందుబాటులో ఉండేలా స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అదేవిధంగా తహసీల్దార్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న భూమి సర్వేలు, హద్దుల నిర్ధారణ, మ్యూటేషన్లు, పట్టాదార్ పాస్‌బుక్‌ల మార్పులు, ఆక్రమణల ఫిర్యాదులు, వారసత్వ నమోదు వంటి దరఖాస్తులపై ప్రత్యేక సమీక్ష నిర్వహించి, వాటి పరిష్కారానికి నిర్దిష్ట గడువు నిర్ణయించాలని ప్రజలు కోరుతున్నారు. ఎంతకాలంగా ఏ దరఖాస్తు పెండింగ్‌లో ఉంది, ఆలస్యానికి కారణాలేమిటి, బాధ్యులెవరు అనే అంశాలపై సమగ్ర విచారణ చేపట్టి, అవసరమైతే ప్రత్యేక బృందాలను నియమించి సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరయ్యే ప్రతి శాఖాధికారి హాజరు, ప్రజలు సమర్పించిన వినతుల సంఖ్య, అక్కడికక్కడే పరిష్కారమైన దరఖాస్తులు, పెండింగ్‌కు వెళ్లిన అంశాలపై పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలని కూడా ప్రజలు సూచిస్తున్నారు. కార్యక్రమం కేవలం హాజరు నమోదుకు పరిమితం కాకుండా, ప్రజలకు ఫలితాలు అందించే వేదికగా మారాలని కోరుతున్నారు. రెవెన్యూ సేవల కోసం కార్యాలయానికి వచ్చే రైతులు, వృద్ధులు, మహిళలు, విద్యార్థులు అనవసరంగా పలుమార్లు తిరగాల్సిన పరిస్థితి లేకుండా సేవల అందజేతను మరింత జవాబుదారీతనంతో నిర్వహించాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. మండల రెవెన్యూ వ్యవస్థ పనితీరుపై జిల్లా స్థాయిలో ప్రత్యేక సమీక్ష నిర్వహించి, లోపాలు ఉంటే వాటిని సరిదిద్దే చర్యలు తీసుకుంటేనే ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని స్థానికులు భావిస్తున్నారు.

# హరిత ఫౌండేషన్ సేవలు ఎంతో విలువైనవి

ప్రజాభూమి పోరుమామిళ్ల :
విద్యారంగంతో పాటు,పలు సామాజిక సేవాకార్యక్రమాలలో హరిత ఫౌండేషన్ అందిస్తున్న సేవలు ఎంతో విలువైనవని ఎంఈఓ ఎస్.మస్తాన్ వలి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శామ్యూల్ డేవిడ్ రాజు పేర్కొన్నారు. హరిత ఫౌండేషన్ ప్రతినిధి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బి.పరిమళ జ్యోతి ఆధ్వర్యంలో కలసపాడు లోని బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్.వి. రమణయ్య అధ్యక్షతన నిర్వహించిన "మై వాయిస్" కార్యక్రమంలో భాగంగా మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులకు "దేశాభివృద్ధిలో ఇస్రో పాత్ర'అనే అంశంపై వక్తృత్వపు పోటీలు నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ మరియు




ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సమాజ అభివృద్ధి కోసం హరిత ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. విద్యార్థులు ఇలాంటి పోటీలలో పాల్గొని తమ ప్రతిభతో రాణించాలన్నారు. ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ ఎలిమెంటరీ టీచర్స్ ఆర్గనైజేషన్ (ఏఐఎఫ్ఇటిఓ) జాతీయ కార్యదర్శి వి.రమణారెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాలలోని విద్యార్థినీ,విద్యార్థుల ప్రతిభను వెలికి తీసి ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యతను



సమాజానికి చాటి చెప్పడంలో ఫౌండేషన్ చేస్తున్న కృషి ఎంతో విలువైనది అన్నారు. అదేవిధంగా పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు పంపిణీ, వైద్య సహకారం, యువతకు క్రీడా సామాగ్రి పంపిణీ తదితర అంశాలలో హరిత ఫౌండేషన్ చేస్తున్న కృషి ఆదర్శనీయమన్నారు. ఫౌండేషన్ తరపున మండల ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికైన గంగాయపల్లె ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సి.వీరారెడ్డిని మెమెంటోతో అభినందించారు. విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం మారుమూల ప్రాంతంలో పనిచేస్తూ, నిబద్ధత గల ఉపాధ్యాయుడుగా వీరారెడ్డి గుర్తింపు పొందారన్నారు. వక్తృత్వపు పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచిన జడ్పీ హైస్కూల్ తెల్లపాడు విద్యార్థిని కె.గురు జైష్ణవి,ద్వితీయ స్థానంలో నిలిచిన బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని సృజన లక్ష్మీ, తృతీయ స్థానం పొందిన తెల్లపాడు విద్యార్థిని బి.కళ్యాణి లకు నగదు ప్రోత్సాహకాలతో పాటు, మెమెంటో, ప్రశంసాపత్రం అందజేయడమైనది.పోటీలలో పాల్గొన్న విద్యార్థులందరికీ నోటు పుస్తకాలు, మెమెంటో,ప్రశంసా పత్రాలు అందజేయడం జరిగినది.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీదేవి,గురు లక్ష్మి,బేబీసరోజ,గఫార్,ప్రభు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# స్వమాక్స్ కార్యాలయంలో డ్రాయింగ్ మరియు కాలిగ్రఫీ పైశిక్షణా తరగతులు..!

ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి:
పిల్లల్లో సృజనాత్మకత, ఊహాశక్తి మరియు కళాత్మక నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో స్వమాక్స్ కార్యాలయంలో డ్రాయింగ్ మరియు కాలిగ్రఫపై శిక్షణా తరగతులు ఉత్సాహభరితంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో వివిధ ట్యూషన్ సెంటర్ల మరియు వివిధ గ్రామాలకు చెందిన 40 మంది విద్యార్థులతో పాటు ట్యూషన్ ఉపాధ్యాయులు కూడా పాల్గొన్నారు.శిక్షణలో భాగంగా హరికృష్ణ మరియు అంజప్ప డ్రాయింగ్‌కు సంబంధించిన ప్రాథమిక అంశాలు, చిత్రాలను సులభంగా గీయడం, ఆకారాలు, గీతల వినియోగం, రంగుల సమన్వయం వంటి విషయాలను వివరించారు. అలాగే కాలిగ్రఫీ ద్వారా అందమైన చేతిరాతను ఎలా అభివృద్ధి చేసుకోవాలో ప్రాయోగికంగా నేర్పించారు.అనంతరం స్వమాక్స్ సంస్థ సీఈఓ విశ్వనాథ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, డ్రాయింగ్ అనేది కేవలం ఒక కళ మాత్రమే కాదని, అది ఆలోచనలను వ్యక్తపరచే అద్భుతమైన సాధనమని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి డ్రాయింగ్‌ను ఒక మంచి అలవాటుగా చేసుకోవాలని, ప్రతిరోజూ కొంత సమయం కేటాయించి చిత్రాలు గీయడం ద్వారా ఏకాగ్రత, సృజనాత్మకత మరియు ఆత్మవిశ్వాసం పెరుగుతాయని సూచించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రధానోపాధ్యాయులు చంద్రముని విద్యార్థులకు డ్రాయింగ్ ప్రాముఖ్యతను వివరించారు. విద్యతో పాటు కళలను కూడా అభ్యసించడం వల్ల పిల్లల వ్యక్తిత్వ వికాసం, పరిశీలనా శక్తి, సృజనాత్మక ఆలోచనలు మరింత మెరుగుపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమం లో టీచర్స్ ఊహ,అనిత, సుచిత్ర, అఖిల,మరియు డైరెక్టర్స్ జగదీశ్వరి, ఫరీదా తదితరులు పాల్గొన్నారు.




# పిటీషన్ల పరిష్కారంలో చట్టబద్ధమైన న్యాయం జరిగేలా చర్యలు

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం
జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహణ 102 పిటీషన్లు స్వీకరణ పిటీషనర్లు, వెంట వచ్చిన ప్రజలకు ఇస్కాన్ సహకారంతో ఉచిత భోజనం ప్రజా సమస్యల పరిష్కారంలో వేగాన్ని పెంచి, ప్రతి ఫిర్యాదుకు చట్టబద్ధమైన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎస్పీ పి. జగదీష్ తెలిపారు. జిల్లా ప్రజలకు పారదర్శకమైన, ప్రజలకు చేరువయ్యే ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను అందించడమే తమ ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో ఆయన పాల్గొని, ప్రజల నుంచి స్వయంగా 102 వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాధితుల నుంచి వచ్చిన ప్రతి పిటిషన్‌నూ బాధ్యతాయుతంగా విచారించాలని అధికారులను



ఆదేశించారు. ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదులను వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్లకు పంపి, నిర్దేశిత గడువులోగా విచారణ పూర్తి చేయాలన్నారు. పిటీషనర్లకు సమాచారం ఫిర్యాదుపై విచారణ పూర్తయిన తర్వాత సంబంధిత పిటిషనర్‌కు తప్పనిసరిగా సమాచారం అందించి, వారి సంతృప్తిని నిర్ధారించుకోవాలి. చట్ట పరిధిలో శాశ్వత పరిష్కారం సమస్యలు మళ్లీ పునరావృతం కాకుండా చట్ట పరిధిలో శాశ్వత పరిష్కారం చూపించేలా అధికారులు దృష్టి సారించాలి. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా పోలీస్ సిబ్బంది సేవాభావంతో పనిచేయాలని ఎస్పీ సూచించారు. కాగా, ఎస్పీ కార్యాలయానికి వచ్చిన బాధితులకు దరఖాస్తుల నమోదులో సిబ్బంది పూర్తి సహాయ సహకారాలు అందించారు. జిల్లా ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ ఎం.నాగభూషణం పిటీషనర్ల నుండి పిటీషన్లు స్వీకరించారు.

# ఎమ్మెల్యే విరుపాక్షిని అరెస్ట్ చేయడం అనాగరికం - దాసరి చంద్రమౌళి

ప్రజాభూమి,పులివెందుల
ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి ఇంట్లోకి పోలీసులు అర్ధరాత్రి చొరబడి అరెస్ట్ చేయడం దుర్మార్గమైన చర్య అని మాజీ మునిసిపల్ కోఆప్షన్ సభ్యుడు, వాల్మీకి నాయకుడు దాసరి చంద్రమౌళి మండిపడ్డారు.సోమవారం విలేకరులతో మాట్లాడిన ఆయన, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ప్రజల కోసం పరిపాలన చేయకుండా రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ వైసీపీ నాయకులపై కక్ష సాధిస్తోందని ఆరోపించారు. జగన్ ప్రభుత్వంలో బీసీల అభ్యున్నతి కోసం 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, సర్పంచ్ నుండి ఎంపీ వరకు అవకాశాలు కల్పించారని, కానీ కూటమి ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని విమర్శించారు.కక్షపూరిత రాజకీయాలు మాని సుపరిపాలన అందించాలని, లేనిపక్షంలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హితవు పలికారు.



# ఎల్నినో ప్రభావిత పొలాలను సందర్శించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు

ప్రజాభూమి,పులివెందుల
ఎల్నినో వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పులివెందుల మండలంలోని అచ్చవెల్లి, ఉలిమెల్ల, ఈకొత్తపల్లి, ఎర్రబల్లి గ్రామాల్లో వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం క్షేత్రస్థాయి సందర్శన నిర్వహించింది. ఉటుకూరు వ్యవసాయ పరిశోధనా స్థానం, పులివెందుల వ్యవసాయ కళాశాల, వ్యవసాయ శాఖ సంయుక్తంగా డా. ప్రభాకర్ రెడ్డి, డా. సునీల్ కుమార్ ఆధ్వర్యంలో రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఎల్నినో పరిస్థితుల్లో తక్కువ కాల వ్యవధి పంటలు సాగు చేయాలని, నేల తేమ సంరక్షణ పద్ధతులు పాటించాలని, వర్షాభావ పరిస్థితుల్లో పంట నిర్వహణ, నీటి వినియోగ సామర్థ్యం పెంచే చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. తక్కువ నీటితో అధిక దిగుబడి ఇచ్చే పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు.అనంతరం ఉలిమెల్ల గ్రామంలో పొలాలను పరిశీలించి రైతులతో చర్చించి శాస్త్రీయ సూచనలు అందించారు.కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు ప్రభాకర్ రెడ్డి,మండల వ్యవసాయ అధికారి చెన్నారెడ్డి వ్యవసాయ కళాశాల అధ్యాపకులు, రైతులు పాల్గొన్నారు.




# శ్రీ వృషభాచలేశ్వర స్వామి ఆలయ ప్రాకార నిర్మాణానికి సీజీఎఫ్ నిధులు మంజూరు చేయాలి

## - దేవాదాయ శాఖ ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రం అందజేసిన ఆలయ ప్రతినిధులు

ప్రజాభూమి, వేంపల్లె
స్థానిక పాపాఘ్ని నది ఒడ్డున ఎద్దులకొండపై వెలసిన శ్రీ వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం ఆలయం చుట్టూ ప్రాకార నిర్మాణానికి సీజీఎఫ్ నిధులు మంజూరు చేయాలని ఆలయ ప్రతినిధులు దేవాదాయ శాఖ ఉన్నతాధికారులను కోరారు. టిడిపి పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి మా రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రవి) సిఫారసు మేరకు ఆలయ కార్యనిర్వాహణాధికారి కె. సుభాష్, ఆలయ పాలకమండలి చైర్మన్ పీవీ. రమణ, ఆలయ కమిటీ సభ్యుడు నాగిశెట్టి సునీల్, ఆలయ ముఖ్య అర్చకులు పి. హరి ప్రవీణ్ విజయవాడలో దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, అదనపు కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్, రీజినల్ జాయింట్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేషీలోని వ్యక్తిగత సహాయకుడిని (పీఏ) కలిసి సీజీఎఫ్ నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.



# మున్సిపల్ స్థలంలో అక్రమ నిర్మాణాలు - చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాభూమి,పులివెందుల
కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన మెయిన్ పోస్ట్ ఆఫీస్ ముందే మున్సిపల్ స్థలాన్ని ఆక్రమించి అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.రాజారెడ్డి కాలనీ సమీపంలోని నూతన పోస్ట్ ఆఫీస్ ఎదుట కొందరు వ్యక్తులు దుకాణాల నిర్మాణానికి పునాదులు వేయడంతో స్థానికులు "ఇదేం ఖర్మ రా బాబు" అంటూ మండిపడుతున్నారు. కోట్లతో కట్టిన ప్రభుత్వ భవనానికి వచ్చే కస్టమర్లకు కనీసం ద్విచక్ర వాహనాలు పెట్టుకునే పార్కింగ్ స్థలం కూడా మిగలడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంత ఖర్చుతో కట్టిన పోస్ట్ ఆఫీస్ భవనమే కనిపించకుండా ఈ అక్రమ కట్టడాలు వస్తున్నాయని అంటున్నారు.అధికారుల అండదండలతోనే ఇవి జరుగుతున్నాయా? లేక నిర్లక్ష్యమా? అర్థం కావడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ అధికారులకు వాటాలు ఏమైనా ఉన్నాయా?" అంటూ సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వ ఆస్తులను కాపాడి, అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని పోస్టల్, మున్సిపల్ అధికారులను ప్రజలు కోరుతున్నారు.



# ముఖ్యమంత్రి ఆశయాలు.. ఆకాంక్షలకు అనుగుణంగా పార్టీ బలోపేతానికి ఐక్యతతో ముందుకు..

ప్రజా భూమి ప్రతినిధి సత్యవేడు.
ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమని సత్యవేడు నియోజకవర్గం లో విస్తృతంగా చేపడుతున్న కోనేటి సుమన్ (నారాయణ మనం జెడ్పిటిసి, జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యులు, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షులు) ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారధ్యంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో చేపడుతున్న సంక్షేమాభివృద్ధి ప్రజలకు వివరించడానికే ఇంటింటికి టిడిపి కార్యక్రమం... కోనేటి సుమన్. సంక్షేమ పథకాల లబ్ధిదారుల చిరునవ్వే మా ప్రచార అస్త్రాలు. లిరాష్ట్రవ్యాప్తంగా రాష్ట్ర ప్రయోజనాల కోసం జరుగుతున్న అభివృద్దే.... మా కరపత్రాలు.స్థానిక ఎన్నికల్లో సత్యవేడు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ జెండాను రెపరెపలాడిస్తాం... రాష్ట్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం బలమైన సంకల్పాన్ని ప్రజలకు వివరిస్తాం.



# ఇంటింటికీ 'కూటమి' సంక్షేమం..

## కృష్ణా జిల్లాలో హోరెత్తిన ప్రచారం

'రెండేళ్ల పాలనలో సాధించిన అపూర్వ అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రతి ముంగిటకూ చేర్చడమే కూటమి ప్రభుత్వ ధ్యేయం



గోపు సత్యనారాయణ, కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి

మచిలీపట్నం రూరల్ ప్రజాభూమి ప్రతినిధి

మచిలీపట్నం మండలం తల్లాపాలెం పంచాయతీ పరిధిలోని రాయపల్లి, గంటవారిపాలెం, ఊసావారిపాలెం, గౌడ సత్తెనపాలెం గ్రామాల్లో సోమవారం ప్రచార కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలో చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరిస్తూ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజలతో నేరుగా ముఖాముఖి నిర్వహించారు.ప్రచారంలో ముఖ్యమైన ముఖ్యాంశాలు:ప్రజా సంక్షేమమే పరమావధి: గడిచిన రెండేళ్లలో ప్రవేశపెట్టిన విప్లవాత్మక పథకాలు, అందించిన సేవలను ప్రజలకు సమగ్రంగా వివరించారు.నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం: ప్రజలు ఉంచిన విశ్వాసానికి కట్టుబడి, రాబోయే రోజుల్లో రాష్ట్ర సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా మరిం త వేగంగా పాలన సాగిస్తామని స్పష్టం చేశారు.కార్యకర్తలకు దిశానిర్దేశం: ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్కరికీ చేరేలా కూటమి శ్రేణులు నిరంతరం ప్రజల్లోనే ఉంటూ అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య నాయకులు:ఈ విస్తృత ప్రచార కార్యక్రమంలో కూటమి ప్రముఖ నాయకులు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.లంకె శేషగిరిరావుకొనకళ్ల నాగరాజుజొన్నల సూర్యకొక్కిలిగడ్డ జయకృష్ణఅడ్డాల రామాంజనేయులువంకా సురేష్వంకా వీరనాగేశ్వరరావుగంటా ముత్యాలరావుజొన్నల బాబురావుశ్రీకాకుళపు బాబుమోధుముడి దుర్గమద్దాల రమణవేంపా శ్రీను , కూటమి నాయకులు, కార్యకర్తలు.

## పీఎం ఇంటర్న్‌షిప్ పథకాన్ని మరింత విస్తృతంగా అమలు చేసేందుకు కేంద్రం చర్యలు

– ఎంపీ వల్లభనేని బాలశౌరి ప్రశ్నకు కేంద్రం సమాధానం



ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి అడిగిన ప్రశ్నకు కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ లోక్‌సభలో సమాధానం ఇచ్చింది. 2024-25 బడ్జెట్‌లో ప్రకటించిన ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం (PM Internship Scheme) ప్రస్తుతం పైలట్ ప్రాజెక్టు రూపంలో కొనసాగుతోందని, ప్రధాన పథకం ఇంకా ప్రారంభం కాలేదని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.కేంద్ర ప్రభుత్వం తెలిపిన వివరాల ప్రకారం, 2024 అక్టోబర్ 3న ప్రారంభమైన పైలట్ ప్రాజెక్టులో ఇప్పటివరకు రెండు దశలు పూర్తికాగా, మూడో దశ ప్రస్తుతం కొనసాగుతోంది. అమలు సమయంలో వచ్చిన అనుభవాల ఆధారంగా 2026 మార్చి 12న మార్గదర్శకాలను సవరించారు.సవరించిన మార్గదర్శకాల ముఖ్యాంశాలు: వ్యవధి & స్టైపెండ్: ఇంటర్న్‌షిప్ వ్యవధిని కంపెనీల అవసరాలకు అనుగుణంగా 6 లేదా 9 నెలలుగా నిర్ణయించారు. నెలవారీ స్టైపెండ్‌ను రూ.5,000 నుంచి రూ.9,000కు పెంచారు. వయోపరిమితి & అర్హతలు: అర్హత వయస్సును 21–24 సంవత్సరాల నుంచి 18–25 సంవత్సరాలకు విస్తరించారు. మాస్టర్స్ పూర్తిచేసిన వారు, గ్రాడ్యుయేషన్/పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చివరి సంవత్సరం విద్యార్థులకు కూడా అవకాశం కల్పించారు.నూతన విధానాలు: నిరంతర ఇంటర్న్‌షిప్ ఎంపికలు జరిగేలా రోలింగ్ విధానాన్ని, పథకంలో పాల్గొనే కంపెనీలు, సంస్థల పరిధిని విస్తరించారు. సాంకేతిక సదుపాయాలు: పోర్టల్‌లో జియో-ట్యాగింగ్, ఖాళీల బదిలీ, అదనపు ప్రయోజనాల వివరాల ప్రదర్శన వంటి కొత్త సదుపాయాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, పరిశ్రమల సంఘాల సహ కారంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బడ్జెట్ కేటాయింపులు:పీఎం ఇంటర్న్ షిప్ పథకానికి 2024-25లో రూ.2,000 కోట్లు, 2025-26లో రూ.10,831.07 కోట్లు, 2026-27లో రూ.4,788.45 కోట్లు కేటాయించినప్పటికీ, ప్రధాన పథకం ఇంకా ప్రారంభం కాకపోవడంతో ప్రస్తుతం పైలట్ ప్రాజెక్టు మాత్రమే అమలులో ఉందని ప్రభుత్వం పేర్కొంది.ఆంధ్రప్రదేశ్‌లో పైలట్ ప్రాజెక్టు పురోగతి (2026 జూలై 15 నాటికి): రౌండ్–1: 4,973 అవకాశాలకు 6,164 ఆఫర్లు ఇవ్వగా, 1,970 మంది అంగీకరించి 411 మంది చేరారు.రౌండ్–2: 4,715 అవకాశాలకు 11,095 ఆఫర్లు ఇవ్వగా, 2,870 మంది అంగీకరించి 650 మంది చేరారు.రౌండ్–3: 6,384 అవకాశాలకు 1,520 ఆఫర్లు ఇవ్వగా, 848 మంది అంగీకరించి 556 మంది చేరారు. ప్రస్తుతం ఈ మూడో దశ కొనసాగుతోంది.ఈ పథకం ద్వారా యువతకు పరిశ్రమల్లో ప్రత్యక్ష అనుభవం, ఉపాధి అవకాశాలు పెరగనున్న నేపథ్యంలో, పథకాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాలని ఎంపీ వల్లభనేని బాలశౌరి కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లారు.

## ఏపీఈడీబీ పోర్టల్‌లో నమోదుతో పారిశ్రామికవేత్తలకు మెరుగైన సేవలు

జిల్లాలోని అన్ని పారిశ్రామికవేత్తలు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి : జిల్లా కలెక్టర్ డీకే బాలాజి




మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

పారిశ్రామికవేత్తల సమస్యల సత్వర పరిష్కారం, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య మానవ వనరుల కల్పనలో ఏపీఈడీబీ పోర్టల్ కీలక పాత్ర పోషిస్తుందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అన్నారు. జిల్లాలోని అన్ని పారిశ్రామికవేత్తలు తప్పనిసరిగా ఈ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమావేశపు మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్ష తన జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక మండలి సమావేశం జరిగింది. సమావేశంలో అజెం డా అంశాలు, పెండింగ్ దరఖాస్తుల పురోగతి, పారిశ్రామికవేత్తలు ఎదుర్కొంటున్న సమస్యలు, ఎగుమతుల ప్రోత్సాహానికి చేపట్టాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికవేత్తలకు మరింత మెరుగైన సేవలు అందిం చేందుకు ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు (APEDB) పోర్టల్ ను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. జిల్లాలో 10 మందికి పైగా ఉపాధి కల్పిస్తున్న ప్రతి పారిశ్రామికవేత్త, వ్యాపా రవేత్త ఈ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు.పోర్టల్‌లో నమోదు చేసుకున్న అనంతరం పరిశ్రమలకు సంబంధించిన సమస్యలను నేరుగా నమోదు చేసే అవకాశం ఉంటుందని, వాటిని ప్రభుత్వం వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అలాగే పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరుల అవసరాలను కూడా పోర్టల్‌లో నమోదు చేయడం ద్వారా, ఆ అవసరాలకు అనుగుణంగా యువతకు శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం కార్యాచ రణ రూపొందించగలదని వివరించారు.పారిశ్రామికవేత్తలతో నిర్వహించిన సమావేశాల్లో నైపుణ్యం కలిగిన మానవ వనరుల కొరత ప్రధాన సమస్యగా గుర్తించామని, అందువల్ల ప్రతి పరిశ్రమ తమకు అవసరమైన నైపుణ్యాల వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాలని కోరారు. దీంతో పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలను రూపొందించడం సులభతరం అవుతుందని తెలిపారు.జిల్లాలోని పారిశ్రామికవేత్తలందరూ వీలైనంత త్వరగా ఏపీఈడీబీ పోర్టల్‌లో నమోదు చేసుకుని, తమ సమస్యలు, నైపుణ్య అవసరాలను నమోదు చేయాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. పోర్టల్‌లో నమోదు సమయంలో లేదా ఇతర సాంకేతిక సమస్యలు ఎదురైతే సంబంధిత అధికారులను సంప్రదించి సహాయం పొందాలని సూచించారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా చర్యలు తీసుకోవాలి

### పెండింగ్ ఫిర్యాదులు, అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లపై ప్రత్యేక దృష్టి సారించాలి

### ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమం నిర్వహించి అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజి

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించే విధంగా నాణ్యమైన పరిష్కారం చూపించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్, కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, డిఆర్ఓ కే శ్రీధర్ రెడ్డి, కె ఆర్ ఆర్ సి ఎస్డిసి పి నీలకంఠేశ్వర రెడ్డి, డీఎస్పీ జి శ్రీనివాసరావుతో కలిసి ప్రజల వినతులను స్వీకరించారు. అనంతరం ఆయన వివిధ శాఖల పెండింగ్ అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) కె. శ్రీధర్ రెడ్డికి స్వాగతం పలికిన కలెక్టర్, గతంలో డీఆర్ఓగా పనిచేసిన అధికారుల మాదిరిగానే అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ పరిపాలనను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. జిల్లా అధికారులు కూడా డీఆర్ఓకు పూర్తి సహకారం అందించాలని కోరారు.అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల అంశంపై మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం అన్ని శాఖలు తమ పరిధిలో ఉన్న డిపాజిట్లను వెంటనే యాక్టివేట్ చేసి కలెక్టరేట్ పూల్ అకౌంట్‌కు బదిలీ చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటికే పునరుద్ధరించిన డిపాజిట్లలో ఇంకా సంబంధిత శాఖల వద్ద ఉన్న నిధులను రెండు మూడు రోజుల్లోపు తప్పనిసరిగా బదిలీ చేయాలని ఆదేశించారు. ఇంకా పునరుద్ధరణ జరగని డిపాజిట్లపై ప్రత్యేక దృష్టి సారించి ఒక్క రూపాయి కూడా మిగలకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.పీజీఆర్ఎస్, సీఎం గ్రీవెన్సెస్, పీజీఆర్ఎస్ పోర్టల్‌లలో గడువు దాటిన ఫిర్యాదులు అధికంగా ఉన్న శాఖల పనితీరుపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా పంచాయతీ, మున్సిపల్ పరిపాలన, రెవెన్యూ, సర్వే, జలవనరులు, పోలీసు, రిజిస్ట్రేష న్, పౌర సరఫరాలు తదితర శాఖల అధికారులు పెండింగ్ ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి ఫిర్యాదుపై స్పష్టమైన చర్యలు తీసుకొని పరిష్కారం చూపాలని, "తర్వాత చర్యలు తీసుకుంటాం" వంటి సాధారణ వ్యాఖ్యలతో ఫిర్యా దులను పెండింగ్‌లో ఉంచ రాదని సూచించారు. కోర్టు కేసు ఉన్నప్పటికీ స్టేటస్ కో లేదా స్పష్టమైన న్యాయపరమైన అడ్డంకి లేకుంటే సంబంధిత అధికారులు తమ పరిధిలో నిర్ణయాలు తీసుకొని చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలందించడంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, కలెక్టర్స్ కాన్ఫరెన్స్ నాటికి సీఎం గ్రీవెన్సెస్, పీజీఆర్ఎస్ పెండింగ్ కేసులను పూర్తిగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.



అర్జీలలో కొన్ని: ఆంధ్రప్రదేశ్ యానాదుల ఎడ్యుకేషన్, పారిశుద్ధ కార్మికుల డెవలప మెంట్ సొసైటీ, ఎరుకుల ఆత్మగౌరవ సంఘం ప్రతినిధులు జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. కృష్ణా జిల్లాలోని 25 మండలాల్లో గిరిజనులు (యానాదులు) నివసిస్తున్న ప్రాంతాల్లో సచివాలయాల వారీగా సమగ్ర సర్వే నిర్వహించాలని, ఆధార్ కార్డులు లేని గిరిజనులకు వెంటనే ఆధార్ కార్డులు జారీ చేయాలని కోరారు. అలాగే గిరిజనుల కోసం ప్రత్యేక వసతి గృ హం, కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయడంతో పాటు, వారిపై అకృత్యాలు, దౌర్జన్యాలు జరగకుండా పోలీసు రక్షణ కల్పించి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. తాను వితంతువు, దివ్యాంగురాలినని, జీవనో పాధి లేకపోవడంతో ప్రభుత్వ పెన్షన్ కోసం దర ఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. తన తల్లి బత్తిన కోటమ్మ వేరే చోట నివసిస్తున్నందున రేషన్ కార్డు నుంచి ఆమె పేరును తొలగించి తనకు ప్రత్యేక రేషన్ కార్డు మంజూరు చేయాలని కోరారు. దీంతో వితంతు లేదా దివ్యాంగుల పెన్షన్ పొం దేం దుకు అవకాశం కల్పించాలని మచిలీ పట్నం మండలం ఈడేపల్లికి చెందిన చిట్టిబొమ్మ దుర్గ విజ్ఞప్తి చేశారు.మచిలీపట్నం 14వ వార్డు ఇంగ్లీష్‌పాలెం ప్రాంతానికి చెందిన స్థానికులు జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. గత కొన్ని రోజులుగా తమ ప్రాంతంలో తాగునీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని, నీరు వచ్చే సమయాలు కూడా నిర్దిష్టంగా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. వాటర్ ట్యాక్స్‌ను క్రమం తప్పకుండా చెల్లిస్తున్నప్పటికీ పగటి పూట కనీసం గంటసేపు కూడా నీటి సరఫరా ఉండడం లేదని, రాత్రి వేళల్లో నీరు ఎప్పుడు వస్తుందో తెలియక మేల్కొని మోటార్లు పరిశీలించాల్సిన పరిస్థితి నెలకొందని పేర్కొన్నా రు. ఈ సమస్యను పరిష్కరించేలా సంబంధిత మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను ఆదేశించి, పగటి వేళల్లో నిర్ణీత సమయాలకు క్రమం తప్పకుండా తాగునీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.కార్యక్రమంలో జెడ్పీ సీఈవో డాక్టర్ జే అరుణ, డిపిఓ ఎం ధనలక్ష్మి, ఆర్ అండ్ బి ఈఈ లోకేశ్వరావు, మత్స్య శాఖ అధికారి అయ్యా నాగరాజా, వ్యవసా య ఉద్యాన శాఖల అధికారులు జ్యోతి రమణి, జే జ్యోతి, డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ దయాకర్, సర్వే ఏడి లక్ష్మణరావు, డ్వామా పీడీ ఎన్ శివప్రసాద్ యాదవ్, డిఆర్డిఏ పిడి హరిహరనాథ్, మెప్మా పిడి సాయిబాబు, డిటిడబ్ల్యూఓ ఫణి ధూర్జటి, డ్రైనేజీ శాఖ ఈఈ కిరణ్ బాబు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమం.. రాష్ట్ర అభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యం





### రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రపథంలో నిలిపేలా కూటమి కృషి

### వైసీపీ అరాచకాన్ని గుర్తించి 11 సీట్లకు పరిమితం చేసినా బుద్ధి రాలేదు

### అభివృద్ధిని అడ్డుకునేలా వ్యవహరించే వారికి గుణపాఠం తప్పదు

### మచిలీపట్నంలో 'ఇంటింటికీ టీడీపీ' కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనను ప్రజలందరికీ తెలియజేయడమే లక్ష్యంగా 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మచిలీపట్నం పరిధిలోని పెద్దయాదరలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు."2014లో రాష్ట్ర విభజన జరిగినపుడు దాదాపు ₹16,000 కోట్ల లోటు బడ్జెట్‌తో పాలన ప్రారంభించాం. ఐదేళ్లు కష్టపడి రాష్ట్రాన్ని గాడిన పెట్టాం. 2019 ఎన్నికల్లో మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. వైసీపీ అరాచకాలను భరించలేక ప్రజలంతా ఏకమై దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా 94 శాతం సీట్లతో కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారు."— కొల్లు రవీంద్ర, మంత్రిఆర్థిక ఇబ్బందులున్నా సడలని సంక్షేమంప్రస్తుతం రాష్ట్రంలో అప్పుల భారం ఎక్కువగా ఉండటం వల్ల ఆదాయం మొత్తం ఉద్యోగుల జీతాలకు, అప్పుల వడ్డీలకే సరిపోతోందని మంత్రి తెలిపారు. అయినప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన పరిపాలనా దక్షతతో సంక్షేమాన్ని, అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తున్నారని కొనియాడారు.పెద్ద యాదర గ్రామంలో చేకూరుస్తున్న లబ్ధి (గణాంకాలు):పెన్షన్లు: 424 మందికి ₹18.86 లక్షలు.అన్నదాత సుఖీభవ: 258 మందికి ₹52.98 లక్షలు.తల్లికి వందనం: 188 మందికి ₹28.20 లక్షలు.ఆటో డ్రైవర్ల సేవలో: 16 మందికి ₹2.40 లక్షలు.ప్రధాన మంత్రి ఆవాస్ యోజన: 16 మందికి ఇళ్ల లబ్ధి.హామీల అమలులో సరికొత్త చరిత్రపెన్షన్ల పెంపు: ఇచ్చిన హామీ మేరకు ₹4,000 పెన్షన్లు అందిస్తున్నాం. ఏటా 64 లక్షల మంది కోసం ₹35,000 కోట్లు ఖర్చు చేస్తున్నాం. త్వరలోనే మరో 8 లక్షల మందికి కొత్త పెన్షన్లు మంజూరు చేయబోతున్నాం. మంచానికే పరిమితమైన (బెడ్ రిడెన్) బాధితులకు ₹15,000 అందిస్తున్నాం.రైతు సంక్షేమం: గతంలో జగన్ రెడ్డి కేంద్రం సొమ్ముతో కలిపి ₹13,000 ఇస్తే, నేడు 'అన్నదాత సుఖీభవ' ద్వారా ప్రతి రైతుకూ ₹20,000 చొప్పున అందిస్తున్నాం.తల్లికి వందనం: ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ ఈ పథకాన్ని వర్తింపజేస్తూ ₹10,500 కోట్లు విడుదల చేశాం.ఇతర ఉచిత సదుపాయాలు: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ వేగవంతంగా జరుగుతోంది.మౌలిక వసతుల కల్పనే లక్ష్యంకూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం వేగవంతమైందని మంత్రి వెల్లడించారు. సాంకేతిక కారణాల వల్ల జాప్యమైన యాదర రోడ్డు నిర్మాణానికి త్వరలోనే టెండర్లు పిలిచి పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ సమస్యలపై వస్తున్న ఫిర్యాదులను అధికారులతో సమీక్షించి త్వరితగతిన పరిష్కరిస్తామని చెప్పారు.హాజరైన నాయకులు:ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షులు కాగిత వెంకటేశ్వరరావు, మార్కెట్ యార్డు ఛైర్మన్ కుంచె నాని, చిన్నాపురం మాజీ సర్పంచి గోపాల్ రావు, కృష్ణమూర్తి తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సామాన్య ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన బియ్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

### మచిలీపట్నం రైతు బజార్‌లో సబ్సిడీ ధరలకు బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాభూమి బ్యూరో కృష్ణజిల్లా

వర్షాభావ పరిస్థితుల కారణంగా మార్కెట్‌లో బియ్యం ధరలు పెరిగిన నేపథ్యంలో సామాన్య ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన బియ్యం అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.సోమవారం ఉదయం మచిలీపట్నం జిల్లా కోర్టు సెంటర్ వద్ద ఉన్న రైతు బజార్‌లో ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణతో కలిసి మంత్రి కొల్లు రవీంద్ర సబ్సిడీ ధరలకు బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో మార్కెట్‌లో బియ్యం ధరలు పెరిగాయని, సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పడకుండా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సహకారంతో సబ్సిడీ ధరలకు బియ్యం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో స్టీమ్ రైస్ కిలో రూ.62 నుంచి రూ.65 వరకు, రా రైస్ కిలో రూ.58 వరకు విక్రయిస్తుండగా, ప్రభుత్వం స్టీమ్ రైస్‌ను కిలో రూ.52కు, రా రైస్‌ను కిలో రూ.50కు అందిస్తోందన్నారు. ప్రతి తెల్ల రేషన్ కార్డు కలిగిన కుటుంబానికి నెలకు 10 కిలోల బియ్యం అందజేస్తామని తెలిపారు.రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి 24 గంటల్లోనే వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తోందన్నారు. 'అన్నదాత సుఖీభవ' పథకం కింద ప్రతి రైతుకు రూ.20 వేల ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు.మిర్చి, పొగాకు, మామిడి, ఆక్వా రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రతిసారీ ప్రభుత్వం వెంటనే స్పందించి అవసరమైన సహాయాన్ని అందించిందన్నారు. గతంలో కందిపప్పు, ఉల్లిపాయలు, టమాటాలు తదితర నిత్యావసర వస్తువులను కూడా సబ్సిడీ ధరలకు అందించి మార్కెట్ ధరలను నియంత్రించినట్లు తెలిపారు. అవసరమైతే వంటనూనె వంటి నిత్యావసర వస్తువులను కూడా ప్రజలకు అందుబాటు ధరల్లో అందించేం దుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

ధరల నియంత్రణకు ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు చెప్పారు.ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ.. గతంలో రేషన్ బియ్యంపై వినియోగదారులకు మంచి అభిప్రాయం ఉండేది కాదని, దీంతో చాలామంది మార్కెట్‌లో అధిక ధరలకు బియ్యం కొనుగోలు చేయాల్సి వచ్చేదన్నారు. ప్రజలపై ఆర్థిక భారం తగ్గించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రైస్ మిల్లర్స్‌తో సంప్రదించి ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. మార్కెట్ ధరతో పోలిస్తే కిలోకు సుమారు రూ.15 తక్కువ ధరకు బియ్యం అందిస్తున్నామని, ప్రతి తెల్ల రేషన్ కార్డు కలిగిన కుటుంబానికి నెలకు 10 కిలోల బియ్యం అందించడం ద్వారా ఒక్కో కుటుంబానికి సుమారు రూ.150 వరకు ఆదా అవుతుందని తెలిపారు.



రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక భారం అయినప్పటికీ పేద ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ పథకాన్ని అమలు చేస్తోందని పేర్కొన్న ఆయన, ఈ కార్యక్రమానికి సహకరించిన రైస్ మిల్లర్స్‌ను అభినందించారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సబ్సిడీ ధరలకు అందిస్తున్న నాణ్యమైన బియ్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు.జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) చైర్మన్ బండి రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రజలపై పెరుగుతున్న బియ్యం ధరల భారాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. మార్కెట్‌లో 10 కిలోల బియ్యం ధర రూ.650 నుంచి రూ.670 వరకు ఉండగా, ప్రభుత్వం కేవలం రూ.520కే అందించడం ద్వారా ప్రతి కుటుంబానికి గణనీయమైన ఆర్థిక ఉపశమనం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన రైస్ మిల్లర్స్‌ను అభినందించిన బండి రామకృష్ణ, సామాన్య ప్రజల ప్రయోజనాల కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ పథకాన్ని ప్రతి అర్హ కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో డీఎస్ఓ మోహన్ బాబు, మార్కెటింగ్ శాఖ ఏడి నిత్యానంద్, మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ నాని, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మెహర్ బాబా, కూటమి నాయకులు లోగిశెట్టి వెంకటస్వామి, తలారి సోమశేఖర్, కే సుశీల, మాదివాడ రాము, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

Printed by Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at and published at DOOR NO. 19-4-378, S T V NAGAR, NEAR OLD TVS SHOW ROOM, OPPOSITE TIRUPATHI (URBAN) editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .PRGINo. "APTEL/25/A2316,Phone No. Cell : 9502116677

# అర్జీదారుల అర్జీలను పారదర్శకతతో నాణ్యత ప్రమాణాలతో పరిష్కరించాలి

## కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్.

**ప్రజాభూమి ప్రతినిధి-అమలాపురం**

దూర ప్రాంతాల నుండి వ్యయ ప్రయాసాలతో కూడి వచ్చిన అర్జీదారుల అర్జీలను పూర్తి పారదర్శకంగా నాణ్యత ప్రమాణాలతో పరిష్కార మార్గాలు చూపాలని జిల్లా కలెక్టర్ డా.ఆర్. మహేష్ కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లోని గోదావరి నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక 351 ప్రజా వినతులను స్వీకరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ శాఖలైన రెవిన్యూ,ఇరిగేషన్, హోమ్ డిపార్ట్మెంట్, మెడికల్ అండ్ హెల్త్, పంచాయితీ, డిఆర్డిఏ, సివిల్ సప్లై, లీగల్ సెల్ నుండి భూ సంబంధిత సమస్యలు, రీ సర్వే ఇళ్ల స్థలాలు, ల్యాండ్ మరియు సివిల్, ఎఫ్-లైన్, మ్యుటేషన్స్, ఎంకరోచ్మెంట్స్ నుండి వచ్చే సమస్యలను పిజిఆర్ఎస్ నుండి ప్రజా వినతులను స్వీకరించడం జరిగిందన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీదారులు సంతృప్తి చెందే విధంగా అధికారులు సత్వరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అధికారులు అర్జీదారులకి సరైన సమాచారం అందించాలని, ఆ సమస్యపై పూర్తి ఎంక్వయిరీ చేసి ఎండార్స్మెంట్ రూపంలో అందించాలని, సమస్య పరిష్కారం అవుతుందా లేదా అనే విషయంపై అర్జీదారునికి పూర్తి సమాచారం ఇవ్వాలని కలెక్టర్ తెలియజేశారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఏపీఎస్ డి పి ఎస్ డిస్టిక్ కోఆర్డినేటర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఐ గాట్ కర్మ యాప్ లో సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు



వివిధ రకాల కోర్సులు చేయాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రతి నెల మూడు కోర్సులను తప్పనిసరిగా పూర్తి చేయాలని ఆమె తెలియజేశారు. ప్రస్తుతం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఏడవ స్థానంలో ఉందని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో డి. ఆర్. వో. వి.సుబ్బారావు, డిప్యూటీ కలెక్టర్ డి. అచ్యుత కుమారి, డి ఆర్ డి ఏ పి.డి డి. రాంబాబు సమగ్ర శిక్ష పిడి జి. మమ్మీ, డ్వామా పిడి జి.ఎస్ రామ గోపాల్, జి ఎస్ డబ్ల్యూ ఎస్ అధికారిని వి విజయలక్ష్మి, డి ఎల్ డి ఓ అమలాపురం పి విజయ భాస్కర్, జిల్లా అధికారులు కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైంది



**ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం**

వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తి విఫలమైందని, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య అన్నారు. సోమవారం వరదల వలన ముంపుకు గురి అయిన చింతరేగుపల్లి గ్రామానికి సిపిఎం బృందం నాటు పడవపై వెళ్లి వారి సమస్యలు తెలుసుకోవడం జరిగిందని, జిల్లా కలెక్టర్ కూరగాయలు పంపిస్తామని హామీ ఇచ్చి వెళ్లారు కానీ ఇప్పటివరకు నిత్యవసరాలు కూరగాయలు రాకపోవడంతో ప్రజలు ఆవేదన చెందుతున్నారని వారు పేర్కొన్నారు. వరద బాధితులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ తక్షణమే వరదల్లో నీటి మునిగిన ఇల్లు అన్నింటికీ నష్టపరిహారం చెల్లించాలని, నిత్యవసరాలు కూరగాయలు బియ్యం తదితర సామాగ్రి అందించి వారిని ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేలు, మంత్రులు వరదల్లో నీట మునిగిన గ్రామాలన్నింటిలో పర్యటించి వారిని ఆదుకునే ప్రభుత్వపరంగా చర్యలు తీసుకోవాలని, లేదంటే వరద బాధితులతో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర నాయకులతోపాటుగా సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పన కిరణ్, ఎంపీపీ కారం లక్ష్మి, స్థానిక ఎంపీటీసీ పూణెం ప్రదీప్ కుమార్, స్థానిక సర్పంచ్ పిట్టా రామారావు, పార్టీ మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్, జిల్లా నాయకులు సోయం చినబాబు, మేకల నాగేశ్వరరావు, ఆదివాసి గిరిజన సంఘం నాయకులు, మహిళా సంఘం నాయకులు, రైతు వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# తాడిపూడిలో ఇంటింటికీ కూటమి విజయ కరపత్రాల పంపిణీ

## అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు శ్రీకారం

**ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి**

తాళ్లపూడి మండలం తాడిపూడి గ్రామంలో ఇంటింటికీ కూటమి విజయ కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, తాడిపూడి సొసైటీ అధ్యక్షులు నామ కొండబాబు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలను నేరుగా కలిసి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.అవ్వా.. పింఛన్ అందుతుందా? ఏమ్మా.. ఉచిత బస్సు ప్రయాణం చేస్తున్నావా?, పింఛన్ కోసం ఎలాంటి ఇబ్బందులు లేదా?, ప్రభుత్వ పనితీరు ఎలా ఉంది? అంటూ ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంత మేరకు చేరుతున్నాయో ఇంటింటికీ వెళ్లి పరిశీలించారు.ప్రజల నుంచి వచ్చిన వినతులు, స్థానిక సమస్యలను ఓర్పుగా విన్న ఎమ్మెల్యే, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ



ఇచ్చారు.అనంతరం గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎస్సీ కాలనీలో రూ.5 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించడంతో పాటు, రూ.20 లక్షలతో చేపట్టిన పుంత రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. అలాగే రూ.9 లక్షల వ్యయంతో పునర్నిర్మించిన మండల పరిషత్ ఫౌండేషన్ పాఠశాల భవనం, ప్రహరీ గోడను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, రాగోలపల్లి సొసైటీ అధ్యక్షులు అనపర్తి ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి తానేటి నవీన, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు తిరుమలశెట్టి సత్యనారాయణ, క్లస్టర్ ఇంచార్జ్ కూచిపూడి గణపతి, నామా నరేంద్ర కుమార్, చింతపల్లి బుజ్జియ్య, కొర్లపాటి లక్ష్మణరావు, మరిచర్ల శ్రీనివాస్, చెన్నా శ్రీనివాసరావు, యండపల్లి శేఖర్, అయ్యప్ప, కూటమి నాయకులు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు నూతన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేసిన ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

**ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి**

రైతుల భూ హక్కులకు మరింత చట్టబద్ధత కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నూతన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం సోమవారం తాళ్లపూడి మండలం తాళ్లపూడి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొవ్వూరు నియోజకవర్గ శాసన సభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై రైతులకు స్వయంగా నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వం చేపట్టిన భూ రికార్డుల ప్రక్షాళనతో రైతుల భూ యాజమాన్యానికి స్పష్టత లభిస్తుందని, నూతన పట్టాదారు పాస్ పుస్తకాల ద్వారా బ్యాంకు రుణాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు



పొందడం మరింత సులభతరం అవుతుందని తెలిపారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. తాళ్లపూడి కుకునూరు పంచాయతీ పరిధిలో 384 పాస్ పుస్తకాలు రైతులు అందజేయడం జరుగుతుందని అధికారులు తెలిపారు.అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.1,79,861 విలువైన చెక్కును బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే అందజేశారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, నామన పరమేశ్వరరావు, సూరపనేని చిన్ని, ఇందుగుల రామకృష్ణ, ఉడతా వీరేంద్ర, జడ్డు శ్రీను, కదలి కిరణ్ కుమార్, కందుల నాగు, నామా నరేంద్ర కుమార్, కూచిపూడి గణపతి, అనపర్తి ప్రసాద్, తహసీల్దార్ లక్ష్మీ లావణ్య, వ్యవసాయ అధికారి రుచిత, డిప్యూటీ ఎంపీడీవో వీరన్న, కార్యదర్శి సుభద్ర, విఆర్వోలు లీలావతి, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## భూములకు పరిహారం ఇచ్చారు ఇండ్లకు మరిచారు అని మర్రిగూడెం గ్రామస్తులు కలెక్టర్ కు వినతి పత్రం..

**ప్రజా భూమి ప్రతినిధి-కూనవరం**



మండలంలో పర్యటిస్తున్న జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌కి మర్రిగూడెం గ్రామస్తులు వినతి పత్రం అందించినారు.ప్రతి సంవత్సరం గోదావరికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము. ఉమ్మడి ఆంధ్రప్ర దేశ్ లో మా భూములకు పరిహారం అందించియున్నారు. అలాగే 2022 లో మా గ్రామం నోటిఫి కేషన్ విడుదలైంది కాబట్టి మాకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇప్పించి ఈ వరదల భారీ నుండి మమ్మల్ని కాపాడాలని వారికి గ్రామంలో ఉన్న గ్రామస్తులు అందరూ వారిని కోరడమైనది. ఈ కార్యక్రమంలో చిలకం. లక్ష్మణరావు, శ్రీమంతుల సతీష్, దారా ముత్తయ్య, జగ్గయ్య, ఆత్మ కూరి ఆదిలక్ష్మి, వాడపల్లి వీరాస్వామి, దారా సుజాత, మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.


## సబ్సిడీ బియ్యం విక్రయాలను ప్రారంభించిన మంత్రి సుభాష్ తండ్రి సత్యం



**ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం**

సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై పెరుగుతున్న జీవన వ్యయ భారాన్ని తగ్గించేందుకు కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించిన తగ్గింపు ధరల బియ్యం విక్రయ కార్యక్రమాన్ని సోమవారం రామచంద్రపురం పట్టణంలో ఏర్పాటు చేశారు.స్థానిక తహశీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రాన్ని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్, మంత్రి సుభాష్ తండ్రి సత్యం, రెవిన్యూ అధికారులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ప్రజల అవసరాలను గుర్తించి సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యం ఇస్తూ పాలన కొనసాగుతోందని పేర్కొన్నారు.బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయమవుతున్న నాణ్యమైన స్టీమ్ రైస్‌ను కిలోకు రూ.52కే, రా రైస్‌ను కిలోకు రూ.50కే అందించడం ద్వారా ప్రతి కుటుంబానికి ప్రత్యక్ష ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ప్రజలపై ధరల భారం తగ్గించడం, నిత్యావసర వస్తువులను అందుబాటులో ఉంచడం ప్రభుత్వ బాధ్యతగా భావించి ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు ఉపయోగపడే ప్రతి కార్యక్రమాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లడంలో కార్యకర్తలు, నాయకులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బి. మృత్యుంజయరావు, ఎం.ఎస్.ఓ. ఎం. సోని ప్రియదర్శిని, రీ-సర్వే డిప్యూటీ తహశీల్దార్ ఎం. హరిచంద్ర వరప్రసాద్,తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు ఉండవిల్లి శివ, టౌన్ బీజేపీ అధ్యక్షులు ఆకేటి శివకృష్ణ, జనసేన టౌన్ కార్యదర్శి దొడ్డా దుర్గాప్రసాద్, గడి గోవిందు, దంగేటి గౌరీశంకర్, పదం మూర్తి, అల్లం శ్రీనివాస్, గడి జగన్, పలివెల రాజు, అక్కల ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

## సత్వర న్యాయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలి





**ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట**

వివాదాల పరిష్కారంలో మధ్యవర్తిత్వం (మీడియేషన్) అత్యంత సమర్థవంతమైన ప్రత్యామ్నాయ విధానమని, దీని ద్వారా కక్షిదారులకు సత్వర న్యాయం అందుతుందని జూనియర్ సివిల్ కోర్ట్ జడ్జి ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో రూపొందించిన 90 రోజుల ప్రత్యేక కార్యాచరణలో భాగంగా ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు ప్రత్యేక మధ్యవర్తిత్వ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆలమూరు జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన మీడియేషన్ హబ్‌ను ఆయన ప్రారంభించి కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ, కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న అనేక వివాదాలను పరస్పర అవగాహనతో, స్నేహపూర్వక వాతావరణంలో పరిష్కరించేందుకు మధ్యవర్తిత్వ విధానం ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఈ విధానం వల్ల సమయం, ధనం ఆదా కావడంతో పాటు సంబంధాలు కూడా దెబ్బతినకుండా ఉంటాయని వివరించారు. సుప్రీంకోర్టు ఆధ్వర్యంలో నిర్వహించిన 40 గంటల ప్రత్యేక శిక్షణా కార్యక్రమంలో శిక్షణ పొందిన న్యాయవాదులు వారంరోజుల పాటు అందుబాటులో ఉండి కక్షిదారులకు మధ్యవర్తిత్వంపై అవగాహన కల్పించడంతో పాటు వివాదాల పరిష్కారానికి సహకరిస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బార అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.కె షరీఫ్, సీనియర్ న్యాయవాదులు బి మహేశ్వరరావు, సత్యనారాయణ, చల్లా సతీష్ పాల్గొన్నారు.

## 1వ వార్డు కొత్తూరులో గడపగడపకు వైఎస్సార్

**ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం**



రామచంద్రపురం టౌన్ పరిధిలో గల 1వ వార్డు కొత్తూరులో నిర్వహించిన గడపగడపకు వైఎస్సార్ కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ , డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా యువజన విభాగ అధ్యక్షులు, రామచంద్రపురం వైఎస్సార్సీపీ కోఆర్డినే టర్ పిల్లి సూర్యప్రకాష్ ఆపార్టీ శ్రేణులుతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రజలతో ముఖాముఖిగా మాట్లాడిన నాయకులు గత ప్రభుత్వ హయాంలో అమలైన సంక్షేమ కార్యక్రమా లు, ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న పరిస్థితులపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకు న్నారు. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వ పాలనకు మధ్య ప్రజలు గమనిస్తున్న తేడాలను తెలుసుకుంటూ ప్రతి కుటుంబంతో ఆప్యాయంగా మమేకమయ్యారు. ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా వైఎస్సార్సీపీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుందని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పేద విద్యార్థికి బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చికిత్స

- మంత్రి సుభాష్ చొరవతో అవసరమైన ఏర్పాట్లు పూర్తి.
- రూ.20 లక్షలు వ్యయంతో చికిత్స.

**ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం.**

పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ, ఆపదలో ఉన్న వారికి భరోసా కల్పించడం తన బాధ్యతగా భావిస్తున్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మరోసారి తన మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజకవర్గం ఏరుపల్లి గ్రామానికి చెందిన చరణ్ తేజ పవన్ (14) అరుదైన రక్త సంబంధిత వ్యాధి అయిన ఫ్యాన్‌కోనీ అనీమియా తో బాధపడుతుండగా, అతని ప్రాణాలను కాపాడేందుకు అత్యవసరంగా అవసరమైన బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ శస్త్రచికిత్సకు మంత్రి సుభాష్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. చరణ్ తేజ తండ్రి రాంబాబు నిరుపేద కుటుంబానికి చెందినవారు. సుమారు రూ.20 లక్షల వ్యయంతో నిర్వహించనున్న ఈ చికిత్సకు అవసరమైన ఏర్పాట్లు పూర్తయ్యాయి.



హైదరాబాద్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ కాన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ లో ఈ శస్త్రచికిత్స జరగనుంది. ఇప్పటికే దాత నుంచి బోన్ మ్యారో సేకరణ ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందని వైద్యులు తెలిపినట్టు మంత్రి సుభాష్ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ బాలుడి తల్లిదండ్రులు తనను కలిసి పరిస్థితి వివరించిన వెంటనే అవసరమైన సహాయం అందించేందుకు చర్యలు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఆ కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లో ఉండటంతో, వివిధ దాతలు, సేవా సంస్థలను సంప్రదించి సహాయ సహకారాలు అందేలా కృషి చేసినట్లు పేర్కొన్నారు.




ఈ క్రమంలో సహారా హెల్త్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ తన అసిదర్ కార్యక్రమం ద్వారా రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందించింది. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు శంకర్ మఠం, ప్రాజెక్ట్ డైరెక్టర్ హిరణ్మయి, ప్రాజెక్ట్ మేనేజర్ సాహిత్ గౌడ్ తాదూరిలు మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి బాలుడి చికిత్సకు చేయూతనిచ్చారని మంత్రి సుభాష్ అభినందించారు.అదేవిధంగా చికిత్స నిర్వహణలో భాగస్వాములైన రావి శ్రీనివాసరావు, జి. హరికృష్ణ ప్రసాద్ , డాక్టర్ హారిత కొడాలి, తో పాటు బసవతారకం ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, యాజమాన్యానికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.రాబోయే వారం జరగనున్న బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ శస్త్రచికిత్స విజయవంతం కావాలని, చరణ్ తేజ పవన్ పూర్తిగా కోలుకుని ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని భగవంతుడిని ప్రార్థిస్తున్న ట్లు మంత్రి సుభాష్ ఈసందర్భంగా పేర్కొన్నారు. అలాగే క్యాన్సర్, కాలేయ వ్యాధులు మరి యు ఇతర తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న చిన్నారులకు అండగా నిలవాలనే లక్ష్యంతో సహారా సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఈ సేవా కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు అక్టోబర్ 4న గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహిం చనున్న “రన్ ఫర్ చైల్డ్ హెల్త్” కార్యక్రమంలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని చిన్నారుల ఆరోగ్య రక్షణకు తమ వంతు సహకారం అందించా లని మంత్రి పిలుపునిచ్చారు.ప్రజల ప్రాణాలను కాపాడటంలో ప్రభుత్వం, సేవా సంస్థలు, దాతలు కలిసి పనిచేసినప్పుడే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుందని మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు.

# రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని చంద్రకళ

## పలువురు ప్రసంశలు అభినందనలు.

**ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం.**

రామచంద్రపురం పట్టణంలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం బి.ఎ, చదువుతున్న పి.చంద్రకళ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు అర్హత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబాబు పేర్కొన్నారు.ఈమేరకు ఆయన సోమవారం ఈవిషయాన్ని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా స్థాయిలో రావులపాలెం నందు నిర్వహించిన అథ్లెటిక్ పోటీల్లో మొదటి స్థానంలో చంద్రకళ నిలిచిందని ఆయన తెలియజేశారు. కళాశాల పేరుని రాష్ట్రస్థాయిలో నిలపాలని, విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో కూడా



ముందుండాలని ప్రిన్సిపాల్ ఆకాంక్షించారు . ఈనెల 11, 12 ,13 తేదీల్లో జరగబోయే రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీల్లో లాంగ్ జంప్, హైజంప్‌లో పాల్గొనడానికి అర్హత సాధించిందని ఫిజికల్ డైరెక్టర్ పి.నూకరాజు ఈసందర్భంగా ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని విద్యార్థిని ఫిజికల్ డిపార్ట్మెంట్ ఇంచార్జ్ టి .శ్రీనివాస్ రెడ్డి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ .శ్రీనివాస్ , సీనియర్ అధ్యాపకులు డాక్టర్ ఎన్వీ. రమణ , అధ్యాపకులు, అధ్యాపకేతరా సిబ్బంది ఈసందర్భంగా విజేత చంద్రకళని ప్రశంసిస్తూ అభినందనలు తెలియజేశారు.

ప్రజాభూమి
జనరల్ 14
మంగళవారం 4 ఆగస్టు 2026

## భార్య రాకపోవడంతో మనస్తాపం.. యువకుడు ఆత్మహత్య

ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట



ఆత్రేయపురం మండలం మెర్లపాలెం గ్రామంలోని సుజాత కోళ్ల ఫారంలో పని చేస్తున్న ఓ యువకుడు మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం బోయిన జోజప్ప (24) గత నెల రోజులుగా తన భార్య అక్షయతో కలిసి సుజాత కోళ్ల ఫారంలో నివాసముంటూ పని చేస్తున్నాడు. కొన్నిరోజులు క్రితం అక్షయ అనారోగ్య కారణాలతో తన తల్లిగారి ఇంటికి వెళ్లింది. అనంతరం ఆమె తిరిగి రాకపోవడంతో జోజప్ప తీవ్ర మనస్తాపానికి గురైనట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో జోజప్ప కత్తితో తన మెడను కోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి బోయిన దాసు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆత్రేయపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## రావులపాలెం పాఠశాలలో బాలిక పట్ల అసభ్య ప్రవర్తన ఆరోపణలు

కో-ఆప్టెడ్ సభ్యుడిపై పోలీసులకు కుటుంబ సభ్యుల ఫిర్యాదు.



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.

అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం గ్రామ పరిధిలోని ఓ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న బాలిక పట్ల పాఠశాల కో-ఆప్టెడ్ సభ్యుడిగా వ్యవహరిస్తున్న వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించాడంటూ బాలిక కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని చిర్ల సోమసుందర్ రెడ్డి నగర్ (కొత్త కాలనీ)లో ఉన్న ఎం.పి.పి.ఎస్.ఇంగ్లీష్ మీడియం ఫౌండేషన్ స్కూల్లో చదువుతున్న బాలిక పట్ల కో-ఆప్టెడ్ సభ్యుడు షేక్ రహ్మతుల్లా షరీఫ్ శనివారం అసభ్యంగా ప్రవర్తించాడని బాలిక తల్లి ఆరోపించారు. ఈ ఘటనపై వెంటనే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదు నేపథ్యంలో రావులపాలెం అర్బన్ సీఐ జి. రమేష్ బాబు, మండల విద్యాశాఖాధికారి శ్రీనివాసరాజు పాఠశాలను సందర్శించి విచారణ చేపట్టారు. బాలిక, ఆమె కుటుంబ సభ్యులు, పాఠశాల సిబ్బంది నుంచి వివరాలు సేకరిస్తున్నారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని, విచారణ అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఆరోపణలపై పూర్తి స్థాయి విచారణ అనంతరం వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# గంజాయి రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యం

- "సంకల్పం 2.0" కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు
- మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకం.
- విద్యార్థులు, యువత భవిష్యత్తును కాపాడటానికే అనకాపల్లి జిల్లా పోలీస్ ప్రత్యేక చొరవ.
- గంజాయి ఇతర మత్తు పదార్థాల సమాచారం ఇచ్చేందుకు 112, 1972 టోల్ ఫ్రీ నంబర్లు సద్వినియోగం చేసుకోవాలి: ఎస్పీ తుహిన్ సిన్హా



ప్రజాభూమి ప్రతినిధి-నర్సీపట్నం

మాదకద్రవ్యాల రహిత సమాజమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం మరియు పోలీస్ శాఖ సంయుక్తంగా చేపడుతున్న చర్యల్లో భాగంగా, అనకాపల్లి జిల్లా పోలీస్ శాఖ అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందించిన "సంకల్పం 2.0" మెగా గంజాయి అవగాహన కార్యక్రమం సోమవారం నాడు నర్సీపట్నం సమీపంలోని స్టార్ హోమ్స్ ఫంక్షన్ హాల్లో అత్యంత వైభవంగా ప్రారంభమైంది.ఈ వినూత్న కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి అధికారికంగా ప్రారంభించారు. ఈ వేదికపై అనకాపల్లి జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ తుహిన్ సిన్హా ప్రముఖ సినీ నటుడు బ్రహ్మాజీ , జడ్పిటిసి ఎస్.రమణమ్మ జనసేన నాయకులు సూర్యచంద్ర , మరియు డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావు విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు.

శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సమాజానికి పట్టిన గంజాయి మహమ్మారిని పెకలించి వేయడంలో మీడియా, విద్యార్థులు, తల్లిదండ్రులు బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని పిలుపునిచ్చారు. మత్తు పదార్థాలకు అలవాటుపడి యువత తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని, గంజాయి నిర్మూలనకు పోలీసులకు పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు.

జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా గత కొద్ది కాలంగా గంజాయి సాగు, అక్రమ రవాణాను 90% పైగా అరికట్టగలిగామని తెలిపారు. చెక్ పోస్టులు, నిఘా కెమెరాలు, డ్రోన్లు మరియు స్నిఫర్ డాగ్స్ సహాయంతో అక్రమ రవాణాను అడ్డుకుంటున్నామని చెప్పారు. అయితే, గంజాయి వినియోగాన్ని తుడిచిపెట్టాలంటే ప్రజలు, విద్యార్థులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యం అత్యంత కీలకమని స్పష్టం చేశారు. మత్తుకు బానిసలైన వారిని నేరస్థులుగా చూడకుండా 'డీ-ఎడిక్షన్ సెంటర్ల' ద్వారా వారికి చికిత్స అందించి పునరావాసం కల్పిస్తామని హామీ ఇచ్చారు.నర్సీపట్నం డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావు అత్యవసర పరిస్థితుల్లో ప్రజల రక్షణ కోసం 112 మరియు గంజాయి సమాచారం అందించడానికి 1972 టోల్ ఫ్రీ నంబర్లను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను అత్యంత రహస్యంగా ఉంచుతామని, ప్రజల రక్షణే పోలీసుల ప్రథమ ప్రాధాన్యత అని వివరించారు.


సినీ నటుడు బ్రహ్మాజీ యువత తమ లక్ష్యాల వైపు పయనించాలే తప్ప, వ్యసనాల బారినపడి తల్లిదండ్రులు కన్న కలలను కల్లలు చేయకూడదని, పోలీసుల ఈ "సంకల్పం 2.0" ప్రయత్నానికి ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని కోరారు.

**భారీగా పాల్గొన్న విద్యార్థులు, మహిళలు:**

ఈ బహిరంగ అవగాహన సదస్సుకు వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థినులు, ఉపాధ్యాయులు, మహిళలు మరియు స్థానిక ప్రజలు సుమారు 1,500 మందికి పైగా హాజరయ్యారు. మత్తు పదార్థాల దుష్పరిణామాలపై విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు, నాటికలు అందరినీ ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో సీఐలు గఫూర్, రేవతమ్మ, మురళి, రామకృష్ణ, సతీష్, పిల్లా రమేష్, ఈగల్ ఇన్ స్పెక్టర్లు దేవుళ్ళు, నాగరాజు, ఎస్సైలు రాజారావు, ఉమామహేశ్వరరావు, రమేష్ లతో పాటు పెద్ద సంఖ్యలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 'ప్రధానమంత్రి విద్యాలక్ష్మి' పథకంతో పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్య మరింత చేరువ

- ఆంధ్రప్రదేశ్‌లో రూ.1,180 కోట్లకు పైగా విద్యా రుణాల మంజూరు
- కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖిత పూర్వక సమాధానం



ప్రజాభూమి ప్రతినిధి-కాకినాడ

ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ విద్యార్థి కూడా ఉన్నత విద్యకు దూరం కాకూడదనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'ప్రధాన మంత్రి విద్యాలక్ష్మి' పథకం ద్వారా దేశవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు లబ్ధి పొందుతున్నారని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. ఈ పథకం అమలు, ఆంధ్రప్రదేశ్‌లో విద్యా రుణాల మంజూరు, వడ్డీ రాయితీలు, కాకినాడ జిల్లా లబ్ధిదారుల వివరాలపై సోమవారం ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి డా. సుకాంత మజుందార్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం 2024 నవంబర్‌లో ప్రారంభించిన ఈ పథకం కింద నాణ్యమైన ఉన్నత విద్యా సంస్థల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు తాకట్టు, గ్యారంటీ లేకుండా విద్యా రుణాలు అందిస్తున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. వార్షిక కుటుంబ ఆదాయం రూ.8 లక్షల వరకు ఉన్న అర్హులైన విద్యార్థులకు రూ.10 లక్షల వరకు విద్యా రుణాలపై 3 శాతం వడ్డీ రాయితీ కూడా కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. 2026 జూలై 27 నాటికి దేశవ్యాప్తంగా 1,15,528 విద్యా రుణాలు మంజూరు కాగా, వాటి విలువ రూ.15,994.59 కోట్లుగా ఉందని తెలిపారు.

ఆంధ్రప్రదేశ్‌లో 2024-25 నుంచి 2026 జూలై 27 వరకు మొత్తం 9,669 విద్యా రుణాలు మంజూరు చేయగా, వాటి విలువ రూ.1,180.59 కోట్లుగా నమోదైందని వెల్లడించారు.కాకినాడ జిల్లాలో 2024-25లో 9, 2025-26లో 94, 2026-27 (జూలై 27 వరకు) 39 విద్యా రుణాలు మంజూరయ్యాయని కేంద్ర మంత్రి వెల్లడించారు. అలాగే విద్యార్థుల విద్యా రుణ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు బ్యాంకులతో నిరంతరం సమీక్షలు నిర్వహించడంతో పాటు, పీఎం విద్యాలక్ష్మి పోర్టల్ ద్వారా ఫిర్యాదుల పరిష్కారాన్ని పర్యవేక్షిస్తున్నట్లు కేంద్ర మంత్రి సమాధానంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ, "ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు, ఆర్థిక పరిస్థితులు ఉన్నత విద్యకు అడ్డంకి కాకుండా విద్యా రుణాలు, వడ్డీ రాయితీల ద్వారా వేలాది మంది విద్యార్థులకు అండగా నిలుస్తోంది. ఈ పథకాన్ని మరింత మంది విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# కాకినాడ రైతు బజార్‌లో ప్రత్యేక బియ్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్

జిల్లా వ్యాప్తంగా 34 కేంద్రాల్లో బియ్యం అమ్మకాలు..



ప్రజాభూమి ప్రతినిధి-కాకినాడ

జిల్లా వ్యాప్తంగా 34 కేంద్రాల లో బియ్యం అమ్మకాలను నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ పేర్కొన్నారు. సోమవారం కాకినాడ పట్టణం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న రైతు బజార్ లో జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్..ఎమ్మెల్సీ కర్రీ పద్మశ్రీ,కాకినాడ పట్టణ ఎమ్మెల్యే కొండ బాబు తో కలిసి ప్రత్యేక బియ్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ... బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలు పెరిగిన నేపథ్యంలో సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రాలను అందుబాటులోకి తీసుకు వచ్చిందన్నారు.జిల్లా వ్యాప్తంగా నాలుగు రైతు బజార్లతో పాటు మండలాల పరిధిలోనూ,రైస్ మిల్లుల పరిధిలో మొత్తం 34 ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.ప్రజల సంక్షేమమే ధ్యేయం గా ప్రభుత్వం చేపట్టిన ఈ చక్కటి అవకాశాన్ని స్థానిక ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని జేసీ సూచించారు.

ఎమ్మెల్సీ కర్రీ పద్మశ్రీ మాట్లాడుతూ.. కాకినాడ లో రైస్ మిల్లర్ల సహకారంతో సామాన్య ప్రజలకు తక్కువ ధరకే సన్న బియ్యం విక్రయించే రిటైల్ షాప్‌ను ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు.దళారీల జోక్యంతో బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలు విపరీతంగా పెరిగిపోయిన నేపథ్యంలో సామాన్య,మధ్యతరగతి ప్రజలు ఇబ్బంది పడకుండా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు.ప్రతి కుటుంబానికి నాణ్యమైన బియ్యాన్ని సరసమైన ధరకే అందించాలనే సంకల్పంతో ఈ ప్రత్యేక విక్రయ కేంద్రాలను అందు బాటు లోకి తెచ్చినట్లు తెలిపారు. ప్రజల సంక్షేమమే ధ్యేయం గా ప్రభుత్వం చేపట్టిన ఈ చక్కటి అవకాశాన్ని కాకినాడ పట్టణ వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ.. పేద ప్రజల చిరకాల కోరికైన నాణ్యమైన బియ్యాన్ని తక్కువ ధరకే అందించే బృహత్తర కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం నేటి (ఆగస్టు 03) నుంచి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన ప్రతి మాటనూ నిలబెట్టు కుంటూ ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి,సంక్షేమం జోరుగా సాగుతున్నాయని,ముఖ్యం గా పేద ప్రజల ఆకాంక్షలకు అను గుణంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు.నాణ్యమైన స్టీమ్ మరియు బాయిల్డ్ బియ్యం పేద ప్రజలకు రేషన్ కార్డుల ద్వారా అందజేస్తున్న బియ్యం లో నాణ్యమైన స్టీమ్ బియ్యం అందిస్తే బాగుంటుందనే ప్రజాభి ప్రాయాన్ని ప్రభుత్వం గౌరవించిందన్నారు. ఇందు లో భాగంగా నేడు రైతు బజార్‌లో కేజీ రూ.62ల విలువైన స్టీమ్ బియ్యాన్ని,అలాగే రూ.58 ల విలువైన బాయిల్డ్ రైస్‌ను ప్రత్యేక రాయితీ తో కేవలం రూ. 50 నుండి రూ. 62 ధరలకే 10 కేజీల చొప్పున పంపిణీని ప్రారంభించడం జరిగిందన్నారు.ప్రజల కోరిక మేరకు నాణ్యమైన బియ్యం అందించాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం విజయ వంతంగా నెరవేరుస్తోందని,రైస్ మిల్లుల యజమానులు ఇతర మిల్లు యజమానులు తమ వంతు సామాజిక బాధ్యతగా ప్రభుత్వానికి సంపూర్ణ సహకారం అందించారనన్నారు..రైస్ మిల్లు యజమానులందరికీ ఎమ్మెల్యే కొండబాబు కూటమి ప్రభుత్వం తరపున ప్రత్యేక అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్యమంత్రిచంద్రబాబు నాయుడు ముఖ్య మంత్రి గా ఉన్న కాలంలోనే రైతులు తాము పండించిన పంటను దళారీ వ్యవస్థ చేతిలో మోసపోకుండా స్వయంగా అమ్ముకోవడానికి, వినియోగదారులకు గిట్టుబాటు ధరలకు అందించడానికి 'రైతు బజార్లు' అనే అద్భుతమైన వ్యవస్థను తీసుకువచ్చారని ఎమ్మెల్యే కొండబాబు గుర్తు చేశారు.నేడు ఈ రైతు బజార్ల ద్వారా వినియోగ దారులకు తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం ఉత్పత్తులు అందుబాటు లోకి వస్తున్నాయని,ఇది నాటి ముఖ్య మంత్రి చంద్రబాబు దూరదృష్టికి నిదర్శనమని ఎమ్మెల్యే కొనియాడారు.తూరంగి రైతు బజార్ లో బియ్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ..కాకినాడ రూరల్ నియోజకవర్గం సంబంధించి తోరంగి జగ్గా దేవి గుడి దగ్గర ఉన్న రైతు బజార్ లోబియ్యం విక్రయ కేంద్రాన్ని కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ.. జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ తో కలిసి ప్రారంభించారు.

**తక్కువ ధరకే నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ..: ఎమ్మెల్యే పంతం నానాజీ**

ఎన్నికల్లో ఎలాంటి హామీ ఇవ్వక పోయినా,సామాన్య ప్రజల అవసరాలను గుర్తించి ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం అద్భుతమైన నిర్ణయం తీసుకున్నట్లు కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్, సివిల్ సప్లైస్ మంత్రి నాదెండ్ల మనోహర్ ల ఆధ్వర్యంలో రైస్ మిల్లుల నుంచి నేరుగా కష్టమర్లకు తక్కువ ధరకే నాణ్యమైన బియ్యాన్ని అందిస్తున్నట్లువెల్లడించారు.బయట మార్కెట్ లో రూ.70 నుంచి రూ.80 వరకు పలికే స్టీమ్డ్ రైస్ రూ.52లకే, మామూలు బియ్యం రూ.50లకే రైతు బజార్లు మరియు ప్రత్యేక రైస్ మిల్లు కౌంటర్లలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. సామాన్యులకు మేలు చేసే ఈ ప్రభుత్వ నిర్ణయంపై కాకినాడ రూరల్ తరపున సీఎం, డిప్యూటీ సీఎం మరియు సివిల్ సప్లైస్ మంత్రులకు ఎమ్మెల్యే పంతం నానాజీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి టి ప్రసన్న లక్ష్మీదేవి,ఎడి మార్కెటింగ్ భారతి, కాకినాడ రూరల్ తహశీల్దార్,రైతు బజార్ల ప్రతినిధులు,రైస్ మిల్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


# ట్రయల్ కేసులపై ప్రత్యేక దృష్టితో మరో కేసులో శిక్ష ఖరారు

ప్రజాభూమి ప్రతినిధి కాకినాడ



కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఆదేశాల మేరకు ట్రయల్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి సమర్థవంతంగా వాదనలు వినిపించడం ద్వారా మరో కీలక కేసులో నిందితులకు శిక్ష పడింది. డాక్టర్ ఎం. కిషోర్ కుమార్, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) మరియు ఇంచార్జ్ కాకినాడ సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ పర్యవేక్షణలో సర్పవరం పోలీస్ స్టేషన్ క్రైమ్ నెం. 387/2024 సెక్షన్ 103(1) (ఎస్.సి. నెం. 69/2025) కేసులో గౌరవ న్యాయస్థానం నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష మరియు రూ. 5000/- రూపాయలు జరిమానా విధించడమైనది. ఒడిశా రాష్ట్రంనకు చెందిన మిల్లు స్వాయిన్ , అతని భార్య రితాంజలి తమ మూడు సంవత్సరాల కుమారుడితో ఉపాధి నిమిత్తం కాకినాడ జిల్లా, కాకినాడ రూరల్, సర్పవరం గ్రామం శివారు భావనారాయణపురం, పోస్టల్ కాలనీ నందు ఇల్లు అద్దెకు తీసుకుని కాపురం ఉంటున్నట్లు, భర్త మిల్లు స్వాయిన్, ఆటోనగర్ లో గల ప్లాస్టిక్ కంపెనీ యందు కూలి పనిచేయుచు ప్రతిరోజు మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యను కొట్టడం, తిట్టడం మరియు అనుమానించడం చేసేవాడని, ది. 16/7/2024 వ తేదీ ముందు మూడు రోజుల నుంచి మిల్లు స్వాయిన్, పనికి వెళ్లకుండా మద్యం తాగి తన భార్యను కొడుతున్నట్లు, బంధువులు సర్ది చెప్పి, కాపురం చేసుకోమని చెప్పినట్లు, తరువాత మధ్యాహ్నం 12-00 గంటలకు పిర్యాది అయిన లిపి బిసోయ్ మృతిరాలికి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చినట్లు, అంతట ఆమె తన బావను మృతిరాలి ఇంటికి పంపగా, మృతిరాలు తన ఇంటిలోని బెడ్ రూమ్ లో రక్తపు మడుగులో చనిపోయి వున్నట్లు, భర్త మిల్లు స్వాయిన్ తన భార్యను అనుమానంతో ఆమె తలను గోడకేసి కొట్టినట్లు ఫిర్యాదు లిపి బిసోయి, w/శ్రీ జితేంద్ర బిసయి. ఖైరపుట్టి గ్రామం, గంగాపూర్ మండలం, గంజం జిల్లా, ఒడిస్స రాష్ట్రము ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి సర్పవరం పోలీసు స్టేషన్ సబ్-ఇన్‌స్పెక్టర్ బి. అజయ్ బాబు కేసు నమోదు చేయగా, సర్పవరం పోలీసు స్టేషన్ ఇన్స్పెక్టర్లు శ్రీ వై ఆర్ కె శ్రీనివాస్ మరియు దీ. పెద్దిరాజు దర్యాప్తు చేపట్టి నిందితుడు మిల్లు స్వాయిన్, s/o అకులి స్వాయిన్, 31 సం., కుల్లంగి గ్రామం, గంగాపూర్ మండలం, గంజం జిల్లా, ఒడిస్స రాష్ట్రము అనువానిని అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించారు. అనంతరం చార్జిషీట్ దాఖలు చేశారు.ఈ కేసును గౌరవ నాలుగవ జిల్లా కోర్ట్ కాకినాడ జడ్జి కె. నాగమణి విచారించి, నిందితుడు పై అభియోగాలు ఋజువయ్యాయని నిర్ధారిస్తూ ఈరోజు నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష మరియు రూ. 5000/- రూపాయలు జరిమానా విధించడమైనది. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి వి ఎమ్ జయ లక్ష్మి గారు సమర్థవంతంగా వాదనలు వినిపించారు. కోర్టు విధుల్లో కె సతీష్ కోర్టు కానిస్టేబుల్‌గా వ్యవహరించారు.ఈ సంధర్భంగా ఎస్పీ గారు పై కేసులో శిక్ష పడుటలో కీలక పాత్ర పోషించిన దర్యాప్తు అధికారులను, పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీమతి పి వి ఎమ్ జయ లక్ష్మి గారిని, సకాలంలో సాక్షులను ప్రవేశ పెట్టుటలో సహకరించిన కోర్టు కానిస్టేబుల్ కె సతీష్ ను, సర్పవరం ఇన్స్పెక్టర్ శ్రీ సి ఎచ్ ప్రకాష్ ప్రత్యేకంగా అభినందించారు.

## 1వ వార్డు కొత్తూరులో గడపగడపకు వైఎస్సార్



ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం

రామచంద్రపురం టౌన్ పరిధిలో గల 1వ వార్డు కొత్తూరులో నిర్వహించిన గడపగడపకు వైఎస్సార్ కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ , డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా యువజన విభాగ అధ్యక్షులు, రామచంద్రపురం వైఎస్సార్సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ ఆపార్టీ శ్రేణులుతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రజలతో ముఖాముఖిగా మాట్లాడిన నాయకులు గత ప్రభుత్వ హయాంలో అమలైన సంక్షేమ కార్యక్రమాలు, ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న పరిస్థితులపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వ పాలనకు మధ్య ప్రజలు గమనిస్తున్న తేడాలను తెలుసుకుంటూ ప్రతి కుటుంబంతో ఆప్యాయంగా మమేకమయ్యారు. ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా వైఎస్సార్సీపీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుందని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.